# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం13 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 158 | పేజీలు:12 | వెల రూ.5


HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


గంజాయి స్మగ్లింగ్.. దొరికిన మోడల్



2

132 అడుగుల మొబైల్ టవర్ మాయం!



2

## యథావిధిగా మెడికల్ బోర్డు

- అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు
- సింగరేణి యాజమాన్యానికి భట్టి ఆదేశం
- నేడు మంచిర్యాలలో కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



**హైదరాబాద్,జూన్12(మనం న్యూస్) :** సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని తెలిపారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకునేక్రమంలో సింగరేణి కార్మికులకు శుభవార్త తెలిపారు.మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని భట్టి సింగరేణీ యాజమాన్యానికి సూచించారు. ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో నేడు ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని, ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ...మిగతా 2లో

## కిమ్ బాటలో కమలం నేతలు

**ఉత్తర కొరియాలో ఎన్నికలు జరుగుతయ్**

- కానీ...ఫలితాలు కిమ్ చెప్పినట్లే..
- బీజేపీ బలం లేకపోయినా బరిలోకి దింపారు
- రిటర్నింగ్ ఆఫీసరా.. బీజేపీ కార్యకర్తా...?
- ఓట్ చోరీ ముగిసింది.. సీట్ చోరీ మొదలైంది
- పవన్ కల్యాణ్ రావొచ్చు.. పోవచ్చు
- ఏపీలోనూ చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు
- హిట్లర్ ఆదర్శమని ఎక్కడా చెప్పలేదు
- రాష్ట్రంలో కేటీఆర్.. కిషన్‌రెడ్డిల డ్రామా నడుస్తోంది
- ఢిల్లీలో మీడియాతో సీఎం చిట్‌చాట్



**హైదరాబాద్,జూన్ 12(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** దేశంలో బీజేపీ నేతలు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను ఆదర్శంగా తీసుకుని రాజకీయాలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ, తెలంగాణలో పవన్ కల్యాణ్ పర్యటన, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయాలపై మీడియా చిట్‌చాట్‌లో ప్రస్తావించారు. కమలం నేతలు కిమ్‌జోంగ్ తరహాలో ప్రవర్తిస్తున్నారని, ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. బీజేపీ ఇప్పటిదాకా గాడ్సేను ఆదర్శంగా తీసుకుందని అనుకున్నామని, అయితే ఇప్పుడు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను ఆదర్శంగా తీసుకుందంటూ సీఎం ఎద్దేవ చేశారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ లాగనే బీజేపీ నేతలు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారన్నారు. ఇంతకాలం ఓట్ చోరీకి పాల్పడిన బీజేపీ తాజాగా సీట్ చోరీ మొదలుపెట్టిందన్నారు.

దేశంలో పలు రాష్ట్రాలలో ఓట్ చోరీకి పాల్పడిన తాజాగా సీట్ చోరీ కూడా మొదలుపెట్టిందని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో అసలు కేసు లేదని, ఇందులో రిటర్నింగ్ అధికారి కమలం పార్టీ కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపించారు. సంఖ్యా బలం లేకపోయినా మధ్యప్రదేశ్‌లో మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మధ్యప్రదేశ్లో బీజేపీకి నంబర్ లేకపోయినా, పోటీలో ఎందుకు నిల్చున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో అటు ప్రజాస్వామ్య వ్యతిరేకిగా, ఇటు మహిళా వ్యతిరేకిగా బీజేపీ నిలబడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదం నుంచి బయటపడేందుకే ఆ పార్టీ తమపై నేరపూరిత దాడికి దిగిందన్నారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని సీఎం తీవ్ర ...మిగతా 2లో



### మీనాక్షి నటరాజన్‌కు ‘సుప్రీం’ షాక్

- నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత

**ఢిల్లీ, జూన్ 12:** కాంగ్రెస్ నాయకురాలు, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ఛార్జి మీనాక్షి నటరాజన్కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించారంటూ ఆమె వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది.

జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌ను విచారించింది. మీనాక్షి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. కనీసం రెండేళ్లు జైలు శిక్ష పడే క్రిమినల్ కేసులు కూడా ఆమెపై లేవని పేర్కొన్నారు. కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయన్నారు. వాదనలు విన్న ...మిగతా 2లో

### రాజ్యసభకు ఖర్గే సహా 24 మంది ఎంపీలు ఏకగ్రీవం

**ఢిల్లీ, జూన్ 12:** రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికేట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు.

రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌సీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ...మిగతా 2లో

### హైదరాబాద్‌లో కుండపోత వర్షం

- సీఎం రేవంత్ విమానం బెంగళూరుకు మళ్లింపు
- శంషాబాద్‌లో ల్యాండింగ్‌కు అనుమతివ్వని ఏటీసీ

**హైదరాబాద్,జూన్ 12(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** హైదరాబాద్ నగరంలో శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆకాశం మబ్బులు కమ్మి, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా రహదారులు జలమయం కావడంతో ప్రధాన కూడళ్లలో వాహనాలు కిలోమీటర్ మేర నిలిచిపోయాయి. నగరంలోని కూకట్ పల్లి, అమీర్ పేట్, ఎర్రగడ్డ, మైత్రివనం, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, బేగంపేట, ప్యారడైజ్, ప్యాట్నీ, జేబీఎస్, సికింద్రాబాద్ ఏరియాల్లో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కారణంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రయాణించిన విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వస్తుండగా.. మార్గంమధ్యలో వాతావరణం అనుకూలించలేదు. దీంతో పైలట్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. శంషాబాద్ లో విమానం ల్యాండింగ్ కు ఏటీసీ అనుమతి ఇవ్వకపోవడంతో విమానాన్ని అటువైపు మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

### మనోళ్లే అమెరికాలో గొప్పోళ్లు

- వలసదారుల్లో 27 మంది భారతీయులు
- 250 మందితో ఫోర్బ్స్ జాబితా విడుదల




**వాషింగ్టన్, జూన్ 12:** అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో.. ఆ దేశంలో జీవించి ఉన్న అతిగొప్ప వలసదార్ల జాబితాను ఫోర్బ్స్ విడుదల చేసింది. 250 మందితో కూడిన ఈ జాబితాలో 27 మంది భారత సంతతి వ్యక్తులు కావడం విశేషం. దేశ ఆర్థిక వ్యవస్థ, సమాజం, సైన్స్, సంప్రదాయం, ప్రజా జీవితాల్లో పెను మార్పులు తెచ్చిన వ్యక్తులతో ఈ జాబితాను ఫోరబ్స్ రూపొందించింది. ఆధునిక అమెరికాను రూపుదిద్దడంలో ప్రముఖ పాత్ర వహించిన వ్యాపారవేత్తల నుంచి మీడియా దిగ్గజాల వరకు ఇందులో చోటు చేసుకున్నారు.

దిగ్గజాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల వరకు భారత్ నుంచి గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, మైక్రాన్ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, పెప్సికో మాజీ అధిపతి ఇంద్రా నూయి, సైబర్సెక్యూరిటీ ఔత్సాహిక పారిశ్రామికవేత్త జయ్ చౌధరీ, వెంచర్ క్యాపిటలిస్ట్ వినోద్ ఖోస్లా, ఇన్వెస్టర్ నవల్ రవికాంత్ వంటి దిగ్గజాలు ఉన్నారు. 2019లో ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పొందిన అభిజిత్ బెనర్జీ, టెలివిజన్ వ్యాఖ్యాత - రచయిత పద్మ లక్ష్మీ, వితరణశీలి నీర్జా సేథి వంటి వారూ ఉన్నారు. ఐబీఎమ్ సీఈఓ అరవింద్ కృష్ణ, అడోబ్ సీఈఓగా వ్యవహరించిన శంతను నారాయణ్, సైబర్ సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్ నికేశ్ అరోరా, కన్ఫ్లూయెంట్ సహ వ్యవస్థాపకుడు నేహా నర్ఖెడే, ఇన్వెస్టర్ కవితార్క్ రామ్ శ్రీరామ్ కూడా ఉన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలైన జ్యోతి బన్సల్, అమన్ నారంగ్, రాజ్ సర్దానా, జితేంద్ర మోహన్, స్వచ్ఛ ఇంధన దిగ్గజం కేఆర్ శ్రీధర్ వంటి వారూ ఈ జాబితాలో కనిపించారు.


అమెరికాకు వలస వచ్చి, ఆ దేశ రూపురేఖల్ని మార్చివేసిన అయిదుగురు వలసదారుల్లో కాలిఫోర్నియా మాజీ గవర్నర్ - నటుడు ఆర్నాల్ ష్వార్జెనగర్ (ఆస్ట్రియా), టెస్లా - స్పేస్ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ (దక్షిణాఫ్రికా), గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్ (రష్యా), ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ (తైవాన్), మీడియా దిగ్గజం రూపర్ట్ మర్డోక్ (ఆస్ట్రేలియా) ఉన్నారు. వలసలపై అమెరికాలో రాజకీయ దుమారం రేగుతున్న ఈ సమయంలో ఈ జాబితా వెలువడడం గమనార్హం.

### చైనాపై ‘సముద్ర జీవుల’ గూఢచర్యం..!



**బీజింగ్, జూన్ 12:** తమ దేశ రహస్యాలను తెలుసుకునేందుకు శత్రు దేశాలు తాబేళ్లు, చేపలను ఉపయోగిస్తున్నాయని చైనా ఆరోపించింది. తమ రహస్యాలు తెలుసుకోవడానికి పశ్చిమ దేశాల గూఢచారులు చైనా తీర ప్రాంతాల్లోని తాబేళ్లు , చేపలు వంటి సముద్ర జీవాలకు సెన్సర్లు అమర్చి వదులుతున్నట్లు చైనా మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. సున్నితమైన సముద్ర సమాచారాన్ని దొంగిలించడానికి అంతర్జాతీయ గూఢచార సంస్థలు సరికొత్త పరికరాలను వినియోగిస్తున్నాయని పేర్కొంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ దేశాలకు హెచ్చరికలు చేసింది చైనా తీర జలాల్లో సెన్సర్లు అమర్చిన పలు తాబేళ్లు, చేపలను గుర్తించినట్లు చైనా భద్రతా మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ జీవులు ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఈదుతూ నీటి ఉష్ణోగ్రత, లవణీయత, సముద్ర ప్రవాహం వంటి సముద్ర పర్యావరణానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈవిధంగా సేకరించిన డేటాను ఉపయోగించి తమ జాతీయభద్రతకు తీవ్ర ముప్పును కలిగించడానికి పశ్చిమదేశాలు కుట్ర పన్నుతున్నాయని బీజింగ్ ఆరోపించింది. దీంతో ఇకపై విదేశాల నుంచి చైనాకు వచ్చే నౌకలు, పరికరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించింది. సముద్రంలో ఏవైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని మత్స్యకారులకు సూచించింది.

### ఇరాన్‌తో డీల్ కోసం.. ‘యురేనియం’పై మెట్టు దిగిన ట్రంప్..!



**వాషింగ్టన్, జూన్ 12:** ఇరాన్‌తో డీల్ దాదాపు కొలిక్కివచ్చిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ప్రకటించారు. గతంలో కూడా ఆయన పలుమార్లు ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ.. ఈసారి మాత్రం ఒప్పందం ఖరారయ్యే సంకేతాలే కన్పిస్తున్నాయి. ఇందుకోసం ట్రంప్ ఓ మెట్టు దిగి మరీ ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా సంస్థ సంచలన కథనం వెల్లడించింది. ఇరాన్‌లో శుద్ధి చేసిన యురేనియం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ దేశం చేతుల్లో ఉండొద్దని ట్రంప్ గత కొంతకాలంగా డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. దాన్ని అమెరికాకు అప్పగించాలని లేదంటే నాశనం చేయాలని ఆయన అంతకుముందు చెప్పారు. అయితే, తాజా చర్చల్లో దీనిపై ట్రంప్ కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్‌లోనే ఉంచేందుకు ఆయన అంగీకరించినట్లు సమాచారం. అయితే, అది ఐరాస ఇన్స్పెక్టర్ల పర్యవేక్షణలోనే ఉండాలని మెలిక పెట్టారట. ఇక, అణు కార్యక్రమాలపై టెహ్రాన్ ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా.. అది అమెరికాతో రెండో డీల్ కుదిరిన తర్వాతేనని ట్రంప్ షరతు విధించినట్లు తెలుస్తోంది. తాజా అవగాహన ఒప్పందంలో భాగంగా 30 రోజుల్లోపు హర్మూజ్ జలసంధిని ఎలాంటి టోల్ రుసుములు లేకుండా నౌకల రవాణాకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా.. అమెరికా ఈ జలమార్గంలో నిర్బంధాన్ని ఎత్తివేయనుంది. ఇక, హర్మూజ్‌ను తెరిచిన తర్వాత 60 రోజుల పాటు ఇరాన్‌కు అగ్రరాజ్యం ఆంక్షల మినహాయింపు కల్పించనుందని తెలుస్తోంది. అంటే టెహ్రాన్ చమురు విక్రయాలు చేపట్టేందుకు అనుమతులివ్వనుంది. ఆ తర్వాత ఇరాన్ ప్రవర్తనను ...మిగతా 2లో

### దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి 30ఏళ్ల జైలు

**ఇప్పటికే జీవితఖైదు అనుభవిస్తున్న యూన్**



**సియోల్, జూన్ 12:** దేశంలో మార్షల్ లా విధించిన కేసులో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. కాగా 2024 అక్టోబర్లో ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపినందుకు గాను ఆయనకు మరో 30ఏళ్లు జైలు శిక్ష విధిస్తున్నట్లు దక్షిణ కొరియాలోని కోర్టు తీర్పు వెలువరించింది. కిమ్ సేనను రెచ్చగొట్టేందుకే ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు ఆయన విధించిన ‘మార్షల్ లా’ విఫలమవడంతో ఓ సాకు సృష్టించుకోవడానికి ఈ చర్యలకు పాల్పడినట్లు వెల్లడించింది. యూన్‌తో పాటు, ...మిగతా 2లో

# గంజాయి స్మగ్లింగ్.. దొరికిన మోడల్

**ముంబయి, జూన్ 12:** గంజాయి స్మగ్లింగ్ చేస్తూ ఓ మోడల్ అడ్డంగా దొరికిపోయింది. తన అనుమానాస్పద ప్రవర్తనతో అధికారులకు చిక్కి.. ఎయిర్పోర్టు నుంచి నేరుగా జైలు పాలైంది. ముంబయి విమానాశ్రయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

కేరళకు చెందిన 28ఏళ్ల హర్ష సన్నీ బ్యాంకాక్ నుంచి ముంబయిలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. అయితే, ఆమె ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు అడ్డుకున్నారు. ఆమె ట్రాలీబ్యాగ్‌ను తనిఖీ చేయగా.. 12 ప్లాస్టిక్ ప్యాకెట్స్ బయటపడ్డాయి. అందులోని పదార్థమంతా ఆకుపచ్చరంగులో ఉండటంతో ఎయిర్‌పోర్టులోనే నార్కో పరీక్షలు నిర్వహించారు. ఆ పదార్థాన్ని గంజాయిగా గుర్తించారు. ప్యాకెట్ల బరువు 11 కేజీలు ఉండగా.. ఆ డ్రగ్ విలువ దాదాపు రూ.11.82 కోట్ల వరకు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. నిషేధిత మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కింద ఆమెను ఎయిర్‌పోర్టులోనే అరెస్టు చేసి.. కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆ మోడల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. ఇక, ఆ సరకును దేశంలోని ఏ ప్రాంతానికి తరలించడానికి ఆమె తీసుకువచ్చిందనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ హర్ష సన్నీ 2025లో జరిగిన మిసెస్ కేరళ పోటీదారు కావడం గమనార్హం.

# 132 అడుగుల మొబైల్ టవర్ మాయం!

**బక్సర్, జూన్ 12:** సాధారణంగా విలువైన ఆభరణాలు, వస్తువులు.. వాహనాలు కూడా చోరీకి గురవుతుండటం చూస్తుంటాం. కానీ, బీహార్‌లో మాత్రం వింత ఘటన చోటుచేసుకుంది. బక్సర్ జిల్లాలో ఏకంగా ఓ భారీ మొబైల్ టవర్తోపాటు జనరేటర్ మాయం కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

బక్సర్‌కు సమీపంలోని దుమ్రావ్ పట్టణంలో 2010లో ఓ ప్రైవేటు టెలికాం సంస్థ 132 అడుగుల టవర్ను ఏర్పాటు చేసింది. ఇందుకోసం స్థలం యజమాని హరేనాథ్ యాదవ్‌తో 12 ఏళ్ల కాలానికి ఒప్పందం చేసుకుంది. అయితే, అది 2022తో ముగిసిపోయింది. అప్పటి నుంచి యజమానికి ఆ కంపెనీ నుంచి చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో ఆయన టెలికాం సంస్థకు పలుమార్లు నోటీసులు పంపించాడు. అయినప్పటికీ ఎటువంటి స్పందన లేదని సమాచారం. ఈ క్రమంలోనే ఇటీవల మరమ్మతుల కోసం అక్కడకు చేరుకున్న కంపెనీ ప్రతినిధులు.. జనరేటర్‌తో సహా టవర్ లేకపోవడం చూసి అవాక్కయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, సుదీర్ఘ కాలంగా టవర్ ఇక్కడే ఉందని, గత 15-20 రోజులుగానే కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ పని ఎవరు చేసుంటారా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని, స్థలం యజమానిని కూడా ప్రశ్నిస్తామని జిల్లా పోలీసులు తెలిపారు.

# 'యురేనియం'పై మెట్టు దిగిన ట్రంప్..!

(మొదటి పేజీ తరువాయి)

బట్టి ఈ మినహాయింపులను మరికొన్ని రోజులు పొడిగించే అంశాన్ని కూడా అమెరికా పరిశీలించనుంది. కాగా.. ఒప్పందంపై ఈసారి చర్చలకు సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఎలాంటి ముందస్తు సమాచారం లేదని సదరు కథనం పేర్కొంది. ఇరాన్‌తో డీల్ విషయంలో ట్రంప్.. ఆయనను దూరం పెట్టినట్లు సమాచారం. దీంతో అమెరికా మిత్రపక్షాలకు ఫోన్ చేసి నెతన్యాహు సమాచారం సేకరించారని అగ్రరాజ్య విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత ట్రంప్.. నెతన్యాహుకు ఫోన్ చేసి విషయం చెప్పారు.

ఇరాన్-అమెరికా మధ్య ఈసారి డీల్ జెనీవాలో జరగనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దీనిపై సంతకాలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే పర్యటన ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయట. అమెరికాకు చెందిన నాలుగు ఎయిర్‌ఫోర్స్ సీ-17 విమానాలు ఇప్పటికే యూరప్‌కు బయల్దేరాయి. ఇందులో వాన్స్ పర్యటనకు అవసరమైన వాహనాలు, ఇతర పరికరాలను తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ వారాంతంలోగా డీల్ కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

యూఏఈ, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ అధికారుల మధ్య బుధవారం రాత్రి కొన్ని గంటల పాటు చర్చలు జరిపాయి. ఇందులో ఒప్పందంపై ఇరుదేశాలు ఓ అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తమ ప్రతిపాదనలను ఇరాన్ అంగీకరించిందని, ఇక సంతకాలే తరువాయి అని ఆయన వెల్లడించారు. అయితే దీనిపై ఇరాన్ మాత్రం అధికారిక ప్రకటనేదీ చేయలేదు. ఈ ఒప్పందంలోని అంశాలను టెహ్రాన్ ప్రతినిధులు కూడా సమ్మతించారని సమాచారం. అయితే దీనికి సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అంగీకరిస్తారా? లేదా అనే దానిపై స్పష్టత లేదు.

# మాజీ అధ్యక్షుడికి 30ఏళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యాన్, డిఫెన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ మాజీ అధిపతి యో ఇన్ హ్యాంగ్, డ్రోన్ ఆపరేషన్స్ కమాండ్స్ మాజీ అధిపతి కిమ్ యోంగ్-డేలను న్యాయస్థానం దోషులుగా నిర్ధరించింది. వారికి కూడా జైలు శిక్ష విధించింది. అత్యవసర పరిస్థితిని సృష్టించడం కోసం ఉత్తర కొరియాను రెచ్చగొట్టడానికి నిందితులు సైనిక చర్య అనే ముసుగును ఉపయోగించారని విమర్శించింది. అయితే చెత్త బెలూన్లను తమ దేశంపై ప్రయోగించి.. తమను రెచ్చగొట్టడానికి యత్నించిన ఉత్తర కొరియాకు తగిన బుద్ధి చెప్పడానికే మాజీ అధ్యక్షుడు ఆ దేశంలోకి డ్రోన్లను పంపారని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు.

ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. వారి నుంచి దేశానికి రక్షణ కల్పించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ఆ ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవిని కోల్పోయారు. ప్రస్తుతం ఆయన జైల్లో ఉన్నారు.

# మీనాక్షి నటరాజన్‌కు 'సుప్రీం' షాక్

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం.. నామినేషన్ తిరస్కరణ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టంచేసింది. గతంలో అలాంటి తీర్పులు ఏమైనా ఉంటే కోర్టు ముందు పెట్టాలని సూచించింది. రిటర్నింగ్ అధికారి ఒకసారి అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరిస్తే.. దానిపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించడమే సరైన మార్గమని పేర్కొంది. ఈ పిటిషన్ విచారణకు అర్హత లేదంటూ దాన్ని కొట్టివేసింది. మధ్యప్రదేశ్ రాజ్యసభ సీటుకు కాంగ్రెస్ తమ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌ను ప్రతిపాదించింది. అయితే, రాజ్యసభ సభ్యత్వానికి ఆమె దాఖలు చేసిన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మీనాక్షిపై తెలంగాణలో ఓ కేసు నమోదైందని.. దాన్ని ఆమె తన నామినేషన్ పత్రాల్లో దాచిపెట్టారని రాజ్యసభ మూడో స్థానానికి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

దీంతో ఆమె నామినేషన్‌ను ఆర్వో తిరస్కరించారు. దీన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ఆమెపై ఎలాంటి కేసు నమోదు కాలేదని.. కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని వాదించింది. ఈ నేపథ్యంలోనే రిటర్నింగ్ అధికారి తన నామినేషన్ను తిరస్కరించడాన్ని ఆమె సుప్రీంలో సవాల్ చేయగా.. తాజాగా అక్కడ ఆమెకు ఎదురుదెబ్బ తగిలింది.

# యథావిధిగా మెడికల్ బోర్డు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామని, వీటిలో 555 ఎక్స్‌టర్నల్ పోస్టులు ఉండగా... 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్‌లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామని స్పష్టం చేశారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు.దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని,బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడాకల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమాసదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు.

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు భట్టి వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్‌ను చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024-25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు.

తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు ఆయన పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు.రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామని,పోటీ మార్కెట్‌లోసింగరేణి నిల దొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని భట్టి పేర్కొన్నారు.

## రాజ్యసభకు ఖర్గే సహా

# 24 మంది ఎంపీలు ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది. ఆంధ్రప్రదేశ్‌నుంచి... భాష్యం రామకృష్ణ (టీడీపీ), చింతకాయల విజయ్ (టీడీపీ), సాన సతీష్ బాబు (టీడీపీ), లింగమనేని రమేష్ (జనసేన) గుజరాత్‌నుంచి..రాజూబాయ్ శుక్లా, మాన్‌సింహ్ పర్మార్, ముఖేష్ భాయ్ రథ్వా, జితేంద్ర కంజారియా (ముగ్గురూ బీజేపీ).



కర్ణాటకనుంచి..మల్లికార్జున్ ఖర్గే, మన్సూర్ అలీఖాన్, పవన్ ఖేరా (ముగ్గురూ కాంగ్రెస్), ఎం.నాగరజ (బీజేపీ). మధ్యప్రదేశ్ నుంచి..తరుణ్ చుగ్, రజనీశ్ అగర్వాల్, మహేశ్ కేవట్ (ముగ్గురూ బీజేపీ). రాజస్థాన్‌నుంచి... సతీష్ పూనియా (బీజేపీ), ఆల్కా గుర్జర్ (బీజేపీ), నీ రజ్ డాంగి (కాంగ్రెస్) అరుణాచల్ ప్రదేశ్‌నుంచి...తై తగాక్ (బీజేపీ) మేఘాలయ నుంచి..జేమ్ కె సంగ్మా (ఎన్పీపీ) మణిపూర్‌నుంచి...అధికారిమయూమ్ శారదా దేవి (బీజేపీ),తమిళనాడునుంచి..ప్రవీణ్ చక్రవర్తి (కాంగ్రెస్) మహారాష్ట్ర నుంచి..రాజేంద్ర జైన్ (ఎన్సీపీ) ఒడిశా నుంచి..దేబశీష్ సమంతరాయ్ (బీజేపీ) ఇక జార్ఖండ్, మిజోరంపైనే అందరి దృష్టి కాగా, ఇప్పుడు అందరి దృష్టి జార్ఖండ్, మిజోరం రాజ్యసభ ఎన్నికలపైనే ఉంది. జార్ఖండ్లో రెండు రాజ్యసభ సీట్లు ఉండగా, ముగ్గురు పోటీలో ఉన్నారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నేత బైద్యనాథ్ రామ్, కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రణవ్ ఝా, స్వతంత్ర అభ్యర్థి పరిమళ్ నాథ్వాని పోటీ చేస్తున్నారు. జార్ఖండ్‌లో ఇండియా కూటమికి 56 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఒక్కో సీటు గెలుపొందడానికి 28 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం కావాలి. ఎన్డీయేకు 24 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. జేఎల్ఎంకేకు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా ఉన్న నాథ్వాని గెలవాలంటే క్రాస్ ఓటింగ్ జరగాలి. మరోవైపు, మిజోరంలో ఒక రాజ్యసభ సీటు ఉండగా, జడ్పీఎం ప్రతినిధి కె.లామ్మ్లాంగ్ కిమా, ఎంఎన్ఎఫ్ నేత జోథాన్‌సింగి హ్మార్ ఎన్నికల బరిలో ఉన్నారు. 40 మంది సభ్యుల మిజోరం అసెంబ్లీలో జడ్పీఎంకు 27 మంది, ఎంఎన్ఎఫ్‌కు 10 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీకి ఇద్దరు, కాంగ్రెస్‌కు ఒక ఎమ్మెల్యే ఉన్నారు.

# కాంగ్రెస్‌లోనే ద్రోహులుండొచ్చు?

- మీనాక్షి అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కాంగ్రెస్ వర్గాలే
- రేవంత్ పాలన..అభివృద్ధి కంటే ప్రచారానికే ప్రాధాన్యత : కేటీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** జాతీయ కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం నాడు ఏర్పాటుచేసిన మీడియా



సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని ఆరోపిస్తూ... , అదే విధంగా మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంపైనా కూడా సిట్ విచారణ జరపాలని ఎద్దేవా చేశారు. మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉంటారని కేటీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని ఆయన పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో? కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని కేటీఆర్ సూచించారు.

ఇదిలాఉంటే, తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కేటీఆర్ తనదైన శైలీలో తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇటీవల తాజాగా కురిసిన ఒకే ఒక్క వర్షానికి నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని ఆయన వ్యాఖ్యానించారు. త్వరలో కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే?.. బీఆర్ఎస్ చూస్తు ఊరుకోదని, కేంద్ర నిర్ణయాన్ని ఖచ్చితంగా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన హెచ్చరించారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం

- ప్రాజెక్టు ఎన్ఓసీ కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి : మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,జూన్12(మనం న్యూస్):** గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క-సారక్క బ్యారేజ్ అనుమతుల సాధనలో మరో కీలక ముందడుగు పడిందని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌కుగురువారం రాత్రి వచ్చిన ఛత్తీస్‌ఘఢ్‌ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తో పార్క్ హయత్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారుల బృందంతో కలిసి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌ఘఢ్ -తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన అభ్యంతర రహిత పత్రం, ఎన్ఓసీ జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున విజ్ఞాపన పత్రాన్ని ఛత్తీస్‌ఘఢ్ సీఎంకు అందజేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాల వినియోగం, పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ఉత్తమ్ తెలిపారు. సమ్మక్క-సారక్క బ్యారేజ్ తెలంగాణ రైతాంగానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని వివరించారు. ఛత్తీస్‌ఘఢ్ సీఎం తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని, అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఈ పరిణామం సమ్మక్క-సారక్క ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో కీలక మలుపుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర జల సంఘంలోని అంతర్రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని ఉత్తమ్ వెల్లడించారు. ఎన్ఓసీ లేకపోవడం వల్ల మాత్రమే డీపీఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని ఛత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని మంత్రి తెలిపారు. మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందని ఉత్తమ్ పేర్కొన్నారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్లో ఛత్తీస్‌ఘఢ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు వివరించారు. ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులుకొనసాగుతున్నాయని తెలిపారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములు గుర్తించిన పక్షంలో చట్టబద్ధంగా పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే పరిహార మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టు మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకంలో ఉన్నాయన్నారు.గోదావరి నదిపై కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి ఎస్సారెస్పీ స్టేజ్-2 ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడిందన్నారు. 2009 ఫిబ్రవరి 10న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.27 ద్వారా ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించిందని, 2012 మార్చి 2న కేంద్ర జల సంఘం డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు.

# కిమ్ బాటలో కమలం నేతలు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శలు చేశారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డి ముఖ్య కారణమన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా ఆయనే అడ్డుపడ్డారని, తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా? అని కిషన్ రెడ్డిని నిలదీశారు. కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే తనకు చెప్పారన్నారు. పోలవరం కోసం నాలుగు మండలాలను ఏపీలో కలిపారని, అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా అని సూటిగా ప్రశ్నించారు. మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! అని ప్రశ్నించారు. కేటీఆర్ కనుసైగ చేస్తే కిషన్ రెడ్డి డ్యాన్స్ చేస్తున్నారని, ఈటెల రాజేందర్ కు పేరు వస్తుందని మల్కాజి గిరిలో మెట్రో రైల్ ను అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల గురించి చెప్పాలని పలుమార్లు అడిగినా.. వారిదగ్గరి నుంచి స్పందన లేదన్నారు. మోదీకి కిషన్ రెడ్డి ఇప్పటివరకూ రాష్ట్రంలో ప్రాజెక్టుల పనులపై ఒక్క లేఖ అయినా రాశారా అని చిట్ చాట్ లో నిలదీశారు. ఐఎఫ్ఎస్‌సీ నుంచి రావలసిన అప్పును కూడా కిషన్ రెడ్డే అడ్డుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ నుంచి గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు.. రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయడం లేదని దుయ్యబట్టారు.

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు ఎలాంటి ఇబ్బంది లేదని సీఎం అన్నారు. తెలంగాణలో ఎవరైనా రాజకీయాలు చేయవచ్చని, అలాగే ఎక్కడైనా పోటీ కూడా చేసుకోవచ్చన్నారు. ఇటీవల తెలంగాణలో పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై స్పష్టత ఇచ్చారు. ఇది రాజకీయ నిర్ణయం కాదని, భద్రతా పరమైన అంశాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని వివరించారు. తెలంగాణలో కూడా ఎంతో మంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఎన్నికల్లో పోటీ చేశారని, అలాంటి పరిస్థితుల్లో పవన్ కల్యాన్‌ను ఎందుకు అడ్డుకుంటామని ప్రశ్నించారు. తెలంగాణకు ఎవరైనా రావచ్చు.. పోవచ్చు.. పోటీ చేసుకోవచ్చు అంటూ ఆయన వ్యాఖ్యానించారు. కేవలం శాంతి భద్రతలను పరిగణలోకి తీసుకుని మాత్రమే ఆయన సభకు అనుమతి ఇవ్వలేక పోయామని, దీని వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవన్నారు. 'తెలంగాణలో పవన్ కల్యాన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని, ఆయనకు నచ్చినట్లు రాజకీయాలు చేసుకోవచ్చన్నారు. అయితే తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే మా మంత్రులు ఆ విధంగా మాట్లాడారని చెప్పుకొచ్చారు. ఏపీలో జగన్ సభలకు ఎందుకు అనుమతి ఇవ్వట్లేదో పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రజలు, రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే ప్రభుత్వం లేదా ప్రజాప్రతినిధులు సమాధానం ఇవ్వాల్సి వస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు.పవన్ కల్యాన్‌కు దేశ రాజ్యాంగం కల్పించిన అన్ని ప్రజాస్వామ్య హక్కులు ఉన్నాయని, ఆయనకు ఎక్కడైనా వెళ్లే స్వేచ్ఛ ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ప్రధాని మోదీనే తనను కౌగిలించుకున్నారు.. తాను కౌగిలించుకోలేదన్నారు. పాలనలో హిట్లర్ తనకు హిట్లర్ ఆదర్శమని తానెప్పుడూ చెప్పలేదని సీఎం తేల్చిచెప్పారు. ఈక్రమంలో తనకు హిట్లర్ స్ఫూర్తని జరుగుతున్న ప్రచారంపైనా సీఎం స్పష్టత నిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవాళ్లు ఎవరైనా హిట్లర్ ఆదర్శమని అంటారా?మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద చర్చ జరగలేదన్నారు.

# 68మంది మంత్రి పదవికి అర్హులే..!

- కేబినెట్ విస్తరణపై రాహుల్‌గాంధీతో చర్చించలేదు
- సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,జూన్ 11(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన 68 మంది ఎమ్మెల్యేలూ మంత్రి పదవి అర్హులే అని సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే సామాజిక సమీకరణాల దృష్ట్యా 17 మందికే అవకాశం ఉంటుందన్నారు.రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై వస్తున్న ఊహాగానాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో తాను కేబినెట్ విస్తరణ అంశంపై ఎలాంటి చర్చలు జరపలేదని స్పష్టం చేశారు. పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు ఎవరైనా అధిష్ఠానాన్ని కలుసుకునే పూర్తి స్వేచ్ఛ ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన 66 మంది ఎమ్మెల్యేలు మంత్రి పదవికి అర్హులేనని, అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం కేబినెట్‌లో కేవలం 17 మందికే అవకాశం ఉంటుందని సీఎం గుర్తుచేశారు. సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు, సీనియారిటీ, పార్టీ నిబద్ధత వంటి రకరకాల కారణాలతో లోతుగా పరిశీలించిన తర్వాతే మంత్రులుగా ఎంపిక ఉంటుందని రేవంత్ రెడ్డి వివరించారు. సీఎం చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి.



# ప్రజాప్రతినిధుల కోర్టులో తేల్చుకోండి

## పిటిషన్ శ్రీలతకు కోర్టు సూచన

**హైదరాబాద్, జూన్ 12(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ కు రాజ్యసభ్య నామినేషన్ తిరస్కరణ విషయంలో కీలక పాత్ర పోషించిన శ్రీలత దాఖలు చేసిన పిటిషన్ ను కోర్టు విచారించింది. నారాయణపేట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత కంభం శివకుమార్ రెడ్డి తనపై వేధింపులకు పాల్పడి చంపుతానని బెదిరించినా ఆయనపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొంది. అయితే ఈ పిటిషన్ పై కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మినాక్షి నటరాజన్ సహా పిటిషన్ లో పేర్కొన్నవారందరిపై చర్యలు తీసుకోవాలని కోరగా.. ఆ కేసు తమ పరిధిలోకి రాదని పేర్కొంది. పిటిషన్ ను శ్రీలతకు రిటర్న్ చేసి.. ప్రజా ప్రతినిధుల కోర్టులో తేల్చుకోవాలని సూచించింది. కాగా ఈ కేసు విషయంలోనే రాజ్యసభ ఎన్నికలకు మీనాక్షి వేసిన నామినేషన్ రిజెక్ట్ అయింది.

**మీనాక్షిపై కేసు లేదు :**

ఈ కేసు సందర్భంగా సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్ పై ఎలాంటి కేసు లేదన్నారు. ఆమెకు జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగిందని, ఈ పిటిషన్ ను ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ చేశారని తెలిపారు. ఈక్రమంలో సుప్రీంకోర్టులో పిటిషన్ రిజెక్ట్ అవ్వడంపై మీనాక్షి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రజాస్వామ్యానికే ఎదురుదెబ్బగా అభివర్ణించారు. ప్రభుత్వంతో ఎన్నికల అధికారులు కుమ్మక్కయ్యారని తాను మొదటి నుంచీ చెప్తున్నానని, ఎవరూ దానిని పట్టించుకోలేదని ఆరోపించారు.

**ప్రాణభయం ఉంది.. పిటిషనర్ :**

మీనాక్షి నటరాజన్ కేసులో పిటిషనర్‌గా ఉన్న బండారు శ్రీలత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసు వివరాలు ఎలా లీక్ అయ్యాయో తనకు తెలియదని, అనుకోకుండానే కొన్ని వివరాలు బయటకు వచ్చాయని ఆమె స్పష్టం చేశారు. ఈ కేసు కారణంగా తనకు కొంతమంది నుండి ప్రాణభయం ఉందని, తనను కోర్టుకు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తాను ప్రయాణిస్తున్న ఆటోను కొందరు వ్యక్తులు వెంబడించారని శ్రీలత ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తనకు న్యాయం జరిగే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తానని ఆమె తేల్చి చెప్పారు. ఇదే సమయంలో తన రాజకీయ ప్రస్థానంపై వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, తాను ఇంకా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నానని ఆమె స్పష్టం చేశారు.

# ఐసెట్ ఫలితాలు విడుదల

- అధికారిక వెబ్ సైట్‌లో ఫలితాలు, ర్యాంక్ కార్డులు
- జూలై నుంచి ప్రారంభంకానున్న కౌన్సెలింగ్ ప్రక్రియ

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ.. ఐసెట్-2026 ప్రవేశ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ మేరకు ఉన్నతాధికారులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ. బాలకిష్టారెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలతో పాటు అభ్యర్థుల ర్యాంకు కార్డులను సైతం అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మే 13, 14 తేదీల్లో ఈ కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 56,000 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష అనంతరం మే 29న ప్రాథమిక కీని విడుదల చేసిన అధికారులు... తాజాగా తుది ఫలితాలను కూడా ప్రకటించారు. ఈ పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను అనే అధికారిక వెబ్ సైట్‌లో నమోదు చేసి ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ర్యాంకు కార్డులో సెక్షన్ల వారీగా సాధించిన మార్కులు, మొత్తం నార్మలైజ్డ్ స్కోర్, ర్యాంకు వివరాలను పొందుపరిచారు. ఇదిలాఉంటే, జూలై నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుందని అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

# మొహర్రం యాత్రను సజావుగా నిర్వహించాలి

**ప్రతి శాఖ అంకితభావంతో, సమన్వయంతో పనిచేయాలి**

**మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్**



**హైదరాబాద్,జూన్12(మనం న్యూస్):** మొహర్రం సందర్భంగా నిర్వహించే చారిత్రాత్మక బీబీ-కా-ఆలం ఊరేగింపుతో పాటు ఇతర ఏర్పాట్లను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్,మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ అధికారులను అదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మొహర్రం ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిమ్రిస్ ఛైర్మన్ ఫహీమ్ ఖురేషీ, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫియుల్లా, మైనారిటీల సంక్షేమ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్‌లు పోలీసు కమిషనర్‌లు,వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది మొహర్రం ఏర్పాట్లు మరింత మెరుగ్గా ఉండేలా సమర్ధవంతమైన ప్రణాళిక, బలమైన సమన్వయం మరియు పనుల సకాల అమలుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుని లోపాలను గుర్తించి, ముహర్రంను మరింత క్రమబద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమాజ పెద్దలు, మత గురువులు, ఆషూర్‌ఖానా కమిటీల నిర్వాహకులతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ స్థానిక అవసరాలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి పురోగతి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం

**ప్రాజెక్టు ఎన్‌ఓసీ కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ**

**సానుకూలంగా స్పందించిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




**హైదరాబాద్,జూన్12(మనం న్యూస్):** గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క-సారక్క బ్యారేజ్ అనుమతుల సాధనలో మరో కీలక ముందడుగు పడిందని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌కుగురువారం రాత్రి వచ్చిన ఛత్తీస్‌ఘఢ్‌ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తో పార్క్ హయత్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారుల బృందంతో కలిసి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌ఘఢ్ -తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన సమ్మక్క-సారక్క ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన అభ్యంతర రహిత పత్రం, ఎన్‌ఓసీ జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున విజ్ఞాపన పత్రాన్ని ఛత్తీస్‌ఘఢ్ సీఎంకు అందజేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాల వినియోగం, పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని ఉత్తమ్ తెలిపారు.

సమ్మక్క-సారక్క బ్యారేజ్ తెలంగాణ రైతాంగానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని వివరించారు. ఛత్తీస్‌ఘఢ్ సీఎం తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని, అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఈ పరిణామం సమ్మక్క-సారక్క ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో కీలక మలుపుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర జల సంఘంలోని అంతర్రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని ఉత్తమ్ వెల్లడించారు. ఎన్‌ఓసీ లేకపోవడం వల్ల మాత్రమే డీపీఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని ఛత్తీస్‌ఘఢ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని మంత్రి తెలిపారు. మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందని ఉత్తమ్ పేర్కొన్నారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్లో ఛత్తీస్‌ఘఢ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు వివరించారు. ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులుకొనసాగుతున్నాయని తెలిపారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములు గుర్తించిన పక్షంలో చట్టబద్ధంగా పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే పరిహార మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టు మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకంలో ఉన్నాయన్నారు.గోదావరి నదిపై కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి ఎస్సారెస్పీ స్టేజ్-2 ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడిందన్నారు. 2009 ఫిబ్రవరి 10న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.27 ద్వారా ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించిందని, 2012 మార్చి 2న కేంద్ర జల సంఘం డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు.

# ఈ ఖర్చులు భరించలేను?..
# ముంబైలో ఉండలేను?

## హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతివ్వండి?

- **బాంబే హైకోర్టును ఆశ్రయించిన వరవరరావు**
- **రెండు వారాల్లోగా జవాబివ్వండి..**
- **ఎన్ఐఏకు ధర్మాసనం ఆదేశం**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** భీమా కోరేగావ్-ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడైన ప్రముఖ విప్లవ కవి, పి. వరవరరావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంపై బాంబే హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. తన నివాసాన్ని ముంబై నుంచి హైదరాబాద్‌కు మార్చు... అక్కడికి వెళ్లేందుకు అనకు అనుమతించాలని కోరుతూ.. ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలియజేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశిస్తూ న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

జస్టిస్ అజయ్ గడ్కరీ, జస్టిస్ కమల్ ఖాతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌కు విచారించింది. ముంబైలో నివాసం ఉండటం ఆర్థికంగా పెనుభారంగా మారిందని, వృద్ధాప్యంలో ఇక్కడి జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నానని వరవరరావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన నెలవారీ పింఛను సుమారు రూ. 50,000 ఉండగా, ముంబైలో జీవన వ్యయం రూ. 77,000 దాటుతోందని, ఇది తనకు భారంగా మారిందని ఆయన వివరించారు. భీమా కోరేగావ్ కేసులో బెయిల్ పొందిన వరవరరావు, కోర్టు అనుమతి లేకుండా గ్రేటర్ ముంబై పరిధిని దాటి వెళ్లరాదన్న షరతుపై ప్రస్తుతం అక్కడే నివసిస్తున్నారు. ఇదే అభ్యర్థనతో ఆయన గతంలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది మార్చి 16న ఆ పిటిషన్ తిరస్కరణకు గురైంది. సుప్రీంకోర్టు విధించిన బెయిల్ షరతులను సవరించే అధికారం తమకు లేదని ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టులో అరెస్టైన వరవరరావుకు, ఆరోగ్యం క్షీణించడంతో 2021లో బాంబే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం 2022లో సుప్రీంకోర్టు వైద్య కారణాలతో ఆయన బెయిల్‌ను ఖరారు చేసింది. తాజాగా ఎన్ఐఏ తన ప్రత్యుత్తరాన్ని దాఖలు చేసిన తర్వాత ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జరగనుంది.



# రైల్ టికెట్ బుకింగ్.. ఈజీ గురూ

**త్వరలో రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్**

**జులై 15 నాటికి ఐఆర్‌సీటీసీ న్యూ వెబ్ సైట్ ప్రారంభం**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** గత కొన్నేళ్లుగా రైలు టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌లో ఏళ్లుగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలోనే తెరపడనుంది. వెబ్ సైట్‌గా అత్యంత నెమ్మదిగా పనిచేయడం, లోడ్ అవ్వడం, తత్కాల్ సమయంలో సర్వర్లు మొరాయించడం, పేమెంట్ ఫెయిల్యూర్స్ వంటి ఇబ్బందులను అధిగమించేందుకు భారతీయ రైల్వే సిద్ధమైంది. ఇందుకుగానూ జులై 15 నాటికి భారీ మార్పులతో, అత్యంత వేగవంతమైన ఐఆర్‌సీటీసీ.. అధికారిక వెబ్ సైట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త ప్లాట్ ఫ్లామ్ కోట్లాది మంది ప్రయాణికులకు సులభమైన, వేగవంతమైన టికెట్ బుకింగ్ అనుభవాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

### విద్యార్థుల ఫిర్యాదుతో తక్షణ స్పందన

జూన్ 11న జైపూర్‌లోని మాలవీయ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్ఐటీ)లో విద్యార్థులతో జరిగిన ఒక సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్‌లో టికెట్లు బుక్ చేసుకునేటప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులను, ముఖ్యంగా తత్కాల్ సమయంలో వెబ్ సైట్‌లో క్రాష్ అవ్వడం, క్యాప్చా సమస్యలు, డబ్బులు కట్ అయినా టికెట్ కన్ఫర్మ్ కాకపోవడం వంటి అంశాలను విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన అశ్విని వైష్ణవ్, అక్కడికక్కడే రైల్వే అధికారులతో ఫోన్లో మాట్లాడి కేవలం 30 రోజుల్లో కొత్త వెబ్సైట్ను అభివృద్ధి చేసే అవకాశంపై చర్చించారు. అనంతరం, జులై 15 కల్లా కొత్త వెబ్ సైట్‌ను ప్రారంభిస్తామని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

ప్రస్తుతం భారతదేశంలో రైలు టికెట్లలో దాదాపు 88 శాతం ఆన్‌లైన్‌లోనే బుక్ అవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్‌ను భారీగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. దీనివల్ల కీలకమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి. ప్రస్తుతం నిమిషానికి సుమారు 32,000 టికెట్లు బుక్ చేసుకునే సామర్థ్యం ఉండగా, కొత్త వెబ్ సైట్‌లో ఇది దాదాపు ఐదు రెట్లు పెరిగి నిమిషానికి 1.5 లక్షలకు పైగా చేరుకోనుంది. రైళ్ల లభ్యత, వెయిటింగ్ లిస్ట్ వంటి వివరాల కోసం ప్రస్తుతం నిమిషానికి 4 లక్షల విచారణలు సాధ్యం కాగా, ఇకపై ఇది పది రెట్లు పెరిగి 40 లక్షలకు పైగా చేరనుంది. ఈ సాంకేతిక మార్పుల వల్ల పండుగలు, వేసవి సెలవులు, తత్కాల్ బుకింగ్ వంటి అత్యంత రద్దీ సమయాల్లోనూ సర్వర్లు మొరాయించడం, సీట్లు మాయమవడం వంటి సమస్యలు భారీగా తగ్గుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటితో పాటు ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఇకపై టికెట్ బుక్ చేసుకునేటప్పుడే తమకు ఇష్టమైన సీటు లేదా బెర్త్‌ను ఎంచుకునే వెసులుబాటు కూడా కల్పించనున్నారు. అయితే, ఇది కుటుంబాలు, వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే, వివిధ తేదీల్లో ధరలను పోల్చుకునేందుకు 'ఫేర్ క్యాలెండర్', బహుళ ప్రాంతీయ భాషల్లో వెబ్ సైట్‌ను ఉపయోగించుకునే సౌకర్యం, దివ్యాంగులు, విద్యార్థులు, రోగుల కోసం బుకింగ్ ప్రక్రియను సులభతరం చేసే సదుపాయాలను కూడా తీసుకురానున్నారు. ఈ మార్పులు కోట్లాది మంది రైలు ప్రయాణికులకు టికెట్ బుకింగ్ సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించి, ప్రయాణాన్ని మరింత సాఫీగా మారుస్తాయని ఆశిస్తున్నారు.

# రాబోయే తరాలు గర్వించే సమాజాన్ని నిర్మిద్దాం

- **వచ్చే ఎన్నికల కోసం కాదు...వచ్చే తరాల కోసం నిర్ణయాలు తీసుకుందాం**
- **కొణిదెల పవన్ కళ్యాణ్**



**తిరుపతి జూన్ 12మనం న్యూస్:** రాబోయే తరాలు గర్వించే సమాజాన్ని నిర్మించడమే ఓటమి ప్రభుత్వం సమిష్ఠ బాధ్యత అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుదీర్ఘ పాలన, నాయకత్వం, అభివృద్ధి దిశగా దేశాన్ని ముందుకు నడిపించిన విధానాలను ప్రశంసించారు. ఎన్డీఏ కూటమి సమిష్టి కృషితో ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో కూటమి ప్రభుత్వ సమన్వయ కృషి, అలాగే ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదంలో ప్రాణ నష్టం నేపథ్యంలో సభను వాయిదా వేసి మానవతా దృక్పథాన్ని చూపిన నాయకత్వాన్ని ఆయన అభినందించారు.2024 ఎన్నికల్లో ప్రజలు చూపిన తీర్పు ఒక రాజకీయ మార్పు మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్యానికి కొత్త దిశను ఇచ్చిందన్నారు. భయం, అహంకారం, అధికారం కేంద్రీకరణ వంటి అంశాలను ప్రజలు తిరస్కరించారని తెలిపారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం కోసం కాకుండా బాధ్యత పంచుకోవడం కోసం ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ దృష్టి, సీఎం చంద్రబాబు నాయుడు అనుభవం, జనసేన సంకల్పం కలయిక రాష్ట్ర పునర్నిర్మాణానికి బలమైన పునాదన్నారు. జనసేన 21 సీట్లతో పోటీ చేసి ప్రజల నమ్మకంతో 100% స్ట్రైక్ రేట్ సాధించిందని, ఇది త్యాగం ప్రజల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పెంచిన వృద్ధాప్య పింఛన్లు , మహిళలకు ఆర్థిక భరోసా , ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు మద్దతు పథకాలు , అన్నా క్యాంటీన్లు, విద్య మరియు యువత ఉపాధి అవకాశాలు లాంటి పథకాలు మాటలకే పరిమితం కాకుండా అమలు చేశామన్నారు.

గ్రామ స్వరాజ్యం - పంచాయతీ రాజ్ వ్యవస్థ

గ్రామ స్వరాజ్యం నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది అని, మహాత్మా గాంధీ, దీన్దయాళ్ ఉపాధ్యాయ, బీఆర్ అంబేద్కర్ ఆలోచనల ఆధారంగా గ్రామ పరిపాలన బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు హోదా వచ్చినప్పటికీ, ఆచరణలో నిధులు, అధికారాలు, బాధ్యతల మధ్య సమన్వయం లేక బలహీనతలు ఏర్పడ్డాయన్నారు. నిధుల కొరత , అధికారాల అస్పష్టత, బాధ్యతల విభజన లోపం , గ్రామ పంచాయతీల ఆర్థిక బలహీనత, స్థానిక సంస్థల నమ్మకం తగ్గడం వంటి సమస్యల కారణంగా బ్రోకెన్ గవర్నెన్స్ చైన్ ఏర్పడిందని ఆయన అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి, నిర్ణయాలను గ్రామస్థాయిలోనే తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి సమస్య గ్రామంలోనే పరిష్కరించబడితేనే వ్యవస్థ బలపడుతుందని తెలిపారు. పంచాయతీ వ్యవస్థను నాయకత్వ పాఠశాలగా అభివర్ణిస్తూ, స్థానిక సంస్థల నుంచే నిజమైన నాయకత్వం ఉద్భవిస్తుందని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద మహిళా నాయకత్వ వేదిక అన్నారు. మహిళలకు 50% రిజర్వేషన్, స్వయం సహాయక సంఘాలు, యువత భాగస్వామ్యం గ్రామాభివృద్ధికి బలమని పేర్కొన్నారు.

# అణ్వాయుధాలపై ఇరాన్ రాజీ..

- **త్వరలో యూరప్‌లో సంతకాలు**
- **అమెరికా అధ్యక్షుడు ట్రంప్**



**వాషింగ్టన్, జూన్ 12:** పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడనున్నట్లు కన్పిస్తుంది. అణ్వాయుధాలు వదులుకునేందుకు ఇరాన్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దీంతో ఈ వారాంతంలో ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేయనున్నట్లు తెలిపారు. ఓవెల్ ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇరాన్తో గొప్ప ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇది తుది దశలో ఉందన్నారు. అణ్వాయుధాలు వదులుకునేందుకు ఆ దేశం అంగీకరించిందని తెలిపారు. ఈ ఒప్పందంతో అది ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగిఉండదన్నారు. డీల్‌పై సంతకాల తర్వాత హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందన్నారు. దీంతో ప్రపంచ ఇంధన మార్కెట్లపై నెలకొన్న ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ ప్రతిపాదిత ఒప్పందానికి ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ ఆమోదించారని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. యూరప్లో ఈ వారాంతంలో డీల్ సంతకాలు జరగొచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హాజరుకావొచ్చని పేర్కొన్నారు. కాగా.. ఒప్పందం విషయంపై ఇరాన్ విభిన్నమైన ప్రకటన చేసింది. దీనిపై తాము ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. ట్రంప్ మాత్రం ఈ వారంలోనే డీల్‌పై సంతకాలు జరుగుతాయని ప్రకటించగా.. ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

### ఆ దాడులు క్రూరమైనవి: ఇరాన్

భారతీయులు ఉన్న నౌకలపై అమెరికా జరిపిన దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. భారతీయుల మృతికి కారణమైన ఈ దాడులను క్రూరమైనవిగా బఘాయి అభివర్ణించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తంచేశారు. ప్రపంచ శాంతి, భద్రతకు ముప్పుతో పాటు.. నౌకాయాన స్వేచ్ఛకు అంతరాయం కలిగిస్తోన్న అమెరికా చర్యలను అంతర్జాతీయ సమాజం ఖండించాలని పిలుపునిచ్చారు.

# అల్లూరి జిల్లాలో 'ఉల్లాస్-అక్షరాంధ్ర' కార్యక్రమంపై సమీక్ష

**జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ**



**ఏ ఎస్ ఆర్ పాడేరు, జూన్ 12, 2026:** అల్లూరి జిల్లాలో 'ఉల్లాస్-అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారులతో నిర్వహించబడింది. ఈ సమావేశాం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో మొత్తం 71,468 మంది నిరక్షరాస్యులను గుర్తించామని వారిని అక్షరాశులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగింది. గుర్తించిన ఆ 71,468 మంది వివరాలను తప్పనిసరిగా 'అక్షరాంధ్ర' యాప్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత సాధించిన జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకోవాలని వయోజన విద్య శాఖ ఉప సంచాలకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి, అక్షరాంధ్ర లక్ష్యాలను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అక్షరాంధ్ర రిజిస్ట్రేషన్ ద్వారా, రిజిస్టర్ అయిన వారికి జూలై ఒకటవ తేదీ నుండి 20 తేది వరకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు, అలాగే ఈనెల 30వ తేదీన జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోల, ఏపీ ఓల శిక్షణలో ఉంటుందని తెలిపారు. డి ఆర్ డి ఏ వెలుగు లో ఉన్న అక్షరాసులు వారు నిరక్షరాశులుగా ఉన్న వారిని గుర్తించి వారికి చదువు నేర్పిస్తారు అన్నారు.ఈ సమావేశంలో వయోజన విద్య అధికారి ఎస్ఎస్ వర్మ, డీఆర్డీఏ పీడీ మురళి, పీఓ మరియు డీఎలీఓలు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

- **'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా మౌలిక వసతుల వృద్ధికి పెద్దపీట**
- **లాజిస్టిక్స్ లోనూ సమర్థవంతంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం**
- **'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్'లో మంత్రి శ్రీధర్ బాబు**




**హైదరాబాద్,జూన్12(మనం న్యూస్):** గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్ గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం'ను చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్ లో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎగుమతుల సన్నద్ధత సూచీలో దేశవ్యాప్తంగా తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచిందని,అదే... సముద్ర తీరం లేని రాష్ట్రాల జాబితాలో రెండో స్థానంలో ఉందన్నారు. మర్చండైజ్ ఎగుమతుల్లో దేశంలోనే ఏడో స్థానంలో నిలవడం తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి నిదర్శనమన్నారు. 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్ లక్ష్యసాధనలో 'లాజిస్టిక్స్' రంగం కీలక పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడాన్ని ఒక పరిమితిగా కాకుండా, ఒక డిజైన్ అడ్వాంటేజ్ గా మార్చుకుంటున్నామన్నారు. 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా రాష్ట్రంలో మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్ హౌజింగ్, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేయబోతున్నామని మంత్రి పేర్కన్నారు. లాజిస్టిక్ రంగానికి అవసరమైన రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్ తయారీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని శ్రీధర్ బాబు తెలిపారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను, లాజిస్టిక్ రంగంలోనూ సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, రైల్ లింక్డ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఎయిర్ కార్గో, కోల్ చైన్, గ్రేడ్ - ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ లాజిస్టిక్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కేకే మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ ఛైర్మన్ కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## మూలమలుపు

పక్షులు గూళ్లకు చేరుతున్నట్టు
ప్రతి సాయంత్రం
మూలమలుపు దగ్గర కాళ్ళు ఆగిపోతాయి
ఆ పలకరింపు తో ఇక
ఎంత సేపు నిలబడ్డా కాలం
మాటల వంతెన దాటుకుంటూ
సాగుతుంది
చెట్లమీదికి పాకిన పూల తీగలా
కాసింత పురాగాధల పరిమళాన్ని
కళ్ళకు అద్దుకుంటాను రాయని గ్రంథాలు
ఆ అనుభవ కాసారాలు
అడవులను దాటుకుని
రాళ్లను ఒరుసుకుని
సకల వన మూలికల్ని తనలో
కలుపుకుని
సాగుతున్న అమెజాన్ నదిలాంటి ప్రవాహం
మాటలు తెగినప్పుడు కాసేపు
మబ్బులు కదిలినట్టు
కళ్ళలో నే కాంతి కెరటాలు
చెలిమ నీళ్లు తాగితే కడుపు చల్లబడ్డట్టు
అప్పుడప్పుడు మనసు చల్లబడాలి
మాటకలిపితే మల్లెతీగలా
అల్లుకోవాలి పూలను ఏరుకుని
ఇంటికి వెళ్ళినట్టు
ఆ మాటల్ని పోగేసుకుని
నడుస్తా
ఇంకో రోజు కోసం
కొమ్మలు ఆకులు రాలుస్తున్నాయి
నేల రాలిన ఆకులను స్వీపర్ చీపురుతో ఒక
వైపుకు నెడుతుంది
పోగొట్టుకున్న దాని కోసం
ఒకతను వెదుకుతున్నాడు
ఇంత నగరంలో దొరికినా
ఇవ్వరు...
కంగారుగా వెళుతున్నాడు ఈ రోజు నేను
హడావిడిగా వేరే దారిలో వెళ్ళాను
నేను రోజు ఆ మూలపలుపును
దాటుతున్నా ఆ మనిషి రాలేదు
ఊరుకి వెళ్లాడనుకున్నా
వాహనాలు వస్తున్నాయి
వెళుతున్నాయి మనుషులు కదులుతున్నారు
కొమ్మలు ఊగుతున్నాయి
పక్షి అలికిడి లేదు ఆ సవ్వడి లేదు
కనిపించని ఆ నదిలేదు ఆ సెలయేరు లేదు
ఇక ఆ మూలమలుపును చూడలేను

**- డా. సుంకర రమేశ్**
9492180764

# భవిష్యత్ ఇంధనం ఇథనాల్..!

భవిష్యత్ ఇంధన లభ్యతలో సరికొత్త విప్లవానికి భారత్ వేదిక కాబోతోంది. పెరుగుతున్న కాలుష్యం, నింగినంటుతున్న ముడి చమురు ధరలకు చెక్ పెడుతూ.. పర్యావరణ హితమైన ఇథనాల్ (ఇథనాయిల్) వైపు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తిని ముమ్మరం చేయడమే కాకుండా, సామాన్యుడికి దీనిని అందుబాటులోకి తెచ్చేందుకు మోదీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇథనాల్ బ్లెండింగ్, దాని అనుబంధ రంగాలపై ఉన్న అన్ని రకాల సుంకాలను (duties/Taxes) ఎత్తివేస్తూ కేంద్రం ఇటీవల సంచలన ప్రకటన చేసింది.

భారతదేశం తన ఇంధన అవసరాల కోసం 80 శాతం పైగా ఇతర దేశాల నుంచే ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల దేశ ఖజానాపై భారీ భారం పడుతోంది. ఈ భారాన్ని తగ్గించుకోవడానికి, పెట్రోల్లో ఇథనాల్ను కలిపే (Ethanpol Blending) ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇప్పటికే నిర్దేశిత లక్ష్యాలను అందుకుంటున్న తరుణంలో ఇథనాల్ ఉత్పత్తిని, వినియోగాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు కేంద్రం సుంకాలను రద్దు చేసింది. దీనివల్ల

ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. కంపెనీలకు ఇథనాల్ తయారీ ఖర్చు భారీగా ఆదా అవుతుంది. భవిష్యత్తులో ఈ ఇంధనం వాహనదారులకు చాలా తక్కువ ధరకే లభించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

ఇథనాల్ను ప్రధానంగా చెరకు పిప్పి (Molasses), పాడైపోయిన ధాన్యం, మొక్కజొన్న, వరి తవుడు వంటి వ్యవసాయ వ్యర్థాల నుంచి తయారు చేస్తారు. సుంకాల ఎత్తివేతతో దేశవ్యాప్తంగా ఇథనాల్ ప్లాంట్ల ఏర్పాటు ఊపందుకోనుంది. ఇది కేవలం ఇంధన విప్లవం మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మార్చే గేమ్ ఛేంజర్. వ్యర్థాల నుంచి ఆదాయం రావడంతో దేశంలోని కోట్లాది మంది అన్నదాతలకు అదనపు ఆదాయం లభిస్తుందని ఆ రంగానికి చెందిన నిపుణులు విశ్లేషిస్తున్నారు.

సాధారణ పెట్రోల్, డీజిల్ వాడకం వల్ల వెలువడే కార్బన్ ఉద్గారాలు పర్యావరణాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. అయితే ఇథనాల్ వాడకం వల్ల కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ ఉద్గారాలు భారీగా తగ్గుతాయి. గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టడానికి భారత్ ప్రపంచ దేశాలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో 'ఇథనాయిల్' కీలక పాత్ర పోషించబోతోంది.

కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆటోమొబైల్ రంగానికి స్పష్టమైన సంకేతాలు వెళ్లాయి. రాబోయే రోజుల్లో 'ఫ్లెక్స్-ఫ్యూయల్' ఇంజన్లు కలిగిన వాహనాల తయారీ తప్పనిసరి కానుంది. 100 శాతం ఇథనాల్తో నడిచే కార్లు, బైకులను మార్కెట్లోకి తెచ్చేందుకు ప్రముఖ వాహన తయారీ సంస్థలు ఇప్పటికే ట్రయల్స్ పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది. కాలుష్య రహిత భారత్, స్వయంసమృద్ధ ఇంధన లభ్యతే లక్ష్యంగా కేంద్రం వేసిన ఈ అడుగు దేశ భవిష్యత్తును మార్చబోతోంది. సుంకాల ఎత్తివేతతో ఇథనాల్ రంగంలోకి భారీ పెట్టుబడులు రావడం ఖాయంగా కనిపిస్తోంది. మరికొద్ది రోజుల్లోనే పెట్రోల్ బంకుల్లో పచ్చని ఇంధనం 'ఇథనాల్' స్వైరవిహారం చేయనుంది.

పెట్రోల్ బంకుకు వెళ్తే లీటర్ వంద దాటిందని తల పట్టుకునే రోజుల్లో.. ఇప్పుడు సరికొత్త చర్చ నడుస్తోంది. అదే 'ఇథనాల్'. నిన్న మొన్నటి వరకు కేవలం ల్యాబ్లకే పరిమితమైన ఈ పేరు ఇప్పుడు దేశ ఇంధన రంగాన్ని శాసించే స్థాయికి చేరుతోంది.

ఇథనాల్ అంటే ఏమిటి? ఎందుకు వాడుతున్నారు?

సాధారణ భాషలో చెప్పాలంటే, ఇథనాల్ అనేది ఒక రకమైన బయో-ఫ్యూయల్ (జీవ ఇంధనం). దీనిని చెరకు రసం, కుళ్ళిపోయిన ధాన్యం, మొక్కజొన్న, మిగిలిపోయిన అన్నం వంటి వ్యవసాయ వ్యర్థాల నుండి తయారు చేస్తారు. ప్రస్తుతం మనం వాడుతున్న పెట్రోల్లో ఇథనాల్ను నిర్దేశిత శాతం కలిపి వాహనాలకు వాడుతున్నారు. భవిష్యత్తులో




కేవలం ఇథనాల్తోనే నడిచే 'ఫ్లెక్స్ ఫ్యూయల్' వాహనాలు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. దీనివల్ల

సామాన్యుడికి ఎలాంటి లాభం జరుగుతుంది అని చూసినప్పుడు ఇథనాల్ వాడకం పెరిగితే సగటు పౌరుడికి బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి. ముడి చమురు దిగుమతులతో పోలిస్తే దేశీయంగా తయారయ్యే ఇథనాల్ ఖర్చు చాలా తక్కువ. భవిష్యత్తులో ఇథనాల్ బ్లెండింగ్ 20% లేదా అంతకంటే ఎక్కువైతే పెట్రోల్ ధరలు సామాన్యుడికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు రైతన్నకు అదనపు ఆదాయం చేకూరే అవకాశం కనిపిస్తోంది.

ఇథనాల్ను పంట వ్యర్థాల నుండి తయారు చేస్తారు కాబట్టి రైతులకు తమ పంటలకు అదనపు ధర లభిస్తుంది. ఇండస్ట్రీల నుండి డిమాండ్ పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. సాంప్రదాయ ఇంధనాలతో పోలిస్తే ఇథనాల్ వల్ల కార్బన్ ఉద్గారాలు చాలా తక్కువ. ఫలితంగా నగరాల్లో కాలుష్యం తగ్గి సామాన్యుడి ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

ప్రభుత్వ ప్రయోజనం ఏమిటి?

ప్రభుత్వానికి ఇది కేవలం ఇంధన మార్పు మాత్రమే కాదు, ఒక వ్యూహాత్మక గెలుపు. లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. భారతదేశం తన ముడి చమురు అవసరాలలో దాదాపు 80% పైగా ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటోంది. ఇథనాల్ వాడకం పెంచడం ద్వారా ఏటా వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యం దేశంలోనే మిగిలిపోతుంది. 'ఆత్మనిర్భర్ భారత్' కు బూస్ట్ లాంటిదని చెప్పవచ్చు. ఇంధన రంగంలో ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గి స్వయంసమృద్ధి సాధించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇది పెద్ద బలాన్ని ఇస్తుంది. అలాగే కొత్త ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

దేశవ్యాప్తంగా వందలాది ఇథనాల్ ప్లాంట్ల ఏర్పాటు జరుగుతోంది. దీనివల్ల తయారీ, రవాణా, పరిశోధన రంగాలలో యువతకు లక్షలాది కొత్త ఉద్యోగాలు లభించే అవకాశం లేకపోలేదు. ఇథనాల్ వినియోగం అనేది ఒకే దెబ్బకు రెండు పిట్టలు లాంటిది. ఇటు పర్యావరణానికి మేలు, అటు దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం. అయితే, ఆహార ధాన్యాలను ఇథనాల్ తయారీకి మళ్లించడం వల్ల భవిష్యత్తులో ఆహార భద్రతకు ముప్పు రాకుండా ప్రభుత్వం సమతుల్యత పాటించాల్సి ఉంటుంది.

భారత ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత దిశగా ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్లో అధిక మొత్తంలో ఇథనాల్ను కలిపే ఉ22, ఉ25, ఉ27, ఉ30 రకాల ఇంధనాలపై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని (ఉ్ఛిజీట్ఛ ఛ్టీడ) పూర్తిగా ఎత్తివేస్తూ (0% చేస్తూ) కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తిని పెంచడానికి, విదేశీ ముడి చమురు దిగుమతులను తగ్గించడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం పై హర్షం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెట్రోల్లో 20% ఇథనాల్ కలిపిన ఉ20 ఇంధనాన్ని విరివిగా వాడుతున్నారు. అయితే దీనికంటే ఎక్కువ ఇథనాల్ శాతం (22% నుండి 30% వరకు) ఉండే ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం వాటిపై ఉండే పన్నులను పూర్తిగా రద్దు చేసింది. ఉ22: 78% పెట్రోల్ + 22% ఇథనాల్, ఉ25: 75% పెట్రోల్ + 25% ఇథనాల్, ఉ27: 73% పెట్రోల్ + 27% ఇథనాల్

, ఉ30: 70% పెట్రోల్ + 30% ఇథనాల్. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఆఐఖి) నిబంధనలకు అనుగుణంగా ఉండే ఈ నాలుగు రకాల ఇంధన మిశ్రమాలపై ఇకపై ఎలాంటి ఎక్సైజ్ సుంకం ఉండదు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం 85% ఇథనాల్ ఉండే ఉ85 ఇంధనాన్ని కూడా ఢిల్లీలో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది (ఇది సాధారణ పెట్రోల్ కంటే లీటరుకు సుమారు 20 తక్కువ ధరకు లభిస్తుంది). ఈ సుంకాల ఎత్తివేత నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థలోని మూడు ప్రధాన రంగాలపై పెను ప్రభావాన్ని చూపబోతోంది.

ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలు: సాధారణ ఇంజన్లు 20% కంటే ఎక్కువ ఇథనాల్ను తట్టుకోలేవు. కాబట్టి కార్లు, బైక్ తయారీ కంపెనీలు (Maruti Suzuki, Tata Motors, Hero, TVS వంటివి) ఇకపై ఉ30 అంతకంటే ఎక్కువ ఇథనాల్తో నడిచే ఫ్లెక్స్-ఫ్యూయల్ (Flex&Fuel) ఇంజన్ల తయారీని వేగవంతం చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే కంపెనీలు ఈ సాంకేతికతపై పెట్టుబడులు పెడుతుండగా, ప్రభుత్వ పన్ను రాయితీలు వారికి మరింత ఊతాన్ని ఇస్తాయి. ఇథనాల్ను ప్రధానంగా చెరకు రసం, మొలాసిస్, పాడైపోయిన ధాన్యం (వరి, మొక్కజొన్న), వ్యవసాయ వ్యర్థాల నుండి తయారు చేస్తారు. పెట్రోల్లో ఇథనాల్ శాతం పెరిగేకొద్దీ వీటికి డిమాండ్ విపరీతంగా పెరుగుతుంది. దీనివల్ల చక్కెర మిల్లులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా, రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇక ఇండియన్ ఆయిల్ (IOCL), భారత్ పెట్రోలియం (BPCL), హిందుస్థాన్ పెట్రోలియం (HPCL) వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు పన్ను భారం తగ్గుతుంది. పన్నులు లేకపోవడం వల్ల ఈ కంపెనీలు తక్కువ ధరకే అధిక శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ను మార్కెట్లోకి తీసుకురాగలవు.

ఫ్లెక్స్-ఫ్యూయల్ ఇంజన్లు (Flex&Fuel Engines): ఉ20 ఇంధనానికి తగినట్లుగా వాహనాల ఇంజన్లలో మార్పులు చేయాల్సి ఉంటుంది. దీనికోసం వాహన తయారీ సంస్థలను (Automobile companies) ఫ్లెక్స్-ఫ్యూయల్ ఇంజన్ల తయారీ వైపు కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఇథనాల్ కోసం ఆహార ధాన్యాలను ఎక్కువగా వాడితే భవిష్యత్తులో ఆహార కొరత రాకుండా సమతుల్యతను (Balance) పాటించడం సవాలుతో కూడుకున్నది. మొత్తానికి ఐతే భవిష్యత్ ఇంధనం ఇథనాల్ కాబోతుందని జరుగుతున్న పరిణామాలు చూస్తే అర్థమవుతోంది.

**- నీలేష్**
8341399599

# ఏమౌతుంది? ఏమి జరుగుతుంది?

ఇటీవల కాలంలో విద్యార్థులలో వింత ప్రవర్తన ఎక్కువవుతుంది. విద్య నేర్పిన గురువుని దారి కాచి దాడి చేసిన విద్యార్థిని ఏమనాలి? లోకం ఎటు పోతుంది? మంచి చెప్పి మందలించినందుకా? చదువుకుని బాగుపడ మన్నందుకా? ఈ దాడి! తప్పు చేసినప్పుడు చేయకు అని చెబితే తరగతి గదిలోనే ఉపాధ్యాయుని పిడిగుద్దులు గుద్దే తెగింపు విద్యార్థిలో ఎక్కడి నుంచి వచ్చింది? అసలు ఈ రకమైన ప్రవర్తనకు కారణం ఏంటి? విద్యార్థుల విపరీత ప్రవర్తనకు మూల కారణం ఎవరు? లోపం ఎక్కడ ఉంది? సమాజం ఎటు పోతుంది? మంచి చెడులు చెప్పక మార్కులు తెచ్చే యంత్రాలుగా విద్యార్థులను మార్చడం వలనేనా? లేక మానవత విలువలు లేని బోధనతో పసి మనసులను యాంత్రికం చేస్తున్న ఈ వ్యవస్థదా? ఎవరిదీ బాధ్యత ఈ పరిస్థితి కారణం ఎవరు?

ఆలోచిస్తే అందరూ అనే సమాధానం వస్తుంది! ఎందుకంటే నైతిక విలువల జాడ లేని విద్యలో సాంకేతికత పెద్ద పీట వేసుకుని కూర్చోవడమే? ప్రధాన కారణం! ఇది కొంచెం కఠినంగా ఉన్నా ఇదే నిజం అంతేకాకుండా ఇప్పుడు ప్రతి పిల్లవాడి చేతిలో స్మార్ట్ ఫోన్ సర్వసాధారణమై పోవడం! పిల్లలు విపరీతంగా స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్న తల్లిదండ్రులు సైతం నియంత్రించలేని పరిస్థితికి చేరుకోవడం దారుణమైన విషయమనే చెప్పాలి! ఇంకో విధంగా చెప్పాలంటే తల్లిదండ్రుల పెంపకమూ పిల్లల ఈ ప్రవర్తనకు కారణం ఎందుకంటే ఇటీవల ఉమ్మడి కుటుంబాల నుంచి వేరుపడి చిన్న కుటుంబాలు ఏర్పడుతున్నాయి. ఈ చిన్న కుటుంబాలలో ఒకరు లేదా ఇద్దరు పిల్లల్ని కని వాళ్ళని అల్లారు ముద్దుగా పెంచుతూ ప్రతి చిన్న విషయానికి అతిగా స్పందిస్తూ వారిని గారాభం చేస్తున్నారు. వారు ఏది అడిగితే అది కొనివ్వడం వాళ్ళు అడిగిన దాంట్లో ఎంతవరకు అవసరం ఉన్నదో అని కూడా గుర్తించకపోవడం అందులో మంచి చెడుల గురించి పట్టించుకోకపోవడం పైగా అదేదో గొప్ప అన్నట్టుగా పెద్దలు ప్రవర్తించడంతో పిల్లల ఈ విపరీత ప్రవర్తనకు కారణం అవుతుంది.ఇది పట్టణము పల్లె అనే తేడా లేకుండా ప్రతి చోటకు వ్యాపించిపోయింది!

గురువు మాట జవదాటకూడదు! అనే విషయాలు నేడు పిల్లలకు చేరుతున్నాయా? అంటే అనుమానమే! నిజం చెప్పాలంటే చేరడం లేదు! ఒకప్పుడు అంటే సుమారు ఒక 30 సంవత్సరాలకు పూర్వం విద్యా వ్యవస్థలో పాఠశాల టైం టేబుల్ లో మోరల్ పీరియడ్ అనేది ఉండేది ఆ పీరియడ్‌లో వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థులు ఇతరులతో మరియు పెద్దలతో ఏ విధంగా ప్రవర్తించాలి ఎలా ఉండాలనే అంశాలను చక్కగా తెలియజేసేవారు. ప్రస్తుతం ఆ పీరియడ్‌ను తీసేశారు. అందుకే ప్రస్తుతం సమా జంలో మేధావులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయ లోకం,స్వచ్ఛంద సంస్థలు,రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు అందరూ బాధ్యతగా వ్యవహరించి పిల్లల సత్ప్రవర్తనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యా విధానంలో నైతిక విలువలకు ప్రముఖ పాత్ర ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది అలా అయితేనే భావి భారత విద్యార్థి భవిష్యత్తు నైతిక విలువలతో కూడిన క్రమశిక్షణతో బాగుంటుంది!!

**- ఏడుకొండలు కళ్ళేపల్లి**
9490832338

## శిథిలాల కింద

బతుకు బండికోసం
బాలలింకా చక్రాలవుతూనే
వున్నారు
పుస్తకాలై తెరుచుకోవాల్సిన
పసిమొగ్గలు కార్మికుల కార్ఖానాల్లో
శ్రమల ఖైదీలవుతున్నారు
సైకిల్ చక్రాలకిందో
మోటారు బైకు చక్రాల కిందో
పడి నలిగిపోతున్నారు
సాసరూ ఛాయ్ కప్పుల
శిథిలాల కింద
తప్పిపోయిన బాల్యాన్ని
వెతుక్కుంటున్నారు
ఈ గొంగళి పురుగు
బతుకు దశనుంచి
బాలలు సీతాకోక చిలుకలై
నిరాటంకంగా
చదువుల బడి తోటకు
సాగిపోయేదెపుడో
బాలకార్మికులు లేని
నా దేశం ముఖచిత్రం మీద
చిరునవ్వుల సంతకమై
బాల్యం మెరిసేదెప్పుడో!


**- చిత్తలూరి**
9133832246

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు....**
**- ఎడిటర్**

# ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి జలగం కృషి

జలగం వెంగళరావు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కు 6 వ ముఖ్యమంత్రి. నక్సలైట్లను అణచి వేసిన ముఖ్యమంత్రిగా ఆయన దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రి పదవులు నిర్వహించాడు. జలగం వెంగళరావు 1922, మే 4న శ్రీకాకుళం జిల్లా రాజాంలో జన్మించాడు. 20వ ఏట ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం వచ్చి స్థిరపడి, నైజాం వ్యతిరేక పోరాటాన్ని ఆ ప్రాంతం నుంచే ప్రారంభించిన వెంగళరావు.. జెడ్పీ చైర్మన్‌గా, రాష్ట్ర హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పీ సీ సీ అధ్యక్షునిగా, కేంద్ర మంత్రిగా విధులు నిర్వర్తించారు. తన 20 వ ఏట నిజాంకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు.

తెలంగాణ ప్రాంతంలో అమలవుతున్న కౌలుదారీ చట్టాలను నిరసిస్తూ చేపట్టిన ఈ ప్రచారంలో పాల్గొని రెండు సార్లు జైలుకు వెళ్ళాడు. 1952 లో శాసనసభకు స్వతం త్రుడిగా పోటీ చేసి ఓడిపోయాడు. 1952 నుండి 1962 వరకు ఆయన కాంగ్రెసు పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నాడు.1962లో కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియో జకవర్గం నుండి గెలిచి, 1978 వరకు మరో మూడు సార్లు సత్తుపల్లి నియోజకవర్గానికి శాసన సభలో ప్రాతినిధ్యం వహించాడు. 1967లో పంచాయితీరాజ్ ఛాంబరు చైర్మనుగా ఎన్నికయ్యాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి మంత్రివర్గంలో 1969 నుండి 1971 వరకు హోంమంత్రిగా, పి.వి.నరసింహారావు మంత్రివర్గంలో 1972-73 లో పరిశ్రమల మంత్రిగా పనిచేసాడు. జై ఆంధ్ర



ఉద్యమ ఫలితంగా రాష్ట్రంలో విధించిన రాష్ట్రపతి పాలన ఎత్తివేసిన తరువాత వెంగళరావు ముఖ్య మంత్రి పదవికి ఎంపికయ్యాడు.10 డిసెంబర్ 1973 నుండి 6 మార్చి 1978 వరకు ఆంధ్ర ప్రదేశ్ 5వ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలోనే ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోని తెలంగాణ ప్రాంతంలో కాకతీయ విశ్వవిద్యాలయం, కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, రాయలసీమ ప్రాంతంలో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనే మూడు విశ్వవిద్యాలయాలు ప్రారంభించబడ్డాయి. 1975లో హైదరాబాద్ నగరంలో ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభించాడు.

ఆయన పాలనా కాలంలోనే ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ ని విధించింది. ముఖ్యమంత్రిగా వెంగళరావు మంచి పరిపాలకుడిగా పేరుతెచ్చుకున్నాడు. ఎన్‌కౌంటర్‌ల వ్యాప్తికి కారకుడిగా విమర్శలు తెచ్చుకున్నాడు. తెలుగు సినిమా పరిశ్రమ హైదరాబాదులో నిలదొక్కుకొనేందుకు చేయూతనిచ్చాడు. మొదటి ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించాడు. అప్పటికి కొన్ని సంవత్సరాల ముందే ముగిసిన ప్రత్యేక తెలంగాణా ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమాల నేపథ్యంలో ఈ సభలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 1975 సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా ప్రకటించి పలు కార్యకలాపాలు చేపట్టారు.

నాగార్జున సాగర్ ఎడమ కాలువను ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి అభివృద్ధికి కృషి చేశాడు. కాంగ్రెసు పార్టీ చీలిపోయి కాంగ్రెసు (ఐ) ఏర్పడినపుడు, వెంగళరావు కొన్నాళ్ళు పార్టీకి దూరమయి,. మళ్ళీ 1984 లో కాంగ్రెసుకు తిరిగి వచ్చి, 1984, 1991 మధ్య ఖమ్మం నియోజకవర్గం నుండి లోక్సభకు రెండుసార్లు ప్రాతినిధ్యం వహించాడు. 1986 నుండి 1989 వరకు కేంద్ర పరిశ్రమల మంత్రిగా పనిచేసాడు.

మంజీరాపై సింగూరు ప్రాజెక్ట్, పోచంపాడు ప్రాజెక్టు, కరీంనగర్ దిగువ మానేరు బ్యాలెన్స్డ్ రిజర్వాయర్, శ్రీశైలం హైడల్ పాజెక్ట్ , రామగుండం సూపర్ థర్మల్ స్టేషన్, పాల్వంచ విజయవాడ దిగువ సిలేరులలో విద్యుత్ కేంద్రాలు, ప్రతీ గ్రామంలో ప్రాథమిక పాటశాలలు, ఎన్నో కళాశాలలు నెలకొల్పడం లాంటి ఎన్నో చిర కాలం గుర్తుంది పోయే కార్యక్రమాలు చేశాడు. 1999 జూన్ 12 న హైదరా బాదులో వెంగళరావు మరణించాడు.

**- ఆర్‌కేఎస్**
9440595494


# అసమాన వ్యంగ్య చిత్ర కారుడు అబూ అబ్రహాం

రాజకీయ కార్టూనులు వేస్తూ, ప్రముఖ వార్తా పత్రికలలో పనిచేస్తూ, అదే వృత్తిగా ఎంచుకుని, స్వతంత్రంగా, నిర్భీతిగా పని చేసిన వ్యంగ్య చిత్రకారులు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. అందులో అబూ అబ్రహం ముఖ్యులు.

ఒక కార్టూనులో ఒక పాత్రను ప్రవేశపెట్టి, ఆ పాత్ర బొమ్మను అదేవిధంగా దశాబ్దాల పాటు వేయగల శక్తి ఉన్న అతి కొద్దిమంది కార్టూనిస్టులలో అబూ ఒకరు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రముఖ అబ్జర్వర్ పత్రికకు అబూనే మొట్ట మొదటి రాజకీయ వ్యంగ్య చిత్రకారుడు కావడం విశేషం. సామాన్యంగా ఇంట గెలిచి రచ్చ గెలవడం కాకుండా, అబూ అబ్రహం బయటి దేశాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించి, భారత్ కు తిరిగి రావటం జరిగింది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందని తన మూడవ ఏట నుండే బొమ్మలు గీయటం మొదలు పెట్టారు. చదువుకునే రోజులలో తమ గురువుల బొమ్మలు కూడా వేసే వారట.

అత్తుపురథు మాథ్యూ అబ్రహామ్ (11 జూన్ 1924 - 1 డిసెంబర్ 2002), అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రఖ్యాత భారతీయ వ్యంగ్య చిత్రకారుడు, పాత్రికేయుడు, రచయిత. ఆయన కలం పేరు అబూ. ఆయన హేతువాది, నాస్తికుడు.

అబూ తన 40 యేళ్ల సుదీర్ఘ వృత్తి జీవితంలో అనేక జాతీయ, అంతర్జాతీయ వార్తా పత్రికలలో పనిచేశారు. 'బాంబే క్రానికల్', 'శంకర్స్ వీక్లీ', 'బ్లిట్', 'ట్రిబ్యూన్', 'ది అబ్జర్వర్', 'ది గార్డియన్', 'ది ఇండియన్ ఎక్స్ప్రెస్' తదితర పత్రికలలో పని చేసి గుర్తింపు పొందారు. అబూ కేరళ రాష్ట్రంలోని మవేలికర గ్రామంలో ఎ.ఎం.మాథ్యూ, కాంతమ్మ దంపతులకు జన్మించారు. తన మూడవ యేటి నుండే బొమ్మలు గీయడం మొదలు పెట్టారు. తిరువనంత పురం యూనివర్సిటీ కాలేజీలో ఫ్రెంచి, గణితం, ఇంగ్లీషు ఐచ్ఛికాంశాలుగా 1945లో డిగ్రీ పూర్తి చేశారు. ఇతడు విద్యార్థి దశలో టెన్నిస్ ఛాంపియన్‌గా ఉండేవారు. చదువు ముగిసిన వెంటనే అబూ బొంబాయి వెళ్లి 'బాంబే క్రానికల్' పత్రికలోను, దాని సోదర పత్రిక 'ది బాంబే సెంటినెల్'లోను జర్నలిస్ట్‌గా చేరారు.




'బ్లిట్జ్', 'భారత్' పత్రికలలో కార్టూన్లు గీయడం మొదలు పెట్టారు. 1951లో ప్రముఖ కార్టూనిస్ట్ కె.శంకర్ పిళ్ళై అబూను తన 'శంకర్స్ వీక్లీ'లో పనిచేయ వలసిందిగా ఢిల్లీకి ఆహ్వానించారు.1953లో లండన్‌లోని 'ది స్టార్' పత్రిక సంపాదకుడు ఫ్రెడ్ జోస్ ఇతడిని లండన్కు రావలసినదిగా ప్రోత్సహించారు. ఆయన తన 32వ యేట లండన్‌లో అడుగు పెట్టారు. లండన్ చేరిన వెంటనే అబూ పంచ్, డైలీ స్కెచ్, ఎవెరీబడీస్ లండన్ ఒపినియన్, ఈస్టర్న్ వరల్ మొదలైన పత్రికలకు అబ్రహం అనే కలం పేరుతో కార్టూన్లు వేయడం ఆరంభించారు.1956లో ట్రిబ్యూన్ పత్రికలో ప్రచురింపబడ్డ ఇతని రెండు కార్టూన్లను చూసి ప్రపంచంలో అతి పురాతన మైన ఆదివారం వార్తాపత్రిక 'ది అబ్జర్వర్' సంపాదకుడు డేవిడ్ ఏస్టర్ ఆయనకు తన పత్రికలో రాజకీయ కార్టూనిస్టుగా స్థిరమైన ఉద్యోగాన్ని ఇచ్చారు. ఆయన సలహాపై అబ్రహం అనే కలం పేరును తన చిన్ననాటి ముద్దుపేరు 'అబూ'గా మార్చుకున్నారు. అబూ బ్రిటిష్ సంస్కృతిలో మునిగి పోయి వాడి, వేడి రాజకీయ కార్టూన్లను గీశారు. ది గార్డియన్ పత్రిక అబును 'త్రికరణ శుద్ధిగా వామపక్ష భావ జాలాన్ని నమ్మి ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారైనాడని' అభివర్ణించింది.1962లో శాతం క్యూబాలో చేగువేరా చిత్రాన్ని గీశారు.

1966 సెప్టెంబరులో అబూ ది గార్డియన్ పత్రికలో చేరారు. ట్రిబ్యూన్ పత్రికకు వారం వారం కార్టూన్లను వేశారు. 1968లో వియత్నాం యుద్ధంపై వెలువడిన 'వర్డికట్స్ ఆఫ్ వియత్నాం' అనే కార్టూన్ల సంకలనానికి సంపాదకత్వం వహించారు. అబూ 1969లో భారత దేశానికి తిరిగి వచ్చారు. ఇండియన్ ఎక్స్ప్రెస్ పత్రికలో 1981 వరకు రాజకీయ కార్టూనిస్టుగా పనిచేశారు. 1970లో ఆయన తీసిన షార్ట్ ఫిలిం నో ఆరక్స్ కు బ్రిటిష్ ఫిలిం ఇన్స్టిట్యూట్ ప్రత్యేక అవార్డును ఇచ్చింది. 1972-78ల మధ్య ఇతడు రాజ్యసభలో నామినేటెడ్ సభ్యుడిగా ఉన్నారు.

1975లో భారత అత్యవసర స్థితి విధించినపుడు పత్రికా స్వేచ్ఛను రద్దు చేశారు. అబూ ఈ చర్యతో ఇందిరా గాంధీ పై ఉన్న అభిమానాన్ని కోల్పోయారు. పత్రికా రంగంలో పని చేసే వారు కొంత మంది, ఎమర్జెన్సీ రోజులలో వంగమంటే, నేలన పడి పాకారని ఒక అపప్రథ ఉన్నది. అటువంటి చెడ్డపేరు, అబూ అబ్రహంకు గాని ఆయన పని చేసిన ఇండియన్ ఎక్స్ప్రెస్సుకు గాని రాలేదు. ఆయన ధైర్యంగా ఉండి తన కార్టూన్లను తాను వేస్తూ, సెన్సార్ అధికారులకు అందకుండా, చాలా తెలివిగా కార్టూన్లు గీసి నెగ్గుకు వచ్చారు. ధైర్యం, నిబద్ధత ఉంటే ఎంతటి నియంత అయినా ఏమీ చెయ్యలేదని నిరూపించారు. 1977లో ఎమర్జెన్సీ సమయంలో ప్రచురించలేకపోయిన రాజకీయ కార్టూన్లు, వ్యాసాలతో 'గేమ్స్ ఆఫ్ ఎమర్జెన్సీ' అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఇంకా ఇతడు 'అబూ ఆన్ బాంగ్లాదేశ్', 'ప్రైవేట్ వ్యూ', 'అరైవల్స్ అండ్ డిపార్చర్స్' అనే కార్టున్ పుస్తకాలను ప్రకటించారు. 1988లో వెలువడిన పెంగ్విన్ బుక్ ఆఫ్ ఇండియన్ కార్టూన్స్కు సంపాదకుడిగా ఉన్నారు. 1981 నుండి అబూ ఫ్రీలాన్సర్గా వివిధ వార్తా పత్రికలకు కార్టూన్లు గీయడం ప్రారంభించారు. 'సాల్ట్ అండ్ పెప్పర్' అనే స్ట్రిప్ కార్టూన్ వేయ నారంభించారు. ఎంతో మందిని తన భావ యుక్తమైన కార్టూన్లతో కదిలించిన, ఈ ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు, 2002 సంవత్సరం డిసెంబరు 1 వ తేదీ మరణించారు. ఆయన మరణానికి సంతాప సూచకంగా రాజ్యసభ రెండు నిమిషాల మౌనం పాటించింది. అబూ అంత్య క్రియలను ప్రభుత్వ లాంచనాలతో ఘనంగా నిర్వహించారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలి

**బీజేపీ ఓటు చోరితో పాటు సీటు చోరీ చేస్తుంది**

**ప్రజాస్వామ్య పరిరక్షణకు బీఎల్ఏలు సైనికుల్లా పనిచేయాలి**

**ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావత్**

**వేములవాడ,జూన్ 12(మనం న్యూస్):** ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలనీ,ప్రజాస్వామ్య పరిరక్షణకు బీఎల్ఏలు సైనికుల్లా పనిచేయాలనీ ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావత్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏ-2) ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావత్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్,పీసీసీ పరిశీలకుడు గోపిశెట్టి రాఘవేందర్ పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఓటు హక్కును కాపాడేందుకు సైనికుల్లా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ దేశ నిర్మాణానికి ప్రతీక...**

ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావత్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ దేశ ప్రయోజనాల కోసం నిరంతరం పోరాటం చేస్తోందని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్ నాయకులు తమ జీవితాలను త్యాగం చేసి దేశానికి స్వేచ్ఛను సాధించిపెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ వ్యవస్థలను పరిరక్షించేందుకు మరో ఉద్యమం అవసరమైన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు.గత పన్నెండు సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం దేశ అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. దేశ అభివృద్ధికి పునాది వేసిన మాజీ ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ సేవలను గుర్తు చేస్తూ, ఆధునిక భారత నిర్మాణంలో ఆయన పాత్ర అపారమని పేర్కొన్నారు. బీజేపీ వారు మోదీ ను నెహ్రూ తో పోల్చడం విడ్డూరం అన్నారు. దేశంలో ఓటర్ల జాబితాల నిర్వహణ అత్యంత పారదర్శకంగా జరగాలని, ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమని చెప్పారు. ఓటర్ల వివరాల నమోదు, తొలగింపులు, మార్పుల విషయంలో బీఎల్ఏలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.




అలాగే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో దేశంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలయ్యాయని, సామాన్య ప్రజల కోసం ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని ఆరోపించారు.

**ఓటు హక్కును కాపాడడం ప్రతి కార్యకర్త బాధ్యత...**

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బీఎల్ఏలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, దానిని కాపాడడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా, కొత్తగా అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఏలు నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష ఓటర్లపై వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా బూత్ స్థాయిలో నిశితంగా పరిశీలించాలని సూచించారు.బీజేపీ ప్రమాదకరంగా మరి ప్రశ్నించే గొంతులను ప్రతి పక్ష వారి ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు..బీజేపీ ఓట్ల చోరీ చేస్తూ దేశంలో ప్రమాద కారణంగా మారిందన్నారు..బెంగాల్, తమిళనాడు, వంటి రాష్ట్రాల్లో బీజేపీ కి నచ్చని వారి ఓట్లు లక్షల్లో తొలగిస్తుందన్నారు..దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు లేకండా చేయాలని బీజేపీ చూస్తోందన్నారు.. బీజేపీ ఓటు చోరీ తో పాటు సీటు చోరీ చేస్తుందనీ, ఒక రాష్ట్రంలో ఒకే ఇంటి లో సుమారు 45 మందిని కొత్తగా చేర్చారనీ ,తమకు నచ్చిన వారి ఓటును ఉంచి నచ్చని వారి ఓట్లను తొలగిస్తుందన్నారు. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ అంటే బీజేపీ భయపడుతుందనీ, బీజేపీ మీనాక్షి నటరాజన్ సీటు చోరీ చేసిందన్నారు..ఆమె పై అసలు కేసు నమోదు కానున్న భయపడి ఆమె నామినేషన్ రిజెక్ట్ చేశారన్నారు...రాబోయే రోజుల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, బీఎల్ఏ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సైనికుడిలా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి పుట్టినిల్లు అని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతి ఓటు విలువను కాపాడే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయవచ్చని, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్ మధు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు



- **అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, జూన్ -12(మనం ప్రతినిధి):** సిరిసిల్ల బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. తంగళ్ళపల్లి మండలంలోని బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బుస్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు, బైపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించినందుకు ప్రతిభా పురస్కారం ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇద్దరికి మొత్తం రూ.30వేలు జిల్లా కలెక్టర్ .గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేసి.. అభినందించారు.
కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, సంబంధిత పాఠశాలల ఇంచార్జి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా వాసికి అర్థ శాస్త్రంలో డాక్టరేట్



**పెద్దపల్లి, జూన్ 12 (మనం ప్రతినిధి):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ కు చెందిన పడాల శ్రీనివాస్ గౌడ్ శాతవాహన యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. ఆయన శాతవాహన యూనివర్సిటీ లో ప్రొఫెసర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎకనామిక్స్ విభాగంలో సోషియో -ఎకనామిక్ కండిషన్స్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబర్స్ ఆఫ్ పెద్దపల్లి డిస్టిక్ ఇన్ తెలంగాణ స్టేట్ మీద రీసెర్చ్ చేశారు. దీనిపై సమగ్ర అంశాలను క్రోడీకరించిన ఆయనకు శాతవాహన యూనివర్సిటీ నుండి డాక్టరేట్ ప్రదానం చేశారు. కాగా శ్రీనివాస్ ఉన్నత విద్యాభ్యాసం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఇండియన్ మిషన్ హై స్కూల్ లో జరుగగా, ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల స్నేహితులు, పలువురు అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు పూర్తి సహకారం అందించిన శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ వరప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశాం

- **అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు**
- **ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించబోము దశలవారీగా స్వాధీనం**
- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, జూన్ 12 (మనం ప్రతినిధి):**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లో శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మీడియా సమావేశం నిర్వహించి యాసంగి ధాన్యం కొనుగోళ్లు, మొక్కజొన్న కొనుగోళ్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), మట్టి రవాణా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ల (ఏటీసీ) ప్రవేశాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, యాసంగి 2025-26 సీజన్కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసి రూ.1,031 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు.



రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే 93 శాతం చెల్లింపులు పూర్తిచేసినట్లు తెలిపారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక వరి కొనుగోలు అని పేర్కొంటూ, 2024-25 యాసంగి సీజన్లో 4.01 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరగగా, ఈసారి 4.35 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నట్లు తెలిపారు.సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 2024-25 ఖరీఫ్లో 100 శాతం, రబీలో 95 శాతం, 2025-26 ఖరీఫ్లో 39 శాతం, రబీలో 8 శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తయినట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిఫాల్ట్లో ఉన్న 10 రైస్ మిల్లులకు బకాయిలు చెల్లించి, బ్యాంకు గ్యారంటీ సమర్పించిన అనంతరం మాత్రమే ధాన్యం కేటాయించినట్లు తెలిపారు.ధాన్యం రవాణాకు రోజుకు సుమారు 600 వాహనాలను వినియోగించామని, మొత్తం 1.15 కోట్ల గన్నీ సంచులు ఉపయోగించినట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లో 6.90 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉండగా, అవసరాన్ని బట్టి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా అదనపు నిల్వ స్థలాన్ని వినియోగించినట్లు తెలిపారు.జిల్లాలో ఈ యాసంగి సీజన్లో 18,191 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, తొమ్మిది కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 26 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.63.40 కోట్ల విలువైన మొక్కజొన్న కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.14.84 కోట్ల చెల్లింపులు చేసినట్లు చెప్పారు. మొక్కజొన్న నిల్వ కోసం 29 వేల మెట్రిక్ టన్నుల స్థలాన్ని గుర్తించామని తెలిపారు.రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగినప్పటికీ పలు సవాళ్లు ఎదురయ్యాయని కలెక్టర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, అదే సమయంలో యూరియా నిల్వలు రావడం, ఎఫ్సీఐ గోదాముల్లో కార్మికుల కొరత వంటి సమస్యలను అధిగమించి కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. రైతులకు ఎక్కడా కోతలు పడకుండా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.మంథని ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన మూడు లారీలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సంబంధిత కొనుగోలు కేంద్రాలపై విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తదుపరి నుంచి ఆయా కేంద్రాల్లో మార్పులు చేపడతామని తెలిపారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కొత్త ప్రక్రియ కాదని, 2002లో చివరిసారిగా నిర్వహించగా ప్రస్తుతం స్వాతంత్ర్యం అనంతరం ఎనిమిదోసారి ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఓటర్లలో సుమారు 80 శాతం మందిని 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేస్తున్నామని, ఇంకా 1.80 లక్షల మంది ఓటర్ల వివరాల పరిశీలన మిగిలి ఉందన్నారు.బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు సేకరిస్తారని, అవసరమైన ఆధారాలను జతచేసి సమర్పించాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి బుధవారం ఈఆర్వో స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తూ మొత్తం ప్రక్రియను పారదర్శకంగా కొనసాగిస్తున్నామని చెప్పారు.జిల్లాలో ఇటుక బట్టీలకు ఎనిమిది చెరువుల నుంచి 13,250 ట్రిప్పుల మట్టి రవాణాకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వసూలు చేసిన రుసుమును ఆయా ప్రాంతాల అభివృద్ధి పనులకు వినియోగిస్తామని చెప్పారు. రైతులు వ్యవసాయ అవసరాల కోసం ఉచితంగా మట్టిని వినియోగించుకోవచ్చని తెలిపారు. మట్టి దుర్వినియోగం జరగకుండా పటిష్టమైన వ్యవస్థను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలో 72 ఎకరాల ప్రభుత్వ భూమిని, నరసింగాపూర్లో 48 ఎకరాల భూమిని ఆక్రమణల నుంచి విముక్తం చేసినట్లు తెలిపారు. ముత్తారం ప్రాంతంలో కూడా భూముల స్వాధీనం కోసం చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఎవరూ ఆక్రమించవద్దని, ఆక్రమణలను తప్పనిసరిగా తొలగిస్తామని హెచ్చరించారు.పెద్దపల్లి, రామగుండం ఏటీసీలలో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు జూన్ 30 చివరి తేదీగా నిర్ణయించినట్లు చెప్పారు. గతంలో ఈ కోర్సుల ద్వారా అనేక మంది విద్యార్థులు మంచి ఉద్యోగ అవకాశాలు పొందారని తెలిపారు. మంథనిలో మరో ఏటీసీకి అనుమతి లభించిందని, భూమి కేటాయింపు పూర్తై త్వరలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

**గజ్వేల్, జూన్ 12 మనం న్యూస్:** సిద్దిపేట జిల్లా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పద్మశాలి విద్యార్థిని, విద్యార్థులకు, 10వ తరగతి మరియు ఇంటర్ ప్రథమ, ద్వితీయ వార్షిక పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచిన జిల్లా వ్యాప్తంగా పదిమంది ని ఎంపిక చేసి వారికి శాలువా, మేమెంటోతో సన్మానించడం జరిగింది. కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు, విద్యార్థి దశలో సమయం వృధా చేయకూడదని ఎన్ని కష్టాలు వచ్చినా, మధ్యలో చదువు ఆపకూడదని మీకేమైనా ఇబ్బంది ఉంటే మా సంఘాన్ని సంప్రదించాలని పిలుపునిచ్చారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో1000/994 లగిశెట్టి తేజస్విని రాజు లావణ్య (సిద్దిపేట). చెప్యాల అక్షర, తండ్రి శేఖర్ సబిత, (గజ్వేల్)1000/989, ఆడెపు స్నేహ ప్రభాకర్ లక్ష్మి , సిద్దిపేట 1000/988 ఇంటర్ ప్రథమ వార్షిక పరీక్షలు,సామల ప్రణయ్ సాయి తండ్రి నర్సింలు శ్రీదేవి (ప్రజ్ఞాపూర్)600/598 పదవ తరగతిలో వీరబత్తిని అనన్య మధుసూదన్ ప్రేమలత (సిద్దిపేట)600/578 బొమ్మ వైష్ణవి తండ్రి శ్రీనివాస్ నిర్మల 600/577 (చేర్యాల్) ఎల్లారం విశ్వేశ్వర్ తండ్రి సురేష్ రేష్మ 600/576(దుబ్బాక) సిహెచ్ రుచిత తండ్రి ఆంజనేయులు భవాని. శ్రీరంగుల రేష్మిత తండ్రి రాజు జ్యోతి, (నాసర్ పుర) సి.హెచ్. శిరీష తండ్రి రామకృష్ణ లత, పాము వాజ్పేయి సందీప్ నాగరాణి (హుస్నాబాద్) గారికి మెమెంటు పాటు, అవార్డు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సిహెచ్. నర్సింలు ,ఉపాధ్యక్షులు లెగిసెట్టి రాజు,పోగుల రాజు, రచ్చ రాం భాస్కర్ వీరబత్తిని జమునారాణి, కోశాధికారి రచ్చ రమేష్, సంయుక్త కార్యదర్శి పి.ఎల్. రామకృష్ణ ,పాము సందీప్, జోగు అరుణ, ప్రచార కార్యదర్శి ఎనుగపట్ల రాజేంద్రప్రసాద్, అమేజింగ్ సెక్రటరీ సామల సత్యనారాయణ, గడ్డమీది సురేష్, నూతి రమేష్ ,దూరం వేణు, రచ్చ దేవేందర్, ఇప్పకాయల వరప్రసాద్, బుల్లి మల్లేశం, చెప్యాల శేఖర్ గజ్వేల్, పద్మశాలి ఉద్యోగుల సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# వీధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

**క్రమశిక్షణ ఉల్లంఘనపై కఠిన చర్యలు**

**విధులకు గైర్హాజరు, 8 మంది అంగన్వాడీ సిబ్బంది సేవల రద్దు**

**విధులకు హాజరుకాని మూడు ప్రాజెక్టుల్లో 8 మంది అంగన్వాడీ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్.....**



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 12 (మనం బ్యూరో):** జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో క్రమశిక్షణను పటిష్టపరచడంతో పాటు సేవల నాణ్యతను మెరుగుపరచే దిశగా జిల్లా పరిపాలన కీలక చర్యలు, ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నెం.14 నిబంధనల మేరకు, దీర్ఘకాలంగా విధులకు హాజరు కాకుండా ఉన్న 8 మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సేవలను రద్దు చేసినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. జిల్లాలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కొంతమంది కార్యకర్తలు, ఆయాలు ఎలాంటి అనుమతి లేకుండా నెలల తరబడి, కొందరు సంవత్సరాల పాటు విధులకు గైర్హాజరవుతూ కేంద్రాల నిర్వహణకు ఆటంకం కలిగించినట్లు వెల్లడించారు. సంబంధిత శాఖ అధికారుల నివేదికలు, విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు చేపట్టి వారి సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అచ్చంపేట, బల్మూర్, కొల్లాపూర్ ప్రాజెక్టుల పరిధిలో పనిచేస్తున్న పలువురు అంగన్వాడీ సిబ్బంది 2023 ఫిబ్రవరి నుంచి 2026 జనవరి వరకు వివిధ కాలాల్లో విధులకు గైర్హాజరవుతున్నట్లు రికార్డులు వెల్లడించినట్లు తెలిపారు. సంబంధిత అధికారుల పరిశీలన అనంతరం వారి తొలగింపునకు ప్రతిపాదనలు సమర్పించగా, వాటికి ఆమోదం లభించినట్లు చెప్పారు. తొలగింపునకు గురైన వారిలో అచ్చంపేట ప్రాజెక్టుకు చెందిన జి. వెంకటమ్మ, ఎస్. అరుణ, బల్మూర్ ప్రాజెక్టుకు చెందిన జి. సుల్తానమ్మ, జె. మహాలక్ష్మి, కొల్లాపూర్ ప్రాజెక్టుకు చెందిన సి. పద్మావతి, నిరంజన్పెల్ల, కాశమ్మ, దర్జి బక్కమ్మ, ఉన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ విధుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అనధికార గైర్హాజరు లేదా విధుల పట్ల నిర్లక్ష్యానికి పాల్పడిన వారిపై భవిష్యత్తులో కూడా ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు జిల్లాలో ప్రభుత్వ శాఖల సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు తమ విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం లేదా క్రమశిక్షణా ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం



- **రూ. 50 వేల చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, జూన్ 12(మనం ప్రతినిధి):** బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు. వారిలో ఇద్దరు దివ్యాంగులు. దివ్యాంగురాలైన సాగరిక, దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు. వారికి ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు.కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు. ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు. పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది.

కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. దీంతో వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు. భవిష్యత్తులో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తమ పిల్లలకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు కొమురవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

- **జాప్యం తావు లేకుండా చూడాలి**
- **మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి కావాలి**
- **సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ జూన్ 12(మనం బ్యూరో):** జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్లో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ యాక్ట్-2010 అమలు, ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు, అనుమతుల జారీ ప్రక్రియపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఆసుపత్రుల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మూడు నెలల లోపల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రుల



యాజమాన్యాలు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. హెల్ప్‌లైన్ ద్వారా ఇతరత్రా ఇబ్బందులు..రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన సందేహాలు, సాంకేతిక సమస్యలు, అనుమతుల అంశాలపై మార్గదర్శకత్వం అందించాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రైవేట్ వైద్య సంస్థలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ యాక్ట్-2010 ప్రకారం అన్ని వైద్య సంస్థలు రిజిస్ట్రేషన్ పొందడం ద్వారా వైద్య సేవల నాణ్యత, పారదర్శకత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతుందని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీరామ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ముప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పోలీసు శాఖ ప్రతినిధులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షురాలు ఆకుల శైలజ, ప్రధాన కార్యదర్శి మహేష్ కోశాధికారి నీలిమా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి!

**కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర**
**30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్**
**బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు**
**కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి**
**పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి నిప్పులు**

ఖమ్మం రూరల్, జూన్ 12(మనం న్యూస్): కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీపాలితా ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

**'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!**

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి అని మంత్రి పిలుపునిచ్చారు.

**నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!**

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. మీనాక్షి నటరాజన్‌కి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి.

అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారిందని నిప్పులు చెరిగారు.

**సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు**

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరపున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..**

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకే 'గ్రీన్ ఎనర్జీ': మంత్రి పొంగులేటి

- పాలేరు పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ పనులు
- రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు
- తిరుమలాయపాలెంలో సోలార్ ప్లాంట్కు శంకుస్థాపన



తిరుమలాయపాలెం, జూన్ 12(మనం న్యూస్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 0.8 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, విద్యుత్ నియంత్రికల (ట్రాన్స్ఫార్మర్ల) మరమ్మత్తు కేంద్రానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యుత్ రంగ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.37.38 కోట్లతో విద్యుత్ సరఫరా మెరుగుదలకు పనులు చేపట్టామని, రూ.9 కోట్ల వ్యయంతో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు సాగుతున్నాయని వివరించారు. దశాబ్దాలుగా ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఒకప్పుడు కరెంట్ కష్టాలతో రాత్రివేళల్లో పొలాలకెళ్లి రైతులు పాముకాట్లకు గురైన పరిస్థితులు ఉండేవని, నాటి ఉచిత విద్యుత్ స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రభుత్వం రైతులకు నాణ్యమైన కరెంట్ అందిస్తోందని గుర్తుచేశారు.

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు**

అనంతరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా మరో 2 వేల ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.

**రైతాంగానికి భరోసా..**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా సంక్షేమ పథకాలను ఆపడం లేదని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, రైతు భరోసా సాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచామన్నారు.

దేశంలోనే రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేశామని, తడిసిన ధాన్యాన్ని సైతం సేకరించి రైతులకు అండగా నిలిచామని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ విజయవంతంగా అమలవుతున్నాయన్నారు.

గడిచిన ఏడాది కాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్యం కోసం రూ.1,034 కోట్లు వెచ్చించామని, నిరుద్యోగుల కోసం 72 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టామని చెప్పారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున, రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకే పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారీ, జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పెద్దాయనకి ఆహ్వానం అందిందా?

**సొంత నియోజకవర్గంలో అవమానించటం కాంగ్రెస్‌కు మంచిదా?**

**నియోజకవర్గ ప్రజలు అభిమానుల్లో తీవ్రమైన చర్చ!**





దమ్మపేట, జూన్ 11(మనం న్యూస్): అశ్వారావుపేట నియోజకవర్గకేంద్రంలో నిర్వహించిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించి రాజకీయవర్గాలలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. రెసిడెన్షియల్ పాఠశాల స్థాపించడానికి అవసరమైన భూమి వ్యవసాయ శాఖ నుంచి కేటాయించడంలో కీలక పాత్ర పోషించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ను అభివృద్ధి పథంలో నడిపించిన ఒక ప్రజా నాయకుడికి ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందలేదన్న ప్రచారం నియోజకవర్గ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. పాఠశాల ఏర్పాటుకు భూమి కేటాయింపు నుంచి వివిధ పరిపాలన అంశాల వరకు ఆయన చేసిన విశేష కృషిని స్థానికులు గుర్తుచేస్తున్నారు అలాంటి రాజకీయ ఉద్దండుని కార్యక్రమానికి దూరంగా ఉంచటం వెనుక కారణాలు ఏమిటి అన్న ప్రశ్నలు ఆయన అనుచరులు అభిమానుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు వంటి కీలక కార్యక్రమాలకు ఆయనను విస్మరించారని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ కారణాలవల్లే ఈ పరిణామం చోటుచేసుకుందా ???.లేక ఆహ్వాన ప్రక్రియలో ఏదైనా లోపం జరిగిందా ???.అనే అంశంపై చర్చకు దారి తీసింది. ఈ ఘటన స్థానిక రాజకీయాల్లో చర్చ నీయాంసమయింది. అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు మౌలిక వసతులు కల్పించి నటువంటి ప్రజాదరణ కలిగిన నాయకుడిని విస్మరించడం ఆంతర్యం ఏమిటని వివిధ వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తం ఔతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన నాయకుని విస్మరించడం పట్ల పార్టీలకతీతంగా స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం 'దిశా' కమిటీలో సర్పంచ్ లకు పెద్దపీట..

- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండేలా ప్రాధాన్యం
- ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవ

భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా అభివృద్ధిలో స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశా) కమిటీకి సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఐదుగురు సర్పంచ్ లకు చోటు కల్పించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పర్యవేక్షణ ఉండేలా వీరి నియామకంలో ప్రత్యేక చొరవ ప్రదర్శించారు.

**దిశా కమిటీ సభ్యులు వీరే.. :**

భుక్యా సునీత (సర్వారం, సుజాతనగర్ మండలం), బానోత్ శారద (రేపల్లెవాడ, ఇల్లందు మండలం), కోర్స రాజేష్ (తిరుమలకుంట, అశ్వారావుపేట మండలం), కల్లూరి ఆదినారాయణ (నారాయణరావుపేట, దుమ్ముగూడెం మండలం), మద్దెల సమ్మయ్య (పొట్లపల్లి, పినపాక మండలం).

**అణగారిన వర్గాలకు అవకాశాలు :**

ఐదుగురు గ్రామ పంచాయతీ సర్పంచులకు చోటు దక్కింది. ఇందులో ఇద్దరు మహిళా సర్పంచులు ఉండటం విశేషం. గ్రామీణ స్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్న ఎంపీ సంకల్పానికి ఈ నియామకాలు నిదర్శనంగా నిలుస్తున్నాయంటూ.. జిల్లాలోని పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# మాపై దాడి చేసిన వారిని శిక్షించి న్యాయం చేయాలి

- మీడియా సమావేశంలో బాధితుల వేడుకోలు

ఖమ్మం, జూన్ 12(మనం న్యూస్): మా ఇంటికి వచ్చి గొడవ చేసి మాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని, తమ ఫిర్యాదును పట్టించుకోని పోలీసులపై చర్యలు తీసుకోవాలని బాధితులు రాము పెరుమాళ్, రాము సుధ వేడుకొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమిళనాడు నుండి వచ్చిన వచ్చిన తాము పాకబండబజార్లో ఉంటూ తినుబండారాలు తయారు చేసి అమ్ముకుంటూ జీవనం సాగస్తున్నామని తెలిపారు. చుట్టుపక్కల వారికి ఇబ్బందులు కలుగకుండా పొగ గొట్టాన్ని సుమారు 40 అడుగుల పైనే ఉంచి చిమ్నీతో తినుబండారాలు తయారు చేసుకుంటున్నామని తెలిపారు. పొగ గొట్టం వల్ల పొగ వస్తుందంటూ పక్కనే ఉన్న ఇంటికి సంబంధించిన వ్యక్తితో పాటు కొంతమంది తమ ఇంట్లోకి జొరబడి అకారణంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ అని చూడకుంటా కొట్టారని తెలిపారు. వారు దాడి చేసిన దృశ్యాలు సిసి కెమెరా పుటేజిలో ఉన్నాయన్నారు. దాడి సంఘటనపై వన్‌టౌన్ సిఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అకారణంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దాడి చేసి తమ వ్యాపారాలపై జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించకపోయినా జరిమానాలు విధించడమేంటని ప్రశ్నించారు. తమను భయభ్రాంతులకు గురి చేస్తున్న వ్యక్తిపై, తమ ఫిర్యాదును పట్టించుకోని పోలీసులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి.. ఇద్దరు అరెస్టు



ఢిల్లీ, జూన్ 12: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. అసలేం జరిగిందంటే..

గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా ప్రమాణం చేసిన దారా



దమ్మపేట,జూన్ 12 (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆహ్వానం మేరకు హైదరాబాద్ లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులకు అభినందన సత్కారం, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ పదవీ స్వీకార మహోత్సవంలో పాల్గొనేందుకు హైదరాబాదు వెళ్లారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి వెంకటేశ్వ రరావు, దోసపాటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# ఎండకు ఎండి.. వానకు తడిచి..

**ఇదీ అంగన్వాడీ కేంద్రాల దుస్థితి...**
**పైకప్పు లేచిపోయిన అంగన్వాడీ కేంద్రం**
**అధ్వాన్నంగా బక్కచింతలపాడు సెంటర్**
**అటువైపు కన్నెత్తి చూడని అదికారులు**
**సమయం ఆసన్నమైనా మరమ్మత్తులు ఏవి**







చర్ల, జూన్ 12 (మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని మారుమూల అటవీప్రాంతాలలో గల అంగన్వాడీ కేంద్రాల పరిస్థితి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ దారుణంగా తయారయ్యాయి. దట్టమైన అటవీప్రాంతంలో గ్రామాలను నిర్మించడంతో రిజర్వ్ ఫారెస్ట్ పేరుతో అటవీశాఖ పక్కా భవన నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేయడం లేదు. ఫలితంగా పలు గ్రామాలలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు గ్రామస్తుల సహకారంతో నిర్మించిన తాటాకు గుడిసెలలో నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. పూరి గుడిసెలు కావడంతో అవి ప్రతి ఏటా గాలివానకు శిథిలావస్థకు చేరుకోవడం సర్వసాధారణంగా మారింది. వాటి నిర్వహణ భాధ్యతలను చూసుకోవాల్సిన సంబంధిత శాఖ అదికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు అవస్థలు పడుతున్నారు.

చర్ల మండలం బక్కచింతలపాటు అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. పక్కా భవనం లేకపోవడంతో గ్రామస్తులు నిర్మించిన తాత్కాలిక పూరి గుడిసెలో గత కొన్నేళ్లుగా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్న పూరి గుడిసెలోనే 32 మంది చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు అష్టకష్టాలు పడుతూ సర్దుకుపోతున్నారు. గ్రామస్తులు నిర్మించిన పూరి గుడిసె స్థానంలో పెద్ద షెడ్డు నిర్మిద్దామన్న ఆలోచన అధికారులకు లేకపోవడంతో చేసేది లేక వారంతా అందులోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ఉన్నప్పటికీ, ఇటీవలి వరకు ఈ శిథిలావస్థ గుడిసెలోనే మండుటెండలో కేంద్రాన్ని నిర్వహించి చిన్నారులకు 'అగ్ని' పరీక్ష పెట్టారు. చిన్నారుల సంరక్షణకు పాటు పడాల్సిన వ్యవస్థే వారిని ఇబ్బందుల నుండి కాపాడే చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల కురిసిన భారీ గాలివానకు కేంద్రం పైకప్పు లేచి పోయింది. వెంటనే దానిని సర్దుబాటు చేయాల్సిన సంబంధిత అదికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అందులోని విలువైన ఆటల సామగ్రి, ఇతర వస్తువులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పాడవుతున్నాయి. సెంటర్ దుస్థితిపై ఇటీవల టీచర్ తమ అధికారి దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడం గమనార్హం. విలువైన వస్తువులు పాడయిపోకుండా గుడిసెకు టార్పాలిన్ కట్టించాలన్న ఆలోచన చేయకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అంగన్వాడీ కేంద్రం చుట్టూ రక్షణ కంచె సైతం శిథిలావస్థకు చేరుకొంది. నిత్యం సెంటర్ ఆవరణలో పశువులు సంచరిస్తుండటంతో చిన్నారులకు రక్షణ కరువయింది. అంగన్ వాడీ సెంటర్(గుడిసె)కు గోడకట్టకపోవడంతో రక్షణగా పొరకను అమర్చారు. అదికూడా ఊడిపోవడంతో సెంటర్ దారుణంగా మారింది. ఐసిడిఎస్ అదికారులు మారుమూల గ్రామాల సెంటర్ల వైపు కన్నెత్తి చూడని కారణంగానే ఇటువంటి అధ్వాన్న పరిస్థితులు ఏర్పడ్డాయని గ్రామస్తులు మండి పడుతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు ముగిసి సోమవారం నుండి సెంటర్లను పున:ప్రారంబించే సమయం ఆసన్నమైనా నేటి వరకు వాటిని మరమ్మత్తులు చేసిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో యుద్ద ప్రాతిపదికన అంగన్వాడీ గుడిసెకు మరమ్మత్తులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి ఏటా ఇటువంటి ఇబ్బందులే తలెత్తుతున్నందున గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై సిడిపివో రేవతి వివరణ కోరగా తాను ఇక్కడకు ఇటీవలే బదిలీపై వచ్చానని, త్వరలో సెంటర్ ను సందర్శించి తగుచర్యలు తీసుకుంటానని వివరించారు.

# విబిజి రామ్‌జి బిల్లును రద్దు చేయాలి



- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు
- మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు

**ఖమ్మం, జూన్ 12(మనం న్యూస్)**: ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజి రామ్ జి బిల్లును రద్దు చేసి పాత పద్ధతిలోను ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక జిల్లా ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సంఘం ఖమ్మం జిల్లా 25వ మహాసభలు ముదిగొండ మండలం వెంకటాపురంలో విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు శుక్రవారం సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మహాసభ తీర్మానాలను వివరించారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి పనిని సంవత్సరానికి 200 రోజులు కల్పించాలని, రోజుకి 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, కేంద్ర బడ్జెట్లో నాలుగు లక్షల కోట్లు కేటాయించాలని తీర్మానించినట్లు తెలిపారు. పేదలకు భూమి పంచాలని, పెండింగ్ లో ఉన్న పోడు భూములకు, గిరిజన గిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. అర్హత కలిగిన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఐదు లక్షలతో ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలను నివారించాలని, రేషన్ షాపుల ద్వారా నిత్యవసర సరుకులను 14 రకాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పని కల్పించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. వృద్ధులకు వితంతులకు వికలాంగులకు పింఛన్లు పెంచుతామన్న వాగ్దానం వెంటనే అమలు చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జూన్ 20 21 22 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతాయని, ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 15 ,16 తేదీలలో గ్రామాలలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాలో ఐదు లక్షల మంది వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై సమగ్ర సర్వేలు నిర్వహించి వచ్చిన సమస్యలపై దశల వారి ఉద్యమాలు నిర్వహించనున్నామన్నారు.

# మైనార్టీలకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ



- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా

**కొత్తగూడెం, జూన్ 12(మనం న్యూస్)**: 2027లో సివిల్స్ పరీక్షలకు హాజరుకానున్న మైనార్టీ విద్యార్థులు ఎంఎస్ అకాడమీ, హైదరాబాద్ అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గత పదేళ్లుగా అకాడమీ ద్వారా శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి, దేశవ్యాప్తంగా వివిధ సర్వీసుల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ వివరాలను జూన్ 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల కోసం డ బ్ల్యూడ బ్ల్యూడ బ్ల్యూ.ఎంఎస్ఎడ్యుకేషన్ అకాడమి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, నిర్మల్, మహబూబ్‌నగర్, హనుమకొండ, సదాశివపేట, ఆదిలాబాద్, బోధన్ ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఎంపికైన వారికి ఏసీ తరగతి గదులు, ఇంటర్నెట్ సౌకర్యం, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బృందం ద్వారా నాణ్యమైన శిక్షణ అందించబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మైనార్టీ విద్యార్థులు వినియోగించుకుని సివిల్స్‌లో విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం 8520860785, 9030045422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

**నరసాపురం, జూన్ 12 (మనం న్యూస్)**:పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని స్వచ్ఛమైన పరిసరాలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు పట్టణ అభివృద్ధికి దోహదపడతాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. రాష్ట్రాన్ని పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నరసాపురం పట్టణంలోని రుస్తుంబాద జగన్నాథస్వామి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొని చీపురు చేతపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న పారిశుద్ధ్య కార్య క్రమాలకు ప్రజలు సహకరించి చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలి




- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్ 12 మనం న్యూస్**: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) కార్యక్రమాన్ని పూర్తిగా పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, డోర్ టు డోర్ వెరిఫికేషన్ ప్రక్రియలపై శుక్రవారం చిత్తూరు జడ్పీ సమావేశ మందిరంలో చిత్తూరు, పూతలపట్టు, జీడీ నెల్లూరు నియోజకవర్గాలతో పాటు పులిచర్ల, రొంపిచర్ల మండలాల బూత్ లెవల్ అధికారులకు (బీఎల్వోలు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) క్షేత్రస్థాయి సర్వేపై రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో బీఎల్వోలు పూర్తి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. 2025 ఓటర్ల జాబితాలను 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలని, వలస వచ్చినవారు తాత్కాలిక నివాసంలో ఉన్న వారి వివరాలను వారి స్వస్థల ఓటర్ల జాబితాలోని తండ్రి, తాతల పేర్లతో సరిపోల్చి పరిశీలించాలని తెలిపారు.ఈ సమావేశంలో డీఆర్ఓ కె. మోహన్ కుమార్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

# చావడి మటన్ మార్కెట్ కేంద్రంగా కుళ్లిన మాంసం సరఫరా

- చెన్నై, హైదరాబాద్ నుంచి 'కుళ్లిన తలకాయ మాంసం' దిగుమతి
- నిల్వ ఉంచి కుళ్లిన మాంసాహారం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్



**తిరుపతి, జూన్ 12 మనం న్యూస్**: నగరంలో నిల్వ ఉంచి కుళ్ళిన మాంసాహారాన్ని విక్రయిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ హెచ్చరించారు. శుక్రవారం తిరుపతి నగరంలోని ఆకస్మిక తనిఖీలలో కుళ్లిన మాంసాహారం బయటపడిందన్నారు. నగరంలోని ప్రముఖ 'పి.పి. చావడి మటన్ మార్కెట్' వేదికగా పెద్ద ఎత్తున సాగుతున్న కుళ్లిన మాంసం నెట్‌వర్క్‌ను తిరుపతి కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు రట్టు చేశారు. చెన్నై, హైదరాబాద్ మహానగరాల్లో అమ్ముడుపోకుండా మిగిలిపోయిన, పాచిపోయిన మేక, గొర్రె తలలు, కాళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరుపతికి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.సుమారు 1000 కిలోల (ఒక టన్ను) బరువున్న ఈ పాచిపోయిన, కుళ్లుబట్టి తీవ్ర దుర్వాసన వస్తున్న మాంసాన్ని నగరంలోని పలు హోటళ్లు, మెస్లకు సరఫరా చేస్తున్నారు.ప్రముఖ తిండి కేంద్రాలకు ఈ నాసిరకం, ప్రమాదకరమైన తలకాయ మాంసం, పాయా (కాళ్లు) సరఫరా అవుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.చెన్నై, హైదరాబాద్ లింకులు ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలుచేశారు.మెట్రో నగరాల్లో విక్రయించకుండా నిల్వ ఉంచిన వ్యర్థాలను, గడువు ముగిసిన మాంసాన్ని రసాయనాలు చల్లి తిరుపతి మార్కెట్‌కు తరలిస్తున్నట్లు అధికారులకు పక్కా సమాచారం అందింది. దీనిపై రంగంలోకి దిగిన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు పి.పి. చావడి మార్కెట్తో పాటు హోటళ్ల స్టోరేజ్ రూముల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు.ఈ తనిఖీల్లో ఫ్రీజర్లలో ఎటువంటి లేబుళ్లు, తయారీ తేదీలు లేకుండా కుళ్లిపోయి, రంగు మారిన స్థితిలో ఉన్న తలలు, కాళ్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు ఈ నమూనాలను సేకరించి తదుపరి పరీక్షల నిమిత్తం ల్యాబ్కు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులకు 50 వేలు జరిమానాలు విధించడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటువంటి కుళ్లిన, బ్యాక్టీరియా (సాల్మొనెల్లా, ఈ-కోలి) చేరిన మాంసాన్ని తినడం వల్ల తీవ్రమైన ఫుడ్ పాయిజనింగ్, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి జీర్ణకోశ వ్యాధులు వస్తాయని, ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర ప్రజలు, పర్యాటకులు హోటళ్లలో తలకాయ కూర, పాయా సూప్ వంటి వంటకాలకు దూరంగా ఉండాలని, నమ్మకమైన ప్రదేశాల్లో స్వయంగా చూసి కొనుగోలు చేసుకోవడమే సురక్షితమన్నారు.కుళ్ళిన, నిల్వ ఉంచిన మాంసాహారం, ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ వ్యాపారులను హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన మేకలు, పొట్టేలకు సంబంధించిన కాళ్లు, తలకాయలు వంటివి నిల్వ ఉంచి విక్రయిస్తున్నారని ప్రజల పిర్యాదు మేరకు శుక్రవారం ఉదయం 28వ వార్డులోని పెద్ద పీర్ల చావడి లోని మటన్ మార్కెట్ ను పారిశుద్ధ్య సిబ్బంది తో కలసి హెల్త్ ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి తీసుకువచ్చిన మాంసం ఇక్కడ ఫ్రీజర్లలో నిల్వ ఉంచి పలు హోటళ్లకు, ప్రజలకు విక్రాయిస్తున్నారని పిర్యాదులు అందాయని తెలిపారు. కమిషనర్ శారదా దేవి ఆదేశాల మేరకు శుక్రవారం కుల్లి పోయిన దశలో దుర్వాసన వస్తున్న మాంసం గుర్తించామని తెలిపారు. ఫ్రీజర్ లో ఉంచి దుర్వాసన వస్తున్న మాంసాన్ని ఇనుప చువ్వలతో లాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పరిసరాలు కూడా అపరిశుభ్రతతో దారుణంగా ఉందని తెలిపారు. నగరపాలక సంస్థ చట్టం 1955 సెక్షన్ 483,484, 487,492,521, 541, 542, 543, 544, 545, 546, 622లో అనుసరించి ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని తెలిపారు. కుళ్ళిన దశలో దుర్వాసన వెదజల్లుతున్న మాంసాన్ని సీజ్ చేశామని తెలిపారు. సీజ్ చేసిన మాంసాన్ని క్రిమిసంహారక మందులతో పిచికారీ చేసి కంపోస్ట్ యార్డు కు తరలించామని తెలిపారు. నిల్వ ఉంచిన కుళ్ళిన మాంసం, ఆహార పదార్థాలు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ తనిఖీ ల్లో శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మేస్త్రిలు, స్వర్ణ వార్డు కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# చిన్నారి చదువుకు అండగా నిలిచిన మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు

- ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి

**ఎమ్మిగనూరు జూన్ 10 మనం న్యూస్**: నియోజకవర్గ పరిధిలోని గోనెగండ్ల మండలం నేరుడుప్పల గ్రామానికి చెందిన చిన్నారి కె. మానస ఆవేదనను సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు వెంటనే స్పందించి, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం కె జి బి వి లో సీటు కేటాయించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు. మారుమూల ప్రాంత పరిధిలోని ఒక చిన్నారి చదువుకు అండగా నిలుస్తూ, ఆమెకు నాణ్యమైన విద్య అందేలా 24 గంటల్లోనే అడ్మిషన్ ఇప్పించడం కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కేవలం అబద్ధపు ప్రచారాలు, గణాంకాలతో కాలక్షేపం చేసిన వైసీపీ పాలన వల్ల విద్యావ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. దానికి భిన్నంగా నేడు మంత్రి నారా లోకేష్ గారి నాయకత్వంలో విద్యాశాఖ సంక్షేమ పథకాలతో పాటు నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

# యోగాను జీవితంలో ప్రతి ఒక్కరూ భాగం చేసుకోవాలి




- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్ 12మనం న్యూస్**: యోగాను జీవితంలో ప్రతి ఒక్కరూ భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.శుక్రవారం ఉదయం జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి 12 వ అంతర్జాతీయ యోగా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యోగా శిక్షకులు జి.శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో దాదాపు ఒక గంట పాటు నిర్వహించిన యోగా కార్యక్రమంలో అందరూ యోగాసనాలు వేయడం జరిగింది. అనంతరం ఓం సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయా సర్వే భద్రాణి పశ్యంతు మా ఖశ్చిత్ దుఃఖ భాగ్భవేత్ ఓం శాంతి శాంతి శాంతిః అనే యోగా మంత్రంతో కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా జీవితాంతం ఆచరించే ఆరోగ్యకరమైన జీవన విధానంగా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత ఏకాగ్రత ఆత్మవిశ్వాసంపెంపొందుతాయన్నారు. ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ రోజువారి జీవితంలో కొంత సమయాన్ని యోగా కోసం కేటాయించాలన్నారు. అప్పుడే మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోగలమని తెలిపారు. ఇప్పుడు ఉన్న అనేక రోగాలు రాకుండా ముందుగానే తగ్గించుకునేందుకు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడుతుందన్నారు.యోగా, నడక, సరైన ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. రోజువారీ జీవితంలో ఒత్తిడులు ఉన్నప్పటికీ ఆరోగ్యం కోసం యోగాను అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 7 నుంచి జూన్ 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చిత్తూరు జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రతి మండలంలో యోగా ట్రైనర్ మరియు మాస్టర్లచే యోగ నిర్వహించడం జరుగుతున్నదన్నారు.

ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ కె.మోహన్ కుమార్, కాణిపాకం ఆలయ ఈవో పెంచల కిషోర్, చైర్మన్ మణి నాయుడు, ఆర్డీవో శ్రీనివాసులు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, ఆయుష్ నోడల్ ఆఫీసర్ గోవిందప్ప, టూరిజం ఆఫీసర్ గౌరీ, ఐరాల ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎం ఈ ఓ, ఉపాధ్యాయులు, యోగ మాస్టర్లు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ఆశా వర్కర్లు, విద్యార్థినీ విద్యార్థులు సీనియర్ సిటిజన్ లతో కలసి పాల్గొన్నారు.

# ఎమ్మార్వోని కలిసిన తోవి టిడిపి నాయకులు



**కౌతాళం జూన్ 12 మనం న్యూస్**: కౌతాళం ఎమ్మార్వోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రజనీకాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసిన తోవి టిడిపి నాయకులు సోమప్ప,గణేష్ కౌతాళం డిప్యూటీ తాసిల్దార్ గా ఉన్న రజనీకాంత్ రెడ్డికి పదోన్నతి పొంది తాసిల్దార్ గా ప్రభుత్వం నియమించడం జరిగింది.అందువలన శుక్రవారం రోజున రజనీకాంత్ రెడ్డిని కౌతాళం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ పూల మాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన తోవి టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో తోవి టిడిపి నాయకులు సోమప్ప, గణేష్,విజయ్ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుంది


- సూపర్ సిక్స్ అన్నారు పక్కన పడేశారు
- వైసీపీ సమన్వయకర్త డాక్టర్- సునీల్ కుమార్




**పూతలపట్టు జూన్ 12 మనం న్యూస్**: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు మోసాలుగా మిగిలిపోయాయని రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని సూపర్ సిక్స్ పథకాలను చెప్పి పక్కన పడేశారని పూతలపట్టు నియోజకవర్గం వైసిపి పార్టీ సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ తెలుగుదేశం ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. వైయస్సార్సీపిపార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకురీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమాన్ కరుణాకర్ రెడ్డి నాయకత్వం లో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం నియోజకవర్గ వైసిపి నాయకులు కార్యకర్తలు అంతా కలిసి శాంతియుతంగా ప్రభుత్వ ఆలంబిస్తున్న వ్యతిరేక విధానాలు ఎండ కడుతూ భారీ స్థాయిలో పూతలపట్టు నియోజకవర్గం కేంద్రంలో అధిక సంఖ్యలో చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దళిత కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం గోల్మాల్ ప్రభుత్వా ఎంతోమంది విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని చంద్రబాబు పాలనలో డీఎస్సీ పూర్తిగా విరుద్ధంగా సాగిందని ఆమె అన్నారు. డీఎస్సీ ఎప్పుడు నిర్వహించిన జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రక్రియ జరిగేదని ప్రస్తుతం డీఎస్సీ కలెక్టర్ ఒక మెరిట్ ఫలితాలు లేవు మార్కులు ఆధారం, కట్అప్ మార్కులుప్రదర్శన లేవు ఉద్యోగులకు సంబంధించి పోటీ పరీక్షలు రాకుండా హనుమంతుడు ఎమ్మెల్యేలు చెప్పిన వారికి ఉద్యోగాలు కట్టబెడుతున్నారు తప్ప సామాన్య యువతకు మొండి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ వైసిపి పార్టీ పరిశీలకలు జాబ్ జాన్ పూతలపట్టు నియోజకవర్గం బుచ్చిరెడ్డి, మోహన్ రెడ్డి,రామచంద్ర రెడ్డి, 5 వందల వెయ్యి మంది వరకు వైసీపీలో కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చంద్రబాబు ప్రజలకు పంగనామాలు

## నగరిలో రోజా ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, సూపర్ సిక్స్ మేనిఫెస్టో దహనం



**తిరుపతి, జూన్ 12(మనంన్యూస్)**: వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా నగరిలో మాజీ మంత్రి రోజమ్మ ఆధ్వర్యంలో, శ్రీ భూమన కరుణాకర్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి భారీ ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు .చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని నిరసిస్తూ, ప్రజలకు పంగనామాలు పెట్టిన చంద్రబాబుకు వ్యతిరేకంగా రోజమ్మ పార్టీ నాయకులు, కార్యకర్తలకు నామాలు పెట్టి వినూత్న నిరసన తెలిపారు. అనంతరం ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విధంగా నగరి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తూ చంద్రబాబు మోసపూరిత హామీలపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. అలాగే నగరి టవర్ క్లాక్ వద్ద చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల మేనిఫెస్టో ప్రతులను దహనం చేస్తూ, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కిందని రోజమ్మ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా రోజమ్మ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి అలవాటైందని విమర్శించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి ఇప్పుడు హామీలను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకాన్ని వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఐదు మండలాలు రెండు మున్సిపాలిటీకి సంబంధించిన వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు మహిళలు యువతలు అభిమానులు పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష - రూ. 3 లక్షలు జరిమానా

- తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

**తిరుపతి, జూన్12మనం న్యూస్**: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3 లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్సు ఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 14/2018 కేసులో ఇద్దరు ముద్దాయిలు తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీట్ అటవీ పరిధిలోని చామల రేంజ్ లో అరెస్టయ్యారు. వీరు తమిళనాడు, తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా పడిమలై గ్రామానికి చెందిన అప్పస్వామి, కాశీ లు కాగా వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ.3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పి. శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న టాస్క్ ఫోర్స్ దర్యాప్తు అధికారులను, కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

# సహజ ఎరువుల వినియోగం ఎంతో అవసరం

**మహానంది, జూన్12 (మనంన్యూస్)**: వ్యవసాయాభివృద్ధికి సహజ ఎరువుల వినియోగం ఎంతో అవసరమని ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా రసాయన ఎరువుల వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోందని, నేల సారవంతతను కాపాడేందుకు జీవన ఎరువుల వినియోగాన్ని రైతులు పెంచాలన్నారు.

కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మూడే అర్జున్ నాయక్, డాక్టర్ ఎం. విష్ణు ప్రియ, వీఏఏ భారతి, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## ఆ కాల్స్ నమ్మొద్దు: కెనడాలోని భారత పౌరులకు అడ్వైజరీ



**ఒట్టావా, జూన్ 12:** కెనడాలోని భారత పౌరులకు అక్కడి కాన్సులేట్ కీలక అడ్వైజరీ జారీ చేసింది. కాన్సులేట్ అధికారుల పేరుతో సైబర్ మోసగాళ్లు నకిలీ కాల్స్ చేస్తున్నారని.. వాటిని నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. వీసా, ఇమిగ్రేషన్ హోదా, శాశ్వత నివాసం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. అటువంటి మోసపూరిత కాల్స్‌లో అప్రమత్తంగా ఉండాలని.. ఫేక్ కాల్స్ వచ్చిన వెంటనే తమకు గానీ స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే ఇటువంటి మోసపూరిత కాల్స్ వచ్చినట్లు అనేకమంది భారతీయులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపింది. తమ పేరుతో వచ్చే కాల్స్కు సమాధానం ఇవ్వొద్దని.. ఎటువంటి వ్యక్తిగత సమాచారాన్నీ వారితో షేర్ చేసుకోవద్దని భారత కాన్సులేట్ సూచించింది. వీసాల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ఏదైనా అదనపు పత్రాలు అవసరమైతే వాటికోసం అధికారిక మెయిల్ నుంచి సందేశం పంపిస్తామని తెలిపింది. అత్యవసర సమయాల్లో తమ అధికారులు వీసా దరఖాస్తుదారులకు కాల్ చేస్తే దానికి సంబంధించిన నెంబర్, ఇతర వివరాలను తెలియజేస్తారని స్పష్టం చేసింది.

## హెచ్-1బీ వీసా ఫీజుపై వెనక్కి తగ్గని ట్రంప్..!




**వాషింగ్టన్, జూన్ 12:** హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గడం లేదు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది.

హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమొక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట కలిగింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లే.

## టాటాలను బెంగాల్కు తిరిగి తీసుకొస్తాం: సువేందు అధికారి




**కోల్‌కతా, జూన్ 12:** టాటాలను తిరిగి పశ్చిమబెంగాల్‌కు తీసుకువస్తామని సీఎం సువేందు అధికారి ప్రకటించారు. భూసేకరణపై నిరసనల కారణంగా 2008లో సింగూర్ నుంచి టాటా మోటార్స్ నానో ప్రాజెక్ట్ వైదొలగిన తర్వాత ఆ సంస్థ తిరిగి బెంగాల్‌కు రాలేదన్నారు. దాదాపు 17 ఏళ్ల అనంతరం బెంగాల్ పారిశ్రామిక పునరుద్ధరణలో భాగంగా రాష్ట్రంలో పెద్దఎత్తున టాటా గ్రూప్ పెట్టుబడులు తీసుకురావడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలో బెంగాల్ పారిశ్రామిక వైభవాన్ని పునరుద్ధరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గతంలో సింగూర్, నందిగ్రామ్ ఆందోళనలకు దారితీసిన తప్పులను పునరావృతం చేయకుండా పెట్టుబడులను ఆకర్షించి, ఉద్యోగాలు సృష్టిస్తామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

2006లో పశ్చిమబెంగాల్లోని హుగ్లీ జిల్లా సింగూర్లో టాటా మోటార్స్ 'నానో' కార్ల తయారీ కర్మాగారాన్ని ఏర్పాటుచేయడానికి అప్పటి వామపక్ష ప్రభుత్వం దాదాపు వెయ్యి ఎకరాల భూమిని సేకరించింది. అయితే, బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ఉద్యమం జరిగింది. తీవ్ర నిరసనల కారణంగా 2008 అక్టోబరులో టాటా గ్రూప్ ఆ ప్రాజెక్ట్‌ను బెంగాల్ నుంచి గుజరాత్‌కు తరలించింది. 2016లో దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ భూసేకరణను రద్దు చేసి, రైతులకు భూములను అప్పగించాలని చారిత్రక తీర్పునిచ్చింది.

## 'నాటో' ఫ్యూజులు పీకేందుకు అమెరికా యత్నాలు!

### నాటోకు అందిస్తోన్న సహాయానికి కత్తెర



**వాషింగ్టన్, జూన్ 12:** ఇరాన్ యుద్ధంలో తనకు సహకరించేందుకు ముందుకురాని ఐరోపా దేశాల విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. నాటో కూటమికి అందిస్తోన్న సహాయాన్ని కత్తిరించేందుకు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు రచిస్తోంది. ఐరోపాలో నాటో కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంచే విమానాలు, యుద్ధనౌకలను గణనీయంగా తగ్గించాలని అమెరికా యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అగ్రరాజ్యం తన ఆలోచనను గనక అమలు చేస్తే.. సుదూర దాడులు చేయడం, నిఘా వంటి అంశాల్లో నాటో సామర్థ్యాలు పరిమితం కానున్నాయని తెలుస్తోంది.

అమెరికా తన ప్లాన్లో భాగంగా ఎఫ్-16, ఎఫ్-15ఉ ఫైటర్ జెట్ల సంఖ్యను 150 నుంచి 100కు తగ్గొచ్చు. అలాగే, సముద్ర నిఘా విమానాల సంఖ్యను 26 నుంచి 15కు కుదించొచ్చు. ఐరోపాలో అందుబాటులో ఉన్న ఎనిమిది రీఫ్యూయెలింగ్ ట్యాంకర్ విమానాలను ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి. జలంతర్గామి, విమాన వాహక నౌకతో సహా ఐరోపాలో నాటో కార్యకలాపాల్లో భాగమయ్యే పలు నౌకలు, విమానాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో తన మిత్రదేశాల రక్షణ కోసం కేటాయించిన రెండు బాంబర్ గ్రూప్లో ఒకదాని స్థానాన్ని మార్చాలనుకుంటోందని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలపై అమెరికా రక్షణశాఖ గానీ, నాటో గానీ స్పందించలేదు. నాటోకు అందించే సహకారంలో సర్దుబాటు చేసుకుంటామని గతవారం యూఎస్ ఈస్టర్న్ కమాండ్ ప్రకటించిన నేపథ్యంలో ఈ కథనాలు రావడం గమనార్హం. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో చేసిన విజ్ఞప్తిని ఐరోపా దేశాలు పట్టించుకోలేదు. దాంతో ఆగ్రహానికి గురైన ఆయన.. నాటో కూటమి కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఆ కూటమి ఓ కాగితపు పులి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

## ప్రాణాలతో బతికున్నా కానీ..: ఎయిరిండియా మృత్యుంజయుడి ఆవేదన

### దర్యాప్తు కొనసాగుతోంది: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



**అహ్మదాబాద్/ఢిల్లీ, జూన్ 12:** దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఎయిరిండియా ప్రమాద ఘటన జరిగిన నేటికి ఏడాది. ఆ దుర్ఘటన నుంచి బయటపడిన ఒక్కే ఒక్కడు విశ్వాస్ కుమార్ రమేశ్. ఏడాది గడిచిపోయినా.. ఆయన ఈ విషాదాన్ని మర్చిపోలేకపోతున్నారు. అలాగే బాధిత కుటుంబాల మనసుల్లోని ప్రశ్నలకు సమాధానాలు కావాలని అడుగుతున్నారు.

గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ ఒక్కడే బయటపడ్డారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్.. గుజరాత్‌లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ రోజు విమానంలో 11-ఏ సీటులో విశ్వాస్ కుమార్ కూర్చున్నారు. ఆ సీటు విరిగిపడిపోవడంతో ఆయనకు మంటలు అంటుకోలేదు. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కిన దృశ్యాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. కాగా.. దుర్ఘటనకు సంబంధించిన తుది రిపోర్ట్ రావడానికి ఇంకా రెండు నెలలు పట్టొచ్చని తెలుస్తోంది.

ఆ విమానం కూలిన హాస్టల్ భవనం స్థానంలో రూ.547 కోట్లతో మెడికల్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర మంత్రి ప్రఫుల్ పన్సేరియా వెల్లడించారు. వైద్య విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు దీనిని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు.

15 బాధిత కుటుంబాలు తమ ఆత్మీయుల వ్యక్తిగత వస్తువులను స్వీకరించడానికి నిరాకరించాయని ఎయిరిండియా మాతృ సంస్థ టాటా గ్రూప్ శుక్రవారం వెల్లడించింది. 91 శాతం కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహార చెల్లింపును పూర్తిచేశామని తెలిపింది. పత్రాలు సరిగా లేని, పరిహార స్వీకరణకు నిరాకరించిన కేసుల్లో పరిహార చెల్లింపు ప్రక్రియ పూర్తికాలేదని చెప్పారు. 96 శాతం బాధిత కుటుంబాలకు మధ్యంతర పరిహారం (రూ.25 లక్షలు) అందించామని పేర్కొంది.

''నేను బతికి బయటపడినదే ప్రజలకు కనిపిస్తుంది. కానీ నాలుగు గోడల మధ్య నేను ఎదుర్కొంటున్న సవాళ్లు ఎవరికీ అర్థం కావు. ఇప్పటికీ నేను నిద్రలేమి, ఆందోళన, చేదు జ్ఞాపకాలతో పోరాడుతున్నాను. ఒక సంవత్సరం గడిచిపోయింది. బతికి ఉన్నందుకు కృతజ్ఞుడినే. కానీ అప్పటినుంచి నేను చేస్తోన్న పోరాటాన్ని మాత్రం మాటల్లో వర్ణించలేను. నా జీవితాన్ని పునర్నిర్మించుకుంటూ కుటుంబంతో కలిసి ముందుకు సాగుతున్నాను'' అని జాతీయమీడియాతో మాట్లాడారు. ఈ బాధ తన ఒక్కడిదే కాదని, ప్రభావిత కుటుంబాలు కూడా ఇదేరకమైన వేదనను అనుభవిస్తున్నాయని విశ్వాస్ చెప్పారు. జరిగిన దానిని ఎవరూ మార్చలేరు కానీ.. ప్రజలకు నిజాయతీ, వారు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు కావాలన్నారు.

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటన నేపథ్యంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందన్నారు. ప్రమాదంపై త్వరలో తుది నివేదిక వస్తుందని.. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విమానయాన భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయొద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## అమెరికా దౌత్యవేత్తకు మరోసారి భారత్ సమన్లు



**ఢిల్లీ, జూన్ 12:** భారత విదేశాంగ శాఖ మరోసారి ఢిల్లీలోని అమెరికా దౌత్యవేత్త జేసన్ మీక్‌సన్‌కు సమన్లు జారీ చేసింది. ఒమన్ తీరంలో భారతీయులతో వెళ్తున్న నౌకలపై గత నాలుగు రోజుల వ్యవధిలోనే అమెరికా మూడు సార్లు దాడులు చేసింది. గురువారం కూడా ఓ నౌకపై దాడి జరగ్గా 20 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ దాడుల్ని ఖండించిన భారత్ తాజాగా అమెరికా రాయబారికి సమన్లు జారీ చేసింది. అంతకుముందు ఓ నౌకపై దాడి ఘటనలో.. ముగ్గురు భారతీయులు గల్లంతైన సమయంలోనూ భారత్ సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

పశ్చిమాసియా సముద్ర జలాల్లో వాణిజ్య నౌకాయానానికి పెరుగుతున్న ముప్పుపై విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు, అమెరికా నౌకాదళం దాడి చేయడంతో ఒమన్ తీరంలో బుధవారం గల్లంతైన ముగ్గురు భారతీయ నావికులు మృతిచెందడంతో అక్కడ ఉన్న భారతీయులకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ కీలక సూచనలు చేసింది. హర్మూజ్, ఒమన్ తీరాల్లో పని చేస్తున్న దాదాపు 18వేల మంది నావికులకు సముద్ర భద్రతా సంబంధిత అడ్వైజరీని జారీ చేసింది.

## ఎల్నినోపై వాతావరణ విభాగం హెచ్చరిక



**ఢిల్లీ, జూన్ 12:** ఎల్నినోపై భారత వాతావరణ విభాగం ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. భూమధ్య రేఖ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై ఎల్నినో పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది. ఈ రుతుపవనాల సీజన్లో ఇది మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని.. పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపనుందని హెచ్చరించింది. దేశంలో రుతుపవనాలపై ఎల్నినో ప్రతికూల ప్రభావం ఉంటుందని పేర్కొంది. అత్యధిక వర్షపాతం నమోదయ్యే నైరుతి రుతుపవనాల్లో ఈసారి వర్షపాతం తగ్గుతుందని అంచనా వేసింది.

భూమధ్య రేఖ ప్రాంతంలో పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు సాధారణం కన్నా ఎక్కువగా వేడెక్కడాన్ని ఎల్నినోగా అభివర్ణిస్తారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పోకడలు తారుమారవుతాయి. చివరిగా ఎల్నినో ప్రభావం 2023లో ఏర్పడింది. ఆ సమయంలో దేశవ్యాప్తంగా రుతుపవనాల అంతరాయం, వర్షపాతంలో వైవిధ్యం వంటి పరిస్థితులు తలెత్తాయి.

ఎల్నినో ప్రభావానికి అత్యంత ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్న 197 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. పంట నష్టభయాలను తగ్గించడానికి రాష్ట్రాల వారీగా అత్యవసర ప్రణాళికలను రూపొందించామన్నారు. వాతావరణ పరిస్థితులు క్షీణిస్తే త్వరితగతిన స్పందించేందుకు ముందుజాగ్రత్త చర్యగా ప్రభుత్వం విత్తనాలతో పాటు ఇతర కీలక వ్యవసాయ ఉత్పాదకాలను నిల్వ చేసిందని వెల్లడించారు. ఎల్నినో వల్ల ఏర్పడే వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు 'ఖేత్ బచావో అభియాన్' అనే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

## ఆ 10% సుంకాల వసూలు కొనసాగించొచ్చు

- ఫెడరల్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు
- ట్రంప్‌నకు భారీ ఊరట



**వాషింగ్టన్, జూన్ 12:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. ప్రపంచవ్యాప్తంగా దిగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ విధించిన 10 శాతం గ్లోబల్ సుంకాలను వాషింగన్‌లోని ఫెడరల్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు సమర్థించింది. ఆ సుంకాల వసూలును కొనసాగించవచ్చని కీలక తీర్పునిచ్చింది. గతేడాది భారత్ సహా అన్ని దేశాలపై ట్రంప్ భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. వాటిని ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆ వెంటనే ట్రేడ్ యాక్ట్ 1974లోని సెక్షన్ 122ను ఉపయోగించి జులై 24 వరకు అమల్లో ఉండేలా 10 శాతం తాత్కాలిక సుంకాలను ట్రంప్ విధించారు. రెండు వ్యాపార సంస్థలు ఇటీవల దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. అక్కడ ట్రంప్నకు ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం సుంకాలను నిర్ణయించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టు స్పష్టంచేసింది. ట్రంప్ యంత్రాంగం దీనిపై అప్పీల్ చేయగా.. వారికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. కాగా.. ఈ కేసుపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## భారత్‌పై దాడికి మీరు ఆయుధాలు అమ్మొచ్చా.. మేము రష్యా నుంచి చమురు కొనకూడదా..?

- విదేశాంగమంత్రి జైశంకర్



**ఢిల్లీ, జూన్ 12:** పశ్చిమదేశాలకు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మరోసారి షాక్ ఇచ్చారు. రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలే.. భారత్ ప్రత్యర్థులకు ఆయుధాలను విక్రయించిన విషయాన్ని జైశంకర్ గుర్తుచేశారు. ఆ ఆయుధాలతో భారత్పై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఈసందర్భంగా మన దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు రష్యా చమురు కొనుగోలు చేయాలని అమెరికానే చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఫిన్లాండ్లో జరిగిన చర్చా కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

ఉక్రెయిన్తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ''భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదు'' అని పేర్కొన్నారు.

అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ''ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం'' అని మంత్రి వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

## ఆ తృణమూల్ నేతకు బంగ్లాదేశ్ అతివాద సంస్థలతో సంబంధాలు: రెబల్ ఎంపీ



**కోల్‌కతా, జూన్ 12:** తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ ఆ పార్టీ మాజీ ఎంపీపై సంచలన ఆరోపణలు చేశారు. తృణమూల్ మాజీ రాజ్యసభ ఎంపీ అహ్మద్ హసన్ ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్‌కు చెందిన అతివాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు పశ్చిమబెంగాల్ సీఎం సువేందు అధికారికి లేఖ రాశారు. ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్ సంస్థలతో సంబంధాలు ఉండొచ్చని పలు మీడియా నివేదికలు చేసిన బహిరంగ ఆరోపణలను ఘోష్ తన లేఖలో ప్రస్తావించారు.
టీఎంసీ హయాంలో చికెన్ నెక్ కారిడార్ (సిలిగుడీ కారిడార్)తో సహా కొన్ని సున్నితమైన ప్రాంతాలలో భారత సైన్యం, సరిహద్దు భద్రతా దళం అభ్యర్థించిన భూమిని కేటాయించకపోవడం పైనా పలు అనుమానాలు లేవనెత్తారు. వీటిపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు.

రెబల్ ఎమ్మెల్యే రితబ్రత టీఎంసీలో తిరుగుబాటు లేవనెత్తిన అంశంతో తమకేమీ సంబంధం లేదని కకోలీ ఘోష్ పేర్కొన్నారు. ఆయన అసెంబ్లీలో ఉంటే తాను పార్లమెంట్‌లో ఉన్నానని అన్నారు. రెండు వర్గాలు వేర్వేరు రాజకీయ లక్ష్యాలను అనుసరిస్తున్నాయన్నారు.

ఇటీవల లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే.

వారు స్పీకర్‌కు రాసిన లేఖ నేడు జాతీయమీడియా చేతికి వచ్చింది. దీంతో రెబల్ ఎంపీలలో కకోలీ ఘోష్, శతాబ్ది రాయ్, భారత మాజీ క్రికెటర్, ఎంపీ యూసుఫ్ పఠాన్, నటి సయోనీ ఘోష్, నటుడు శత్రుఘ్న సిన్హా మొదలైన కీలక నేతలు ఉన్నట్లు వెల్లడయ్యింది.

## టిండర్ యాప్‌లో హనీట్రాప్..

### రూ.లక్షలు పోగొట్టుకున్న మహిళా న్యాయమూర్తి



**ఛండీగఢ్, జూన్ 12:** హనీట్రాప్‌లో పడి.. ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే..

హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు.

ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. అభిమన్యు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు.

ఈ కేసు విచారణ సందర్భంగా లావాదేవీలు సహాయకురాలి బ్యాంకు నుంచి కాకుండా.. న్యాయమూర్తి ఖాతాల నుంచి జరిగాయని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ గుర్తించారు. అలాగే దర్యాప్తులో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు, న్యాయమూర్తికి సంబంధించిన పూర్తి వాట్సప్ సంభాషణలను, కాల్ రికార్డులు సేకరించలేదని తెలిపారు. దర్యాప్తు అసంపూర్తిగా ఉన్నందున.. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉందని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. టిండర్ యాప్, వాట్సప్లో ఇరువురి మధ్య జరిగిన పూర్తి సంభాషణలను సేకరించాలని ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. నిధుల బదిలీకి వివరాలు.. నిందితుడి ఫోన్కి సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణను తొందరగా నిర్వహించాలని పేర్కొంది.

# ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరాలి

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడొద్దు**

**సెమీ వాల్ టెక్నాలజీ ద్వారా నాణ్యమైన గృహాలను నిర్మించవచ్చు**

**రెండో విడత ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపికలు పారదర్శకతతో నిర్వహించాలి**

**మన్ననూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 12 (మనం బ్యూరో):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. శుక్రవారం నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం, ఇన్చార్జి జిల్లా హౌసింగ్ పిడి గోపాల్ నాయక్తో కలిసి లబ్ధిదారులకు మంజూరైన గృహాల వద్దకు వెళ్లి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మన్ననూరులో సెమీ వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న గృహాలను కలెక్టర్ సందర్శించారు. నిర్మాణ నాణ్యత, పనుల వేగం, సాంకేతిక ప్రమాణాలు, లబ్ధిదారులకు అందుతున్న సహకారం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. లబ్ధిదారులతో నేరుగా జిల్లా కలెక్టర్ మాట్లాడడం జరిగింది. గృహ నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, నిర్మాణ సామగ్రి లభ్యత, ఆర్థిక సహాయం, సాంకేతిక మార్గదర్శకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో మరింత పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ప్రతి ఇంటి నిర్మాణం నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. సెమీ వాల్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో నాణ్యమైన గృహాలను నిర్మించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ సాంకేతిక విధానం వల్ల నిర్మాణ వ్యయం తగ్గడమే కాకుండా గృహాల బలపాటు, మన్నిక కూడా పెరుగుతుందని తెలిపారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, శాశ్వత నివాస వసతి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం మన్ననూరు రైతు వేదికలో అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో మొదటి విడతలో మంజూరైన 3,500 ఇందిరమ్మ గృహాల నిర్మాణ పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణాల ప్రస్తుత స్థితి, పనుల పురోగతి, ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా సమస్యలు, నిర్మాణ సామగ్రి అందుబాటు, లబ్ధిదారుల భాగస్వామ్యం వంటి అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...., అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో మంజూరైన ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గృహ నిర్మాణాల్లో జాప్యానికి తావు లేకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, సలహాలు అందించాలని ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడం ద్వారా పనుల వేగాన్ని మరింత పెంచాలని సూచించారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణం కేవలం ఒక సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సామాజిక బాధ్యతగా అధికారులు భావించాలని కలెక్టర్ తెలిపారు. సొంత ఇంటి కలను నెరవేర్చడం ద్వారా వేలాది కుటుంబాల జీవితాల్లో స్థిరత్వం, భద్రత, గౌరవం తీసుకురావచ్చవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలపాలని అధికారులకు సూచించారు. రెండో విడత ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 20వ. తేదీలోగా లబ్ధిదారుల పూర్తి వివరాలను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిజంగా అర్హులైన కుటుంబాలను గుర్తించాలన్నారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి వివక్ష లేదా అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో ఇప్పటికీ పూరిగుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల వివరాలను ప్రత్యేకంగా సేకరించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ ఇందిరమ్మ గృహ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, హౌసింగ్ శాఖ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత




**తుంగతుర్తి, జూన్ 12 (మనం న్యూస్):** డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత అని, డ్రగ్స్ మత్తులో జీవితం నాశనం అవుతుందని ఎస్సై క్రాంతి కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజలకు డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై క్రాంతి కుమార్ ప్రజలతో ప్రతిజ్ఞ చేపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శాంతియుత సమాజం మనందరి బాధ్యత అని డ్రగ్స్ వల్ల సమాజంలో యువశక్తి విచ్ఛిన్నం అవుతుందని, డ్రగ్స్ మత్తులో దాడులు, నేరాలు పెరుగుతున్నాయన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల శరీరంలో శక్తి తగ్గి మంచి భవిష్యత్తు కోల్పోతారన్నారు. డ్రగ్స్కు అలవాటు పడిన వారి గురించి సమాచారం ఇవ్వాలని, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పునకు కృషి చేస్తామన్నారు. సాంఘిక వాతావరణం నెలకొని ఉన్న ప్రాంతాలు మాత్రమే సత్వర అభివృద్ధి సాధిస్తాయని శాంతిభద్రత పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అనీ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మహిళలు చిన్నారులతో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సైబర్ నేరాల బారిన పడిన వెంటనే షి టీమ్స్ లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గురుస్వామి, రావులపల్లి, వెంపటి, సర్పంచులు చింతకుంట్ల మనోజ్, తప్పట్ల ఎల్లయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హమాలీ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



**తిరుమలగిరి, జూన్ 12 (మనం న్యూస్):** తిరుమలగిరి మార్కెట్ కమిటీ హమాలీ యూనియన్ గల నూతన కమిటీని శుక్రవారం అనుకున్నారు. అధ్యక్షులుగా సోమరాపు సోమనర్సయ్య, ఉపాధ్యాక్షులు బోడ కొండయ్య. ఏనుగుల రామచంద్రు, కార్యదర్శి కందుకూరి లక్ష్మయ్య, కోశాధికారి ఏనుగుల వెంకన్న, సహాయ కార్యదర్శి వంగల సోమయ్య, పాలాభిందాల రాములు, ఆర్గనైగింగ్ సెక్రటరీ బోడ సోమలింగం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రెస్ తుంగతుర్తి నియోజకవర్గం కన్వీనర్ కందుకూరి లక్ష్మయ్య ఎన్నికైన వారిని కాలువతో ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ లక్ష్మయ్యను సన్మానించారు.

# జీవితం విలువైనది డ్రగ్స్‌కు బానిస కావొద్దు



- **స్థానిక యువకులతో ప్రతిజ్ఞ చేయించిన ఎస్ఐ సైదిరెడ్డి**

**నేరేడుచర్ల జూన్ 12 మనం న్యూస్:** అన్నింటికంటే మానవ జీవితం విలువైనదని అంతటి అద్భుత జీవితాన్ని డ్రగ్స్ కు బానిస చేయవద్దు అని నేరేడుచర్ల ఎస్సై సైదిరెడ్డి అన్నారు. నేరేడుచర్ల పట్టణ కేంద్రంలో గల జాన్ పహాడ్ రోడ్డు నందు యువతకు డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలను శుక్రవారం వివరించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు నేరేడుచర్ల మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు స్థానిక ఎస్ఐ హాజరై మాట్లాడారు. మన సమాజం నుండి డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది అన్నారు, గంజాయి వియోగం వల్ల మన పిల్లలు, యువత అనారోగ్యాలకు గురైతున్నారు, దీని వల్ల బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు అన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో అందరూ భాగస్వామ్యమై పోలీసు వారికి సమాచారం ఇవ్వాలి అన్నారు. పోలీసు నిత్యం తనిఖీలు నిర్వహిస్తుంది, గంజాయి అలవాటు, రవాణా పై నిఘా ఉంచాం. అనంతరం స్థానిక ప్రజలతో డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు.

# జర్నలిస్టులు సత్యనారాయణ, పాలకూరి శేఖర్‌ల మరణం తీరని లోటు

## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపిన జర్నలిస్టులు



**నల్గొండ, జూన్ 12( మనం ప్రతినిధి):** జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టులు దోసపాటి సత్యనారాయణ, పాలకూరి శేఖర్ గౌడ్ లు వరుసగా మరణించడం పట్ల నల్గొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, ఉయ్యాల లింగయ్య గౌడ్, ఎండి సయ్యద్ ల తో పాటు పలువురు జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.రెండు రోజుల వ్యవధిలో ఇలా ఇద్దరు నిక్సాన, సుదీర్ఘ అనుభవం ఉన్న సహచరులను కోల్పోవడం నల్గొండ జర్నలిస్ట్ సమూహానికి విషాదకరమని వారు ఒక ప్రకటన లో తెలిపారు.వారు దశాబ్దాలుగా జర్నలిజం విలువలకు కట్టుబడి,సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచే శారని గుర్తు చేశారు.క్షేత్రస్థాయిలో ప్రజల గొంతుకగా నిలిచి,జిల్లా కేంద్రం లో తమదైన ముద్ర వేసుకున్నారని,నిత్యం పదునైన కలంతో వార్తా ప్రపంచంలో చురుగ్గా ఉంటూ, సమాజ హితం కోసం శ్రమించిన ఇద్దరు సీనియర్ మిత్రులు ఇలా ఒకరి వెనుక ఒకరు అనంత లోకాలకు తరలిపోవడం పాత్రికేయ కుటుంబ సభ్యులందరినీ తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.అమరులైన జర్నలిస్టులకు ఆత్మలకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ... వారి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు నల్గొండ ప్రెస్ క్లబ్ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్టు వారు తెలిపారు.మరణించిన ఇద్దరు జర్నలిస్టుల కుటుంబాలకు నల్గొండ ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ప్రకటించారు.

# ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో మొక్కల నాటివేత



**నల్లగొండ,జూన్ 12( మనం న్యూస్): 90 రోజుల** ప్రజా పాలన సందర్భంగా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో క్లీన్ హోమ్ గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటనైనది. ఈ సందర్భంగా ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ వెంకటేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు చెట్లే ప్రాణం చెట్లే జీవం అని అందుకే ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని పట్టణ ప్రజలను కోరినారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వీరేంద్ర బాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఈ వానాకాలం సీజన్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదే మాదిరిగా ప్లాస్టిక్ నిరోధించడంలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషిస్తూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను నిరోధిస్తూ వాటి స్థానములో జ్యూట్ బ్యాగులు కాటన్ బ్యాగులు స్టీల్ బాక్స్ ఉపయోగించాలని ప్రజలకు సూచించారు ఈ సందర్భంగా ఆదిమల్ల మణిరాజు చేసినటువంటి సేవలను అభినందించారు. అలాగే స్నేక్ క్యాచర్ దిగ్నేష్ సేవలను కొనియాడారు. కార్యక్రమం అనంతరం క్లీన్ హోమ్ గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ను దిగ్నేషను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అసిము డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రవీందర్ సెక్షన్ ఆఫీసర్లు మల్లేష్ మరియు ఎల్లేష్ బీట్ ఆఫీసర్లు సౌజన్య భవాని శిరీష రజిత అస్రఫ్ మరియు ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి

- **సినీ బృందం ఆర్థిక చేయూత**
- **సేవా కార్యక్రమంతో ఆకట్టుకున్న జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్**

**గోరంట్ల, జూన్ 12మనం న్యూస్:** అనంతపురానికి చెందిన మూడేళ్ల చిన్నారి డీఎండీ (డ్యూషేన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ)అనే అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న విషయం ఆర్టీవీ ద్వారా తెలుసుకున్న జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ బృందం మానవత్వాన్ని చాటుకుంది. గోరంట్ల పట్టణానికి చెందిన సినీ నిర్మాత జీఎం సురేష్, నటుడు మురళీధర్ స్పందించి చిన్నారి వైద్య చికిత్స నిమిత్తం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సహాయాన్ని అనంతపురానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు డిస్కవరీ అనిల్ ద్వారా చిన్నారి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ బ్యాన్ప రూపొందించిన ది అనంతపుర్ నైట్ డెమో చిత్ర పోస్టర్ను డిస్కవరీ అనిల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.త్వరలో ఈ చిత్రాన్ని జిఎంసి గ్యాలరీ ఫీలింగ్స్ యూట్యూబ్ ఛానెల్లో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కార్యక్రమంలో ది అనంతపుర్ నైట్ చిత్ర బృంద సభ్యులు, సాంకేతిక నిపుణులు, యాంకర్ రమేష్ నీల్, దర్శకుడు భాష తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐను కలిసిన గిరిజన హక్కుల పోరాట సమితి



**నేరేడుచర్ల, జూన్ 12 మనం న్యూస్:** నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సైదిరెడ్డిని గిరిజన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు లావుడ్యా శ్రీను నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని అందించారు.ఈ కర్యక్రమంలో గిరిజన నాయకులు బానోతు నాగరాజు నాయక్, నరేష్ నాయక్, శంకర్ నాయక్, గోపి నాయక్, బాలాజీనాయక్, బాలు నాయక్, నాగరాజు నాయక్, నాగేశ్వర్ రావు, గోపి పాల్గొన్నారు.

# జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మిక తనిఖీ



**పెద్దవడుగూరు జూన్ 12 మనం న్యూస్:** పెనకలపాడు వీరన్న పల్లి పంచాయతీ పరిధిలో ఆకస్మిక తనిఖీలు. పెద్దవడుగూరు మండలం పెనకలపాడు వీరన్న పల్లి పంచాయతీలోని చిట్టూ రు గ్రామంలో శుక్రవారం. జిల్లా పంచాయతీ అధికారి. టి నాగరాజు నాయుడు.. తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి. మాట్లాడుతూ. గ్రామాలలోని పరిసరాలు. ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని. ఇళ్లలోని చెత్తాచెదారం. ఎక్కడపడితే అక్కడ వెయ్యారాదని. రోజు ప్రభుత్వం చెత్త బండి. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని.. పంచాయతీ సిబ్బందికి తెలియజేశారు.ఇల్లు పరిసరాలు శుభ్రతగా ఉంటే అనారోగ్యాలు రావని. అదేవిధంగా ఐవిఆర్ ఫోన్ కాల్స్. గురించి ప్రజలకు. అవగాహన సూచించారు.. నిర్మాణంలో ఉన్న నూతన పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి. నిర్మాణంలో ఉన్న పంచాయతీ కార్యాలయాన్ని. త్వరగ తిన పూర్తి చేయాలని. పంచాయతీ సిబ్బందికి తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో. జి శ్రీదేవి. పంచాయతీ అభివృద్ధి అధికారి జంగా మధు మహబూబ్ బాషా. పంచాయతీ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు

# అడిషనల్ డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



**బెలుగుప్ప జూన్ 12 మనం న్యూస్:** జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి మరియు అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ జయలక్ష్మి జిల్లా పారామెడికల్ అధికారి నాగన్న తో కలిసి శ్రీరాంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఎన్.గుండ్లపల్లి నందు ఉన్న ఉపకేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు . ఈ సందర్భంగా ఉప కేంద్రంలోని పలు రికార్డులు పరిశీలించారు. ఎన్.గుండ్లపల్లి మండలంలో గత సంవత్సరం నుండి నమోదైన కుష్టు వ్యాధి, క్షయ వ్యాధి, హెచ్ ఐ వీ చికిత్స, ఎయిడ్స్ కు సంబంధించిన రికార్డులు, గర్భవతులకు సంబంధించిన హై రిస్క్ కేసుల రికార్డులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె వైద్యాధికారి డాక్టర్ ఋసికేష్ తో మాట్లాడుతూ ప్రతి గర్భవతికి పీహెచ్ సీ పరిధిలోనే అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించాలని, ముఖ్యంగా హెచ్ఐవి పరీక్షలు తప్పకుండా చేయాలని సూచించారు. ఏఎన్ఎమ్ లు గర్భవతుల నమోదు చేసిన వెంటనే వారికి సంబంధించిన అన్ని వివరాలు ఎంసీపీ కార్డులో రాయాలని , అభా ఐడి ఉంటేనే గర్భవతిగా నమోదు చేయాలని, ప్రతి గర్భవతి సుఖమైన కాన్పు ప్రభుత్వాసుపత్రిలోనే జరగాలని తెలిపారు. ముఖ్యంగా హై రిస్క్ గర్భవతుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వారిని తరచూ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళి సుఖమైన కాన్పు చేయించే బాధ్యత సంబంధిత ఆశా కార్యకర్త , ఎఎన్ఎమ్, ఎంఎల్.హెచ్ పీ తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజల ఆరోగ్యావసరాలు తీర్చే బాధ్యత మనపైనే ఉందని ప్రతి ఒక్కరూ ఈ విషయంలో శ్రద్ధ వహించాలని తెలిపారు. పీహెచ్ సీ కి వచ్చే గర్భవతుల పట్ల స్టాఫ్ నర్స్ లు జాగ్రత్త వహించి వారు సుఖవసవం ప్రసవం అయ్యే విధంగా సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పారా మెడికల్ ఆఫీసర్ నాగన్న, రమణ ఐసీటీసీమహేష డీపీస్,జఫర్ ఎంపీహెచ్ఇ ఓ నరమ్మా ఎం పి హెచ్ ఎస్ జయశ్రీ ఎం ఎల్ హెచ్ పి శ్రీవాని ఏఎన్ఎం ఆశాలు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ శాఖకు వాహనాల వేలంలో రూ.2 లక్షల 5 వేల ఆదాయం



**తుంగతుర్తి, జూన్ 12 (మనం న్యూస్):** తుంగతుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. ఈ వాహనాల వేలంపాట ఈ ఎస్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించామని తెలిపారు. 9 వాహనాలకు వేలంపాట నిర్వహించగా రూ. 2 ,05,910 రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్త్రులు మూర్తి ,జయ ప్రకాష్, ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

- **విద్యాభివృద్ధికి తోడ్పడాలి**
- **జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**బెలుగుప్ప, జూన్ 12 మనం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పెద్దఎత్తున చేర్పించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కాగా, బెలుగుప్ప మండలం కాలువపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు, ఎన్రోల్మెంట్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంతమంది విద్యార్థులు పాఠశాలలో చేరారు, ఆరో తరగతి, ఏడవ, తరగతి వారిగా ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలకు ఎంతమంది వచ్చారు, తదితర వివరాలు పాఠశాల హెచ్ఎంని అడిగి తెలుసుకున్నారు. ఇందులోభాగంగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ఈరోజు అన్ని పాఠశాలలు తెరుచుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను మరింతమందిని చేర్పించాలని, విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుత్తి డివిజన్ ఎడ్యుకేషన్ అధికారి లక్ష్మన్న, ఎంఈఓలు గోవిందరాజులు, హరికృష్ణ, పాఠశాల హెడ్మాస్టర్ సుధామని, మండల డిప్యూటీ తహసీల్దార్, విద్యార్థులు, స్కూల్ కమిటీ చైర్మన్, సభ్యులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గంలో వైసీపీ గర్జన.. హోరెత్తిన నినాదాలు




**కళ్యాణదుర్గం,జూన్ 12 మనం న్యూస్:** కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, వైసీపీ శ్రేణులు చేపట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమం కళ్యాణదుర్గంలో మాజీ ఎంపీ కళ్యాణదుర్గం సమయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ ఎత్తున సాగింది. నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ కార్యకర్తలు సింహాల్లా గర్జించడంతో పట్టణ ప్రధాన వీధులన్నీ ఆ పార్టీ నినాదాలతో దద్దరిల్లిపోయాయి.

### ప్రజా గళం.. జన జాతర

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆ ప్రభుత్వం ప్రజలకు చేసిన ద్రోహాన్ని నిరసిస్తూ వైసీపీ స్థానిక నాయకత్వం పిలుపునిచ్చిన ఈ ర్యాలీకి ఊహించని స్పందన లభించింది. వేలాదిగా తరలివచ్చిన వైసీపీ శ్రేణులు, ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను చాటిచెప్పారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన ఈ ర్యాలీ, ఒక భారీ బహిరంగ ప్రదర్శనను తలపించింది.

### కవ్వింపులకు బెదరని ధీరత్వం

ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతలు రాజకీయంగా వేడిని పెంచాయి. మార్గమధ్యలో టీడీపీ వర్గీయుల నుండి ఎదురైన కవ్వింపులను వైసీపీ శ్రేణులు ఏమాత్రం లెక్కచేయలేదు. ఎక్కడా వెనకడుగు వేయకుండా, అత్యంత సంయమనంతోనే తమ నిరసనను కొనసాగించడం విశేషం. వైసీపీ కార్యకర్తల తెగువ, నాయకుల దూకుడు అక్కడ ఆసక్తికర చర్చకు దారితీశాయి.

# గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు ప్రజల భాగస్వామ్యంతో రూపొందించాలి



- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్, జూన్ 12(మనంన్యూస్):** గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలతో జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో అన్ని శాఖల సమన్వయంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారిస్తూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో వివిధ శాఖల ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులను గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో పొందుపరచడం ద్వారా నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయితీ డెవలప్మెంట్ ప్లాన్ గ్రామసభ సమావేశాలకు అన్ని శాఖల గ్రామస్థాయి అధికారులు, మహిళలు, యువత, రైతులు మరియు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్), వైవీ గణేష్, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కల్పనా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) నాగ పద్మజ, సంబంధిత మండలాల ఎంపీడీవోలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం ప్రజల పక్షాన అండగా నిలుస్తుంది

## పేదలకు గూడు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జీవితాల్లో కొత్త ఆశలకు నాంది

## గ్రామీణ పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

## రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు, జూన్ 12 ,మనం ప్రతినిధి,** ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన అండగా నిలుస్తుందని, పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గ్రామీణ పేద కుటుంబాల జీవితాల్లో కొత్త ఆశలకు నాంది పలుకుతున్నామని, గ్రామీణ నిరుపేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం మల్లంపల్లి మండలంలోని ముద్దునూరు తండ గ్రామంలో రూ.1 కోటి వ్యయంతో 30 ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరు, శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించి, లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముద్దునూరు తండ గ్రామంలో మొదటి విడతలో 6 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, రెండో విడతలో పైలట్ ప్రాజెక్టు కింద 24 ఇండ్లను ఎంపిక చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే నూతన పెన్షన్ల పంపిణీ కూడా చేపడతామని తెలిపారు. స్థానిక అభివృద్ధి పనులు, గ్రామ సమస్యలను స్థానిక గ్రామపంచాయతీ సర్పంచుల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు ప్రతి మహిళ తప్పనిసరిగా మహిళా సంఘాల్లో సభ్యురాలిగా చేరాలని, మహిళా సంఘాల ద్వారా మహిళలకు అనేక ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మహిళలు సంఘాల్లో చేరితే ఇంట్లోనే ఒక బ్యాంక్ ఉన్నట్టేనని వ్యాఖ్యానించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చిన మంత్రి, ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు, నాణ్యమైన విద్య, మెరుగైన ఫలితాలతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మంజూరు చేసిన ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజా దర్బార్లో అందిన దరఖాస్తులను పరిశీలించి, వెరిఫికేషన్ అనంతరం అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్వో వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి., ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలి



- విద్యార్థుల భద్రత కోసం మెగా శానిటేషన్ కార్యక్రమం
- డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి
- మంత్రి సీతక్క.

**ములుగు, జూన్ 12, మనం ప్రతినిధిః** పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని, పాఠశాలల పునఃప్రారంభానికి ముందే హాస్టళ్లలో పరిశుభ్రత, భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని, విద్యార్థుల భద్రత కోసం మెగా శానిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని గడిగడ్డ షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహంలో నిర్వహించిన శానిటేషన్ డ్రైవ్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పాల్గొని వసతి గృహంలోని గదులను పరిశీలించారు. అనంతరం ములుగు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి క్రిటికల్ కేర్ విభాగము లోని,డయాలసిస్ యూనిట్,ఎమర్జెన్సీ వార్డు లను మంత్రి దనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భాల్లో మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాలలు, వసతి గృహాలకు చేరుకునే ముందు వసతి గదులు, తరగతి గదులు, వంటశాలలు, హాస్టళ్ల పరిసరాలు పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెలవుల సమయంలో మూసివున్న భవనాల్లో పాములు, తేళ్లు, జెర్రులు వంటి ప్రమాదకర జీవులు చేరే అవకాశం ఉన్నందున పిల్లల భద్రత దృష్ట్యా స్కూల్ రీఓపెనింగ్కు ముందే ప్రత్యేక మెగా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డీఈఓ, హాస్టల్ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మెగా శానిటేషన్ కార్యక్రమానికి అవసరమైన సూచనలు జారీ చేశామని తెలిపారు. అందులో భాగంగానే జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. పిల్లలు వచ్చిన తర్వాత ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని, ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తే విద్యార్థులకు మరింత సురక్షిత వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా నిర్మాణంలో ఉన్న డయాలసిస్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వికాస్ మీనా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, సూపరిండెంట్ చంద్రశేఖర్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,స్థానిక కౌన్సిలర్లు,జిల్లా అధికారులు, వైద్యాధికారులు,కో ఆప్షన్ సభ్యులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌ను ఎగుమతుల హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యం




- జిల్లా కలెక్టర్ సత్యశారద

**వరంగల్, జూన్12(మనంన్యూస్):** వరంగల్ జిల్లాలో ఎగుమతులను ప్రోత్సహించి జిల్లాను ఎగుమతుల కేంద్రంగా (ఎక్స్పోర్ట్ హబ్) తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ఇంటిగ్రేటెడ్ మెగా ఎక్స్పోర్ట్ ప్రమోషన్ ప్రోగ్రామ్' నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాయింట్ డీజీఎఫ్టీఈ (ృఎఊఖీ) ఎస్.ఎ. చవాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో జిల్లాలో ఉత్పత్తి అవుతున్న పత్తి, మిర్చి, పసుపు, కార్పెట్లు తదితర ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న అవకాశాలపై చర్చించారు. స్థానిక ఉత్పత్తులను ఎగుమతుల ద్వారా ప్రపంచ మార్కెట్లకు చేరవేసి రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. జిల్లాను ఎగుమతుల హబ్గా మార్చేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, రవాణా, నిల్వ సదుపాయాలు, ఎగుమతిదారులకు అవసరమైన మార్గదర్శకత్వం కల్పించాల్సిన అవసరాన్ని కలెక్టర్ సత్యశారద ప్రస్తావించారు. ఎగుమతుల ప్రోత్సాహానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి ఆధ్వర్యం లో వ్యవసాయ, ఉద్యానవన, పరిశ్రమల శాఖల అధికారులు, నాబార్డ్, ఎల్డీఎం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపార మరియు పారిశ్రామిక సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

**ములుగు, జూన్ 12(మనంన్యూస్):** శుక్రవారం మల్లంపల్లి మండలంలోని ముద్దునూరు తండ గ్రామంలో రూ.1 కోటి వ్యయంతో 30 ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరు, శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించి, మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి., ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కబడ్డీ పోటీల కరపత్రం ఆవిష్కరణ

**భీమదేవరపల్లి, జూన్ 12 మనం న్యూస్:** గాంధీనగర్ లో కబడ్డీ పోటీల కరపత్రం నిర్వాహకులు ఆవిష్కరించారు. శుక్రవారం రోజున కబడ్డీ పోటీల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాంధీనగర్ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి, ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్పర్సన్ సుహాసిని హాజరై సంయుక్తంగా కరపత్రం ఆవిష్కరించే అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ క్రీడా కబడ్డీ గ్రామీణ స్థాయిలో ఏర్పాటు చేసి యువత పెడుదోవ పట్టకుండా, అసాంఘిక కార్యక్రమాలను ఆకర్షించకుండా యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు క్రీడలు తోడ్పడతాయని గాంధీనగర్ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి అన్నారు. యువత ఆన్లైన్ గేమ్స్తో మానసిక ఒత్తిడికి లోనై, మద్యానికి డ్రగ్స్ కు బానిసై ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ క్రీడా స్ఫూర్తిని పెంచి మానసిక శారీరక దృఢత్వానికి క్రీడలు తోడ్పడతాయని ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్పర్సన్ సుహాసిని అన్నారు గ్రామీణ స్థాయిలో కబడ్డీ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ , వరంగల్ జిల్లాల క్రీడాకారులు పాల్గొంటారని జూన్ 20 నుండి 21 వరకు పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తాళ్లపల్లి కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తాళ్లపల్లి అరవింద్, అశోక్, అజయ్, సాహూ, ఉప సర్పంచ్ బుర్ర సమ్మయ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- సమాజ ఆర్థిక అభివృద్ధి మహిళలతోనే సాధ్యం
- మంత్రి పొన్నం సతీమణి మంజుల

**భీమదేవరపల్లి జూన్ 12 మనం న్యూస్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరిబాధ్యతగా ఉండాలని మంత్రి పొన్నం సతీమణి మంజుల అన్నారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలోని మండలం మహిళా సంఘం అధ్యక్షురాలు షబానా అధ్యక్షతన మహిళా సమాఖ్య కార్యాలయంలోఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొన్నంమంజుల హాజరై మండల స్థాయిలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రధానం చేసి అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే తరాలకు స్వచ్ఛమైన పరిశుభ్రమైన గాలి నీరు భూమి అందించడమే ప్రతి ఒక్కరి బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. స్టీల్ పాత్రలను వినియోగిస్తూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రతి ఒక్క మహిళకు సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని రాబోవు వర్షాలకు అనుకూలంగా ఉంటుందని స్వచ్ఛమైన గాలి వాతావరణం ఏర్పడడానికి కారణమవుతుందని అన్నారు. అనంతరం సీసీలకు,వివోలకు మహిళా సంఘాల అధ్యక్షులకు, చీరలు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కేతిరి లక్ష్మారెడ్డి, ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఏబీ ఎంవేణు ,తదితర మహిళా సంఘాల అధ్యక్షులు, సీసీలు, వివోలు, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మండల గ్రామాల్లోని మహిళా విజేతలు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జాతీయ విద్యార్థి పర్యావరణ కార్యక్రమ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

- జిల్లా కలెక్టర్ డా. సత్యశారద




**వరంగల్, జూన్ 12(మనంన్యూస్):** వరంగల్ కలెక్టరేట్లో పర్యావరణ పరిరక్షణ, హరితహారం కార్యక్రమ విస్తరణ, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్‌పై, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం) - విత్తడం నుండి పెరగడం వరకు 2026 జాతీయ స్థాయి విద్యార్థి పర్యావరణ పోటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ను జిల్లా కలెక్టర్ డా. సత్యశారద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా, విద్యార్థుల్లో బాధ్యతాభావం, సేవా భావం, ప్రకృతి ప్రేమను పెంపొందించే ఉద్యమంగా మారాలని ఆమె పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి మొక్కను జీవంగా భావించి కాపాడాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. పాఠశాలలు, కళాశాలలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి విద్యార్థులను భాగస్వాములను చేయాలని కలెక్టర్ సూచించారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ జాతీయ స్థాయి పోటీలో విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, పరిశోధకులు, యువతతో పాటు సాధారణ ప్రజలు కూడా పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వాటి ఫోటోలు మరియు వివరాలను నిర్దిష్ట పోర్టల్లో అప్లోడ్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. జిల్లాలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా హరిత వరంగల్ నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి విద్యాసంస్థ ఈ కార్యక్రమాన్ని ఉద్యమాత్మకంగా తీసుకొని అమలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు కోరారు. పర్యావరణ పరిరక్షణను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా మార్చడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి విజయలక్ష్మి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ యూ. సుజన్ తేజ, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. సాంబశివరావు, ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ డా. కట్ల శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతి చెంచు కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమాలు అంది తీరాలి

- చెంచు గిరిజనుల అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ఐటీడీఏ మన్ననూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సమీక్ష



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 12 (మనం బ్యూరో):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం మండలం మన్ననూర్ గ్రామంలోని ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఐటిడిఏ కార్యాలయంలో సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. చెంచు పెంటలలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...... చెంచు గిరిజనులు, అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలవారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. చెంచు కుటుంబాలకు విద్య, ఆరోగ్యం, తాగునీరు, పోషకాహారం, వనరులు, విద్యుత్, ఉపాధి అవకాశాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ పనితీరును సమీక్షిస్తూ చెంచు పెంటర్లలోని పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు, ఐటీడీఏ, ఇతర సంస్థల సహకారంతో చెంచు యువతకు ఉపాధి కల్పనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. చెంచు పెంటల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన చోట్ల సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే రేషన్ కార్డుల సమస్యలు, ఆధార్ సంబంధిత ఇబ్బందులు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన అంశాల పరిష్కారం కోసం ప్రత్యేక సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మొబైల్ నెట్వర్క్ అందుబాటులో ఉన్న చెంచు పెంటలను గుర్తించి అక్కడ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నెట్వర్క్ సౌకర్యం లేని ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు తాత్కాలిక (టెంపరరీ) సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆధార్, రేషన్ కార్డు, ప్రభుత్వ ధ్రువపత్రాలు తదితర సేవలు సకాలంలో అందేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గిరిజనులకు సేవలందించడంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి చెంచు కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అదేవిధంగా చెంచు పెంటర్లలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, గృహనిర్మాణం, అభివృద్ధి పనులు ,విద్యుత్, పోషకాహార కార్యక్రమాలు, అంగన్వాడీ సేవలు, జీవనోపాధి పథకాల పురోగతిని కూడా సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్న కలెక్టర్, శాఖల మధ్య సమన్వయం పెంచుకొని చెంచు గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఇంచార్జ్ డిటిడబ్ల్యుఓ ఉమాపతి, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, మిషన్ భగీరథ ఈఈ హేమలత, ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ జాఫర్ హుస్సేన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



## జంధ్యాల స్టైల్‌లో అనిల్ ప్రమోషన్స్..

టాలీవుడ్ హిట్ మిషన్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ప్రస్తుతం తన నెక్స్ట్ ప్రాజెక్ట్ ను తెరకెక్కించేందుకు రెడీ అవుతున్నాడు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ లతో కలిసి ఓ క్రేజీ మల్టీస్టారర్ చిత్రాన్ని రూపొందించేందుకు అనిల్ రావిపూడి సిద్ధమవుతున్నాడు. అయితే, ఈ సినిమాలోకి ఓ స్టార్ టెక్నీషియన్ ను ఆహ్వానిస్తూ అనిల్ రావిపూడి మరోసారి తనదైన వెరైటీ ప్రమోషన్స్ ను స్టార్ట్ చేశాడు.

ప్రమోషన్స్ ను వెరైటీగా చేయడంలో అనిల్ రావిపూడి దిట్ట. ఇక 'వెంకీ-అనిల్5' అనే ట్యాగ్ తో తెరకెక్కనున్న ఈ కొత్త సినిమాకు సంగీత దర్శకుడిగా నేషనల్ అవార్డ్ విన్నర్ జి.వి.ప్రకాష్ ను ఫిక్స్ చేశారు మేకర్స్. దీనికి సంబంధించి తాజాగా ఓ అనౌన్స్ మెంట్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. జంధ్యాల స్టైల్ లో అనిల్ రావిపూడి ఈ వీడియోను తీర్చిదిద్దిన తీరు ప్రస్తుతం టాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

జి.వి.ప్రకాష్ కూడా అనిల్ రావిపూడి మార్క్ ప్రమోషన్స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, లాస్ట్ లో లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్ కూడా ఈ వీడియోలో కనిపించడంతో ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటున్నారు. మొత్తానికి సినిమా షూటింగ్ ప్రారంభం కాకముందే, అనిల్ రావిపూడి తనదైన మార్క్ తో కామెడీ పండిస్తున్నాడు. ఇక ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుండగా షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## సింగతో వస్తున్న మ్యాచో స్టార్..!



మ్యాచో స్టార్ గోపీచంద్ నేడు(జూన్ 12) తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు తన నెక్స్ట్ చిత్రాల నుంచి వరుస అప్డేట్స్ ఇస్తూ వారిని ఖుషీ చేస్తున్నాడు. ఇప్పటికే 'భరతవర్ష' మూవీ నుండి బర్త్ డే పోస్టర్ రిలీజ్ కాగా, తాజాగా గోపీచంద్ నటిస్తున్న 34వ చిత్రానికి సంబంధించిన టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు.

యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ ఈ సినిమాతో దర్శకుడిగా మారుతుండగా ఈ చిత్రానికి 'సింగ' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ను ఫిక్స్ చేశారు. ఇక ఈ టైటిల్ గ్లింప్స్ లో గోపీచంద్ పూర్తి రా అండ్ రస్టిక్ అవతారంలో ఉగ్రరూపంలో కనిపిస్తున్నాడు. ఈ గ్లింప్స్ చూస్తుంటే, ఇది పవర్ ఫుల్ యాక్షన్ డ్రామాగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది.

ఇక ఈ సినిమాలో గోపీచంద్ సరసన అనార్కలి నాజర్ హీరోయిన్ గా నటిస్తుండగా ఈ చిత్రానికి సామ్ సిఎస్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 70ఎంఎం ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు 'కేన్ మామ' వీడ్కోలు

న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్ కు వీడ్కోలు పలికాడు. ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ జరుగుతుండగానే అతడు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 35 ఏళ్ల కేన్ కివీస్ తరఫున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20లు ఆడాడు. తన 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్ లో 19వేలకుపైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి. దాదాపు ఎనిమిదేళ్లపాటు (2016-24) న్యూజిలాండ్ కు



సారథ్యం వహించాడు. రెండుసార్లు ఐసీసీ వరల్ కప్ ఫైనల్స్ కు తన జట్టును చేర్చాడు. తొలి ఐసీసీ టెస్టు ఛాంపియన్ షిప్ విజేతగా కివీస్ నిలవడంలో కేన్ కెప్టెన్సీదే కీలక పాత్ర.

2010లో అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన కేన్ విలియమన్స్ గతేడాది టీ20లకు వీడ్కోలు పలికాడు. ఇప్పుడు మిగతా రెండు ఫార్మాట్లకూ గుడ్ బై చెప్పేశాడు. ''ఆటకు వీడ్కోలు పలకడంపై గత కొన్ని రోజులుగా ఆలోచిస్తూనే ఉన్నా. ఇప్పుడు ఇదే సరైన సమయంగా భావిస్తున్నా. అంతర్జాతీయ క్రికెట్ పట్ల నాకు ఎప్పుడూ బలమైన తపన, ఆసక్తి ఉండేవి. న్యూజిలాండ్ తరఫున ఆడిన ప్రతి మ్యాచ్ లోనూ నా సర్వశక్తులూ ఒడ్డా. ఆ భావనే నన్ను గర్వపడేలా చేస్తోంది. ఇలాంటి గొప్ప జట్టుకు నాయకత్వం వహించడమూ ఆనందంగా ఉంది. నా మనసులో ఎప్పుడూ టీమ్ కు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇన్నేళ్లూ జట్టులో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నా'' అని కేన్ తెలిపాడు.

**సన్ రైజర్స్ తో అనుబంధం..**

కేవలం కివీస్ ప్లేయర్ గానే కాదు.. తెలుగు క్రికెట్ అభిమానులకూ కేన్ విలియమ్సన్ సుపరిచితుడు. సన్ రైజర్స్ హైదరాబాద్ కు గతంలో నాయకత్వం వహించాడు. అతడి సారథ్యంలో ఎస్ఆర్హెచ్ ఫైనల్ కూ దూసుకెళ్లింది. 2016లో ఛాంపియన్ గా అవతరించిన జట్టులోనూ అతడు సభ్యుడే. తెలుగు రాష్ట్రాల ఫ్యాన్స్ కు 'కేన్ మామ'గా మారిపోయాడు. ఐపీఎల్ లో 79 మ్యాచులు ఆడిన కేన్ 2,128 పరుగులు చేశాడు.

**వ్యక్తిత్వంలోనూ..**

న్యూజిలాండ్ ఆటగాళ్లు సౌమ్యంగానే ఉంటారు. ప్రత్యర్థులను గౌరవించడంలో, క్రీడాస్ఫూర్తిలో ముందుంటారు. ఇక కేన్ విలియమ్సన్ కూడా ప్రత్యర్థి ఆటగాళ్లతో గొడవలు పడిన సందర్భాలు దాదాపు లేవనే చెప్పొచ్చు. విరాట్ కోహ్లీ, కేన్ మంచి స్నేహితులు. వీరిద్దరికీ అండర్ -19 రోజుల నుంచే పరిచయం. ఇప్పటికీ అదే స్నేహంతో ఉండటం విశేషం.



## ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 సెమీస్‌కు పీవీ సింధు

తెలుగు తేజం, స్టార్ షట్లర్ పీవీ సింధు అద్భుత ఫామ్ లో ఉంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో సెమీస్ కు దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్ లో తైపీకి చెందిన చెన్ సు యుపై 21-6, 21-9 తేడాతో పీవీ సింధు విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన పోరులో కేవలం 27 నిమిషాల్లోనే చెన్ ను చిత్తు చేయడం గమనార్హం. ఈ తైపీ ప్లేయర్ ఏమాత్రం ప్రతిఘటన ఇవ్వలేకపోయింది. సెమీస్ లో జపాన్ కు చెందిన యమగుచితో సింధు తలపడనుంది. వీరిద్దరిలో సింధు 15-13 ఆధిక్యంలో ఉంది.



## వైభవ్ అంతర్జాతీయ క్రికెట్ అరంగేట్రంలో జాప్యం..?

దేశవాళీలో అదరగొట్టి.. ఐపీఎల్ లో దుమ్మురేపిన 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ జాతీయజట్టుకు ఎంపికైన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడి పేరిట అతిపిన్న వయస్కుడైన క్రికెటర్ గా రికార్డు ఉంది. ప్రస్తుతం వైభవ్ భారత్ అ జట్టుతో శ్రీలంక పర్యటనలో ఉన్నాడు. దీని తర్వాత ఐర్లాండ్, ఇంగ్లాండ్ తో టీ20లు జరగనున్నాయి. ఆ సిరీస్ ల్లో వైభవ్ సూర్యవంశీ ఎలా ఆడతాడనే ఆసక్తి అందరిలోనూ ఉంది. అయితే, వైభవ్ టీమ్ఇండియా అరంగేట్రం కాస్త ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఐర్లాండ్ లో అంతర్గతంగా తలెత్తిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సిరీస్ జరుగుతుందా? లేదా? అనే సందేహాలు మొదలయ్యాయి.

## టబు సినిమా సీక్వెల్‌తో కత్రినా కమ్‌బ్యాక్!

నాజూకు అందాలతో కుర్రకారును కిర్రెక్కించిన ముద్దుగుమ్మ కత్రినా కైఫ్ తెరపై కనిపించి ఏడాదిన్నర అవుతోంది. చివరిసారిగా ఆమె 2024 డిసెంబరులో విడుదలైన 'మేరీ క్రిస్మస్'తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. నటుడు విక్కీ కౌశల్ ను వివాహం చేసుకున్న కత్రినా.. గతేడాది సెప్టెంబరులో తల్లిని కాబోతున్నట్లు ప్రకటించి అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది. మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు కొన్నాళ్ల పాటు నటనకు విరామం ఇస్తున్నట్లు వెల్లడించింది. అప్పటినుంచి ఆమె కొత్త సినిమాకు సంబంధించిన కబుర్లేవీ వినిపించలేదు. అయితేనేం.. సినిమాలకు బ్రేక్ ఇచ్చినా, ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. 'స్టార్స్ ఇండియా లవ్' పేరిట ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో 2025కిగానూ టాప్ 5లో చోటుదక్కించుకొని.. అలియా భట్, దీపికా పదుకొణె, శ్రద్ధాకపూర్, కృతిసనన్ ల సరసన నిలిచింది. మరోవైపు, కత్రినా కమ్ బ్యాక్ ఎప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు కిక్ ఇచ్చే వార్త ఒకటి బాలీవుడ్ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది.

అదేంటంటే.. 2001లో టబు ప్రధాన పాత్రలో నటించిన 'చాందినీ బార్' సీక్వెల్ లో కత్రినా నటించబోతోందట. వాస్తవిక ప్రపంచంలోని వెలుగునీడలను వెండితెరపై ఆవిష్కరిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మధుర్ భండార్కర్ 'చాందినీ బార్'ను తెరకెక్కించారు. ఆ చిత్రం విమర్శకుల ప్రశంసల్ని సైతం అందుకోవడంతో పాటు గత్యంతరం లేని పరిస్థితుల్లో బార్ డ్యాన్సర్ గా మారిన పాత్రలో టబు నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. దానికి సీక్వెల్ ను తెరకెక్కించబోతున్నట్లు గతేడాది అధికారిక ప్రకటన వచ్చింది. 'సెక్షన్ 375' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న అజయ్ బహల్ 'చాందినీ బార్2'కు దర్శకుడిగా వ్యవహరించనున్నారు. అయితే, ప్రధాన పాత్రలో ఎవరు నటించబోతున్నారన్న విషయాన్ని నిర్మాణ సంస్థ ఇంకా ప్రకటించలేదు. ఇప్పుడు ఆ అవకాశం కత్రినాను వరించినట్లు బాలీవుడ్ వర్గాల్లో టాక్. ఇందులో టబు కూడా నటించబోతున్నట్లు తెలుస్తోంది. అదే నిజమైతే కత్రినా అభిమానుల ఎదురుచూపులు ఫలించినట్లే!





## నాగ్ ఆ సినిమాను పక్కనబెట్టాడా..?

కింగ్ అక్కినేని నాగార్జున 'సోగ్గాడే చిన్ని నాయన' సీక్వెల్ మూవీపై అన్నపూర్ణ స్టూడియోస్ గతంలో ఓ ప్రకటన చేసింది. అయితే, ఇప్పటివరకు ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లలేదు. దీనికి కారణం నాగార్జున తన ప్రతిష్టాత్మక 100వ సినిమాను 2027 సంక్రాంతి బరిలో నిలపాలని ప్లాన్ చేయడమే అని తెలుస్తోంది. రా కార్తీక్ దర్శకత్వంలో క్రైమ్ అండ్ మనీ హీస్ట్ థ్రిల్లర్ గా ఈ వందో చిత్రం రూపొందుతోంది.

ఈ ఏడాది ఆగస్టు నుండి డిసెంబర్ వరకు 'జైలర్ 2', 'విశ్వంభర', 'స్వయంభు' వంటి ఎన్నో భారీ పాన్-ఇండియా సినిమాలు క్యూ కట్టి ఉండడంతో.. వాటితో పోటీ పడటం కంటే నేరుగా సంక్రాంతి పండగ సీజన్ లో రావడమే బెటర్ అని నాగ్ భావిస్తున్నాడట. ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో చాలా కాలం తర్వాత నాగార్జున సరసన టబు నటిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ఈ క్రమంలోనే సోగ్గాడే చిన్ని నాయన సీక్వెల్ చిత్రాన్ని ప్రస్తుతానికి నాగ్ పక్కన పెట్టినట్లు ఇండస్ట్రీ వర్గాల టాక్.

యంగ్ డైరెక్టర్ అయినప్పటికీ రా కార్తీక్ ఈ పీరియాడిక్ కథను, నాగార్జున విభిన్న షేడ్స్ లుక్స్ ను అద్భుతంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇందులో నాగ్ లుక్ కోసం 'డీ-ఏజింగ్' టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నారట. దసరా కానుకగా ఈ సినిమా ఫస్ట్ టీజర్ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## నాని చిత్రంలో రుక్మిణి?

'సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశముందని సమాచారం.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.